# క్రాంతి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్) ఏ.పి. రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 28 సంచిక : 1 మార్చి-మే 2004 వెల : ఐదురూపాయలు


**లోపలి పేజీల్లో.......**


| | | |
|---|---|---|
| భూటాన్‌పై సైనిక చర్య | - | 7 |
| విప్లవ సంస్కరణలు | - | 10 |
| పోలియో చుక్కల మందు | - | 13 |
| చైనాలో పెట్టుబడిదారీవిధానం | - | 15 |
| మేధో వలస | - | 18 |
| అమరుల జీవిత చరిత్రలు | - | 23 |
| పోరాట వార్తలు | - | 30 |


# ప్రజాయుద్ధం (పీపుల్స్‌వార్) బలపడాల్సిన అవసరాన్ని, అందుకుగల అవకాశాల్ని చాటుతున్న 'ఎలక్షన్-2004' ఫలితాలు

2004 ఏప్రిల్-మే లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఒరిస్సా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకి జరిగిన ఎన్నికలలో అటు కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వం కుప్పకూలాయి. చంద్రబాబు ప్రభుత్వానిది మరీ ఘోర పరాజయం! ఎన్నికల ఫలితాల ప్రకటన ప్రారంభమయ్యేంత దాకా ఎన్‌డిఏ, టిడిపి ప్రభుత్వాధినేతలు తమ ఘనవిజయంపట్ల ధీమాను వ్యక్తం చేస్తూనే వచ్చారు. ఇది సహజమే. కాని తమ ధీమాలో వారు ప్రదర్శించిన దుర్గర్వం, దురహంకారాలు సహింపశక్యం కానివి. సంకీర్ణం అవసరమే వుండదని, తమ పార్టీయే ప్రభుత్వాన్ని నడపగలంతటి బలంతో నెగ్గుకురాగలదని బిజెపి భావించింది, భ్రమించింది. కనుకనే సంకీర్ణాలు నడపడంలో తాను అలసిపోయినందున అలాంటి అవసరాన్ని తప్పించి తమ పార్టీకే పట్టం కట్టమని వాజ్‌పాయి ప్రజలకి పిలుపునిచ్చాడు. ఇక అద్వానీ కట్టిన గాలిమేడల గూర్చి చెప్పనవసరమే లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని; ఆ కారణంగా పార్లమెంటులో ప్రతిపక్షమే లేని ఒక అసాధారణ, విచిత్ర పరిస్థితి తలెత్తనుందని; అది ప్రజాస్వామ్యానికి అనారోగ్యకరం కనుక తాను మాత్రం అలాంటి పరిస్థితిని కోరుకోవడం లేదని నాటకీయ గంభీరతని ఒలకబోసాడు. ఇక వెగటుపుట్టించే ఆత్మస్తుతి పరనిందలతో వెంకయ్యనాయుడు, చంద్రబాబునాయుడులు సాగించిన డంబాకోరు, దగాకోరు ప్రచారహోరు గూర్చి చెప్పనే అఖ్ఖర్లేదు.

ఈ అబద్దాలకోరు అతి ప్రచారానికి బిజెపి, టిడిపిలు ఎందుకు పాల్పడ్డాయి? తమ ఘోర పాలనా వైఫల్యాలన్నింటి నుండీ ఈ హైటెక్ ప్రచారహోరు తమని బయటపడవేయ గలదనే గట్టి భ్రమలకి వారు లోనయ్యారు. ప్రధాన స్రవంతిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు (పత్రికలు, టీవీలు) వారికి చాలామట్టుక్కి అలాంటి దుర్భ్రమల్ని కలిగించాయి. సామ్రాజ్యవాద 'సంస్కరణలకి', మార్కెట్ దుష్ట సంస్కృతికి మోకరిల్లిపోయిన ఈ ప్రభుత్వాలు ప్రజాభిప్రాయాన్ని సైతం ఒక మార్కెట్ సరుకుగానే భావించాయి. ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో, మలచడంలో, నియంత్రించడంలో 'ప్రచారం' పాత్ర తక్కువైనది కాదు. 50శాతం మాత్రమే వుండే వాస్తవాన్ని 100శాతం వాస్తవంగా చెలామణి చేసుకుపోవడం కష్టం కాకపోవచ్చు. కాని, 5శాతంగా కూడాలేని వాస్తవాన్ని 100శాతం వాస్తవంగా చిత్రించుకో ప్రయత్నించడం మాత్రం దురాశ, దుస్సాహసం! అవి బెడిసి కొడతాయి. బిజెపి, టిడిపి విషయంలో సరిగ్గా జరిగిందిదే.

## ఎన్‌డిఏ పాలనలో ఎండిపోయిన భారత్

ప్రపంచం మొత్తంలో వుండే పేదలలో 30శాతం మంది భారతీయులేనని; ప్రపంచ నిరక్షరాస్యుల మొత్తంలో 30శాతం భారతీయులేననీ, ప్రపంచ మొత్తంలో బడికి దూరం అయిన 115 మిలియన్ల మంది పిల్లలలో 40 మిలియన్ల మంది భారతీయులేనని ప్రపంచ మొత్తం పోలియో కేసులలో 90శాతం భారతదేశంలోనే నమోదవుతున్నాయని 2003 సంవత్సరపు 'మానవ అభివృద్ధి నివేదిక' (హెచ్‌డిఆర్) తేల్చి చెప్పింది. ఎన్‌డిఏ హయాంలో పారిశ్రామిక వృద్ధిరేటు ఒక శాతం తగ్గిపోయింది, దేశంలోని సంఘటితరంగంలో 2.1 కోట్ల మంది కార్మికులు కటిక దరిద్రంలో మగ్గుతున్నారు. ఎలకతోక వాటంగా ప్రతి సంవత్సరం క్షీణిస్తున్న వ్యవసాయాభివృద్ధి రేటు 2002-03 సంవత్సరానికి మరీ ఘోరంగా పతనమై -3.1 శాతం ఋణాత్మక వృద్ధిరేటుగా నమోదయ్యింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభ స్థితి నేపధ్యంలో డాలర్ విలువ పతనమై రూపాయి విలువ కాస్తంత నిలకడ సాధించినందున సాధారణ వృద్ధిరేటు శాతం కొంత పెరిగినప్పటికీ వుద్యోగం/ఉపాధి వృద్ధిరేటు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడలానే మిగిలింది. ఎన్‌డిఏ పాలనలో దేశంలో నిరుద్యోగ యువత 100 మిలియన్లకి చేరారు. రైల్వే వుద్యోగాల నియామకం సందర్భంగా అస్సాం-బీహార్ రాష్ట్రాల మధ్య 2003 సంవత్సరంలో చెలరేగిన రక్తపాత ఘర్షణలకి ఇలాంటి దుస్థితే కారణం. మన దేశంలోని పాఠశాలల కళాశాలల విద్యార్థులు భరింపశక్యంకాని మానసిక వత్తిడికి, అభద్రతాస్థితికి లోనవుతున్నారని; 48శాతం మంది మనోవైకల్యాలకి గురవుతున్నారని; 2010 నాటికి ఇది మరింత ప్రమాదకరంగా మారనుందని; మన విద్యార్థి యువతలో 15శాతం

మంది నిరంతరం ఆత్మహత్య తలంపుతో వుంటున్నారని; 2002-03 సంవత్సరంలో 8.6శాతం మంది భారతీయ విద్యార్థులు ఆత్మహత్యలకు తలపడ్డారని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' నిగ్గుతేల్చింది.

ఎన్.డి.ఏ పాలనలోని అభివృద్ధి అంతా ఉపాధి ఉద్యోగ కల్పనలులేని అభివృద్ధి. ఇంకో మాటలో చెప్పాలంటే కొద్దిమంది దళారీగాళ్లు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికార్లు, బడా వ్యాపార్లు పెరుగుతున్న సంపదనంతా సమృద్ధిగా పంచుకుతింటూ అశేష జనసామాన్యానికి ఆకలిని, అప్పుల్ని మాత్రం అందిస్తున్నారు. పర్యవసానంగానే దేశంలో వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, ఆదాయ అంతరాలు, ఆహార అభద్రత, ఆకలిచావులు, ఆత్మహత్యలు పెరిగిపోయాయి. లోక్‌సభ ముందస్తు రద్దుకి రెండు రోజుల ముందు (3.2.04) మాజీ కేంద్ర ఆర్థిమంత్రి జశ్వంత్‌సింగ్ హడావిడిగా పార్లమెంట్‌లో 2004 సంవత్సరపు తాత్కాలిక బడ్జెట్‌ని ప్రవేశపెట్టాడు. ఆ బడ్జెట్‌లో పారిశ్రామిక, సంపన్న మధ్యతరగతి వర్గాలకి వరాల జల్లులు కురిపించిన ఎన్‌డిఏ ప్రభుత్వం ఇంకోపక్క ఏడిచేవానిని వెక్కిరించినట్టుగా 'వ్యవసాయరంగానికి వరాల వర్షం' అంటూ దగాకోరు ప్రచారాన్ని లంకించుకుంది. ఎన్‌డిఏ ప్రభుత్వంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘం వ్యవసాయరంగం అభివృద్ధికి 2003 సంవత్సరంలో 20 సిఫార్సులు చేసింది. మాజీ కేంద్ర ఆర్థికమంత్రి వాటిలో ఒక్కగానొక్క సిఫార్సుని కూడా తన బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. ఆ నివేదికను చెత్తబుట్టలో విసిరేసాడు.

ఈ కటిక నిజాలన్నింటినీ కప్పిపుచ్చుకుంటూ, తమ దుర్మార్గాన్నంతటినీ దాచేసుకుంటూ 'అభివృద్ధే మా ధ్యేయం', 'అంతాబాగుంది', 'దేశం వెలిగిపోతోంది' అంటూ బిజెపి, దాని మిత్రపక్షాలు ఊరేగడాన్ని దేశంలోని సామాన్య ప్రజలంతా తమ పాలిట క్రూరమైన వెక్కిరింతగానే భావించారు. ''ఈ నేతల దగాకోరు ప్రచారాన్ని కోపగించుకోకుండా వుండగలమా?'' అని ప్రముఖ వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ఎమ్.ఎస్.స్వామినాథన్ లాంటి వారు ఆవేదనతో, ఆవేశంతో నిలదీసారు.

## బాగున్నాయనుకున్నవన్నీ తలక్రిందులయ్యాయి

2003 నవంబర్, డిసెంబర్ మాసాలు బిజెపి నాయకత్వంలోని కేంద్ర ఎన్‌డిఏ ప్రభుత్వానికి మంచిరోజులని చెప్పాలి. అప్పటికే 'కాంకన్'లో జరిగిన 'ప్రపంచ వాణిజ్య సంస్థ' సభ్యదేశాల మంత్రులస్థాయి సమావేశంలో తామేదో ఘనవిజయం సాధించేసినట్టు వాజ్‌పాయి ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. కాని నిజానికి అక్కడ జరిగింది భారత ప్రభుత్వం అమెరికాకి ఆత్మగా పని చేయడం మాత్రమే! 2003 డిసెంబర్ మధ్యలో, భూటాన్‌లో స్థావరాలేర్పరుచుకుని భారత్‌కి వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఉల్ఫా' తదితర వేర్పాటువాద సంస్థలపై సైనిక చర్యకు భూటాన్ రాచరిక ప్రభుత్వం మెడలు వంచింది వాజ్‌పాయి ప్రభుత్వం. సదరు పోరాట సంస్థల శిబిరాలపై డిసెంబరు 15-26తేదీల మధ్య జరిగిన క్రూరమైన సైనికచర్య నిజానికి 'రాయల్ భూటాన్ ఆర్మీ' (ఆర్‌బిఏ) పేరుమీద భారత సైన్యం జరిపినదే. ఈ విజయోత్సాహం కొనసాగింపుగా వాజ్‌పాయి సర్కార్ బంగ్లాదేశ్, నేపాల్‌లకి సైతం బెదిరింపులు, హెచ్చరికల సంకేతాలు పంపింది. ఆ రకంగా భారత పాలకవర్గాల విస్తరణవాదానికి ఊతం ఇస్తూ వారి మెప్పుని పొందింది.

ఈ పరిణామాల మధ్యనే డిసెంబరు మాసంలో ఇస్లమాబాద్ లో జరిగిన 'సార్క్' శిఖరాగ్ర సమావేశం వాజ్‌పాయి-ముషారఫ్‌ల పరస్పర పొగడ్తలు, కౌగిలింతలతో 'విజయవంతం' అయ్యింది. ఈ గొలుసుకట్టు పరిణామాలతో వాజ్‌పాయి ప్రభుత్వం ఉబ్బితబ్బిబ్బ యింది. పాకిస్తాన్‌తో తన బేరమాడే శక్తి పెరిగిపోయిందని సంబరపడిపోయింది. దశాబ్దాలతరబడిగా భారత్‌కి కునుకులేకుండా చేస్తున్న కాశ్మీర్ వివాదాన్ని భారత్‌కి అనుకూలంగా పరిష్కరించే ఘనత తనకి దక్కిపోగలదని వాజ్‌పాయి ప్రభుత్వం ఉవ్విళ్లూరింది. కాని, డిసెంబరు మాసాంతం నుండి వాజ్‌పాయి ప్రభుత్వానికి చెడ్డరోజులు గడ్డురోజులు ప్రారంభయ్యాయి అమెరికాకి భారత్ సహజమిత్ర దేశం (నేచురల్ ఏల్లి), 'వ్యూహాత్మక మిత్ర దేశం' (స్ట్రేటజిక్‌ఏల్లి) అంటూ అమెరికాతో సాన్నిహిత్యంపట్ల గర్వంతో సంబరపడి పోతుండిన వాజ్‌పాయి ప్రభుత్వ సంబర పాటుపై అమెరికా చన్నీళ్లు జల్లింది. భారత్‌తో సూచనప్రాయంగా సైతం సంప్రదించకుండా పాకిస్తాన్‌కు 'నాటో కూటమి వెలుపలి ప్రముఖ దేశపు హోదా' (ఎమ్.ఎన్.ఎన్.ఏ) కట్టబెడుతున్నట్టు అమెరికా ప్రకటించింది. భారత్‌తో వ్యవహరించేప్పుడు బింకంగా వుండమని పాక్ నేత ముషారఫ్‌ని హుషారు చేయడమే ఈ అమెరికా చర్య ఆంతర్యం. తదనుగుణంగానే కాశ్మీర్ సమస్యపై ముషారఫ్ అంతదాకా అనుసరిస్తూ వచ్చిన సామరస్య వైఖరిని అలవోకగా పక్కనపెట్టేస్తూ 'కాశ్మీర్ సమస్యని త్వరగా తేల్చని చర్చల తంతు నిష్ప్రయోజనం' అని తేల్చిపారేసాడు. దీంతో వాజ్‌పాయి సర్కార్ ఖంగుతింది.

డిసెంబర్‌లో జరిగిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ అసెంబ్లీల ఎన్నికల్లో సాధించిన ఘనవిజయాలతో ఎంతో ఉత్సాహకర పరిణామాల నేపథ్యంలో ఎన్నికల బరిలోకి ఉరికిన వాజ్‌పాయి ప్రభుత్వం రానురాను నిరుత్సాహకర పరిణామాల్ని ఎదుర్కొంది. తన ఆర్భాటపు 'ఉదయ్‌యాత్ర'లో భాగంగా హర్యానా చేరిన అద్వానీకి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 'ఏంబాగుంది? ఎక్కడ బాగుంది? ఎవరికి బాగుంది?' అని హర్యానా రైతులు అద్వానీని నిలదీసారు - ''అన్నదాతలు బాగుంటేనే అంతా బాగు, లేకుంటే అంతా బాగుంది అనుకోలేం'' అని అద్వానీ అంగీకరించాల్సి వచ్చింది. అలా అంగీకరిస్తూనే అద్వానీ ఇంకోపక్క ''సుభిక్ష భావనకంటే సగర్వ భావన మిన్న'' అంటూ తన ఆర్.ఎస్.ఎస్ గొంతుని వినిపించాడు. 'అంతాబాగుంది' అనే నినాదం ఆవిరైపోవడంతో బిజెపి 'రామజన్మభూమి' 'ఉమ్మడి పౌరస్మృతి', 'ఆర్టికల్ 370' లాంటి తన సాంప్రదాయిక ప్రచారాస్త్రాల్ని అటకమీంచి దించింది. అది పని చేయకపోవడంతో బోఫోర్స్ కుంభకోణం, సోనియా విదేశీయతలపై ప్రచార అల్లరిని పెంచి అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చాలానే ప్రయత్నించింది. చివరికి 21 మంది పేద మహిళల ప్రాణాల్ని బలితీసుకున్న 'లక్నో చీరల పంపిణీ' విషాదంతో బిజెపి దివాళాకోరు ప్రచారం పరాకాష్టకు చేరుకుంది.

## ప్రజాకంటక ప్రభుత్వాలపై కసి తీర్చుకున్న ప్రజలు

అన్ని సర్వేలు, అంచనాలు, జోస్యాలకి అతీతంగా బిజెపి దాని మిత్రపక్షాలు కుప్పకూలాయి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విజయం సాధించాయి. రద్దయిన లోక్‌సభలో 114 స్థానాలను మాత్రమే కలిగి వుండిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో తన బలాన్ని 145కు పెంచుకోగలిగింది. రద్దయిన సభలో 182 స్థానాల్ని కలిగి వుండిన బిజెపి బలం 138కి పడిపోయింది. కొత్త లోక్‌సభలో ఏకైక పెద్ద పార్టీ స్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. కొత్త లోక్‌సభలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఉమ్మడి బలం 217 స్థానాలు కాగా బిజెపి దాని మిత్రపక్షాల బలం కేవలం 185 స్థానాలే. రద్దయిన లోక్‌సభ స్పీకర్ మనోహరజోషితోపాటు వాజ్‌పాయ్ ప్రభుత్వ కేబినెట్ మంత్రులు యశ్వంత్‌సిన్హా, రామ్‌నాయక్, మురళీ మనోహర్‌జోషీ, విద్యాసాగర్, క్రిష్ణంరాజు, దత్తాత్రేయులు ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో దేశం నలుమూలలా చాలాచోట్ల వామపక్షాలు అనూహ్య విజయాల్ని

సాధించాయి. కరడుగట్టిన హిందూ ఫాసిస్టునేత, బిజెపి ముఖ్యమంతి అయిన నరేంద్రమోడీ పాలనలోని గుజరాత్‌లో ఈసారి బిజెపి ఖంగుతినడం విశేషం. తమ బూటకపు సెక్యులరిస్టు బురఖాల్ని చించేసుకుని హిందూ ఫాసిస్టు బిజెపితో చెట్టాపట్టాలేసుకుని, సామ్రాజ్యవాద సంస్కరణల అమలులో అలసిపోతూ, ప్రజల హక్కులు, ఆకాంక్షలు, ప్రజాతంత్ర ఆందోళనలపై దారుణ అణచివేతని అమలు చేయడమే పనిగా చెలాయించుకుపోయిన చంద్రబాబు టిడిపి, జయలలిత అన్నా డిఎంకెలు ఈ ఎన్నికల్లో మట్టి కరవడం మరో విశేషం.

క్రూరమైన దాడుల్ని, ప్రభుత్వాలనుసరించే బూటకపు అభివృద్ధి నమూనాల్ని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలు తిరుగులేని నిదర్శనాలు!

అంతేకాదు, ప్రధాన ప్రత్యక్ష శత్రువులుగా తమముందు నిలిచిన బిజెపి, టిడిపి ప్రభుత్వాల పీడ వదిలించుకోడానికి ఇంకో ప్రత్యామ్నాయం లేకనే కాంగ్రెస్‌ను ప్రజలు ఎన్నుకున్నారుతప్ప కాంగ్రెస్‌పట్ల సానుకూలత, సానుభూతితోకాదు అనే వాస్తవానికి సైతం అద్దంపడతాయి ఈ ఎన్నికల ఫలితాలు.

**పత్రికా ప్రకటన :**

## సామ్రాజ్యవాద సంస్కరణల్ని, పెట్రేగుతున్న హిందూ మత దురహంకారాన్ని బూటకపు అభివృద్ధి నమూనాల్ని, తమ హక్కులు ఆందోళనలపై సాగే నిరంతర దాడుల్ని స్పష్టంగా వ్యతిరేకిస్తూ వెల్లువలా స్పందించిన ప్రజలకు విప్లవ జేజేలు !

*సామ్రాజ్యవాద 'సంస్కరణల్ని', దాని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సామాన్య ప్రజల మౌలిక సమస్యలన్నింటినీ ఘోరంగా నిర్లక్ష్యం చేస్తూ వారి జీవన ప్రమాణాల్ని మరింతగా దిగజారుస్తున్న ప్రభుత్వాల బూటకపు 'అభివృద్ధి' నమూనాల్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. హిందూ ఫాసిస్టు నినాదాలు, పథకాలు, కార్యక్రమాల్ని ప్రజలు తీవ్రంగా గర్హిస్తున్నారు. తమ ప్రజాస్వామిక ఆకాంక్షలు, హక్కులన్నింటిపై ప్రభుత్వాల పక్క నుండి సాగే దాడుల్ని దమనకాండల్ని ప్రజలు తమకు తోచిన తీరులో తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నారు. 2004 ఏప్రిల్-మే 13వ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు, వాటితోపాటు ఆంధ్రప్రదేశ్‌తో సహా 4 రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చాటుతున్నది ఈ వాస్తవాన్నే!*

*దశాబ్దాల తరబడిగా ప్రజల రక్తమాంసాలతో అభివృద్ధి అయిన ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారుచవకగా ప్రైవేటుపరం చేసేయడానికి, వాటిని విదేశీ బహుళజాతి సంస్థలకి అప్పనంగా అర్పించేయడానికి ఏకంగా ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పర్చిన 'ఘనత' ఎన్.డి.ఏ ప్రభుత్వానిదే! రైల్వేనే కాదు, ప్రసార ప్రచార మాధ్యమాలనే కాదు, చివరకి దేశ రక్షణరంగానికి చెందిన కొన్ని కీలక శాఖల్ని సైతం విదేశీ బహుళజాతి సంస్థలకి కట్టబెట్టేసే బి.జె.పి. దాని మిత్రపక్ష ప్రభుత్వాల దేశద్రోహకర విధానాల్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు.*

*పేదలు - ధనికులు, పల్లెలు - పట్టణాలు మధ్య ఆర్థిక వ్యత్యాసాల్ని మరింతగా పెంచేస్తూ కొద్దిమంది సంపన్న వర్గాల విలాసాలు కులాసాలే లక్ష్యంగా బి.జె.పి. దాని మిత్రపక్ష ప్రభుత్వాలు ప్రజల నెత్తిన రుద్దిన అరాచక అనుత్పాదక అభివృద్ధి నమూనాల్ని ప్రజలు తిరస్కరించారు. వుద్యోగం, ఉపాధి, విద్య, వైద్యం, సాగునీరు, త్రాగునీరు - ఇలా అన్నింటినీ మార్కెట్ సరుకులుగా మార్చేస్తూ ప్రజల్ని ఆకలి చావులవేపు ఆత్మహత్యల వేపు నెట్టేస్తూ ఇంకోపక్క నిస్సిగ్గుగా బరితెగింపుగా 'అంతా బాగుంది', 'దేశం వెలిగిపోతుంది' అంటూ పాలకనేతలు ఊరేగడాన్ని ప్రజలు అసహ్యించుకున్నారు. అలాంటి ప్రచారం తమ పాలిట క్రూరమైన వెక్కిరంతగానే ప్రజలు భావించారు!*

*గుజరాత్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్రమోడీ ప్రత్యక్ష నాయకత్వంలో అక్కడి మైనారిటీ ముస్లిం ప్రజలపై సాగిన ఊచకోతల్ని యావత్ ప్రపంచం దుమ్మెత్తి పోసినా కూడా బి.జె.పి ఎలాంటి పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయలేదు, సరికదా గుజరాత్ ప్రయోగంతో ఇతర రాష్ట్రాలలోను కేంద్రంలోను అధికారాన్ని కైవశం చేసుకోనున్నట్లు ఉన్మాదపూరితంగా ప్రకటించుకుంది. నరహంతక నరేంద్రమోడీని జాతీయ నాయకునిగా దేశమంతటా ఊరేగించింది. బి.జె.పి. అవధుల్లేని హిందూమత దురహంకారానికి దేశ ప్రజలు చీదరించుకున్నారు. మత ద్వేషాన్ని రగిల్చి ప్రజలను చీల్చి రక్తపాతాలు సృష్టించి అయినా అధికార అందలాలు ఎక్కిపోవాలనే దుర్లక్ష్యంతో బి.జె.పి సాగించిన రథయాత్రలు, ఉదయ్‌యాత్రలను ప్రజలు అసహ్యించుకున్నారు. హిందూ ఫాసిస్టు బిజెపికి దానితో అంటకాగిన చంద్రబాబు, జయలలిత లాంటి ఫాసిస్టు నేతలకు తమదైన తీరులో గుణపాఠం చెప్పాలని ప్రజలు భావించారు. 2004 ఎన్నికల ఫలితాలు ఇందుకు కొట్టొచ్చిన ఒక నిదర్శనం.*

*ఇక ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ఘోర పరాజయానికి కూడా ఇవే కారణాలు. కాగా ఇక్కడ మరికొన్ని ప్రత్యేక కారణాలు కూడా ముఖ్యంగా పని చేసాయి. కాల్దారి రైతులపై కాల్పులు, అంగన్‌వాడీ ఆందోళనకారులపై అశ్విక దళాల దాడి, విద్యుత్ ఆందోళనకారులపై పోలీసుల కాల్పులు ఇలా తొమ్మిది సంవత్సరాల చంద్రబాబు ఫాసిస్టు పాలనలో నిత్య అశాంతి, అలజడి, ఆందోళనలు, అరెస్టులు, కాల్పులు, రక్తపాతాలు, ఆకలి చావులు, ఆత్మహత్యలు, అహాకారాలతో ఆంధ్రప్రదేశ్ అట్టుడికి పోయింది. ఇంకోపక్క ఏలేరు భూముల కుంభకోణం మొదలు మొన్నటి పనికి ఆహార బియ్యం పథకం కుంభకోణం, నిన్నటి నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణం - ఇలా లెక్క లేనన్ని భారీ కుంభకోణాలమయంగా సాగింది చంద్రబాబు ప్రభుత్వ దుష్పాలన! చట్ట సభలో ప్రతిపక్షాల నిరసన ధ్వనులు అరణ్య రోధనలైపయోయి. అసెంబ్లీ చర్చల్లో ప్రతిపక్షాల నోరు మూయించడాన్ని ఒక దుష్టకళగానే అభివృద్ధి చేసింది చంద్రబాబు ప్రభుత్వం.*

(4వపేజీ బాక్స్‌లో)

టిడిపికి కేవలం 5 లోక్‌సభ స్థానాలే దక్కగా అన్నా డి.ఎం.కె ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. ఆ రకంగా 14వ లోక్‌సభలో దానికి ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. కాంగ్రెస్ అధికారంలో వుంటుండిన రాష్ట్రాల్లో మాత్రం దాన్ని తిరస్కరించడం మరో విశేషం. పంజాబ్, కర్నాటక, ఉత్తరాంచల్, కేరళల్లో సైతం ప్రభుత్వ వ్యతిరేకతా పవనాలే వీచాయి. అంటే - సామ్రాజ్యవాద సంస్కరణల్ని, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల్ని, హిందూమత దురహంకారాన్ని, ప్రజల హక్కులు ఆందోళనలపై ప్రభుత్వాలు చేసే

## ప్రజాయుద్ధ రాజకీయాలకు మరింతగా సాధికారత కల్పించిన ఎన్నికల ఫలితాలు

సామ్రాజ్యవాద సంస్కరణలకి; సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలకి; ప్రపంచబ్యాంకు బూటకపు అభివృద్ధి నమూనాలకి ఆంధ్రప్రదేశ్‌ను ప్రయోగశాలగా మార్చేసి, దేశంలోనే చెప్పకోదగ్గ హైటెక్ పాలకనేతగా మీడియా ప్రచారంలో వెలిగిపోయిన చంద్రబాబు దుష్పాలన ప్రజల మౌలిక

సమస్యలనేకాదు, సాధారణ సమస్యల్ని సైతం ఘోరంగా నిర్లక్ష్యం చేసింది. ఒకపక్క తన గోబెల్స్ తరహా ప్రచారంతోను, ఇంకోపక్క లాఠీతూటాల ప్రయోగంతోను ప్రజల, ప్రజాస్వామ్యవాదుల, ప్రతిపక్షాల నిరసన గొంతుల్ని అదిమి చిదిమి పారేసింది చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం. ఈ ప్రభుత్వ బుల్‌డోజర్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల తరఫున దృఢంగా నిలబడి నిజమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ వచ్చింది మన పార్టీయే. కనుకనే మా పార్టీ ఉద్యమాలను నిర్మూలించేయడానికి కంకణం కట్టుకుంది చంద్రబాబు ప్రభుత్వం. కనుకనే చంద్రబాబుని మట్టుబెట్ట దలచాం. అతడ్ని అంతం చేయడమే లక్ష్యంగా మనం జరిపిన అలిపిరి దాడిని ఆసరగా చేసుకుని మన పార్టీ ఉద్యమాలని అంతం చేసే లక్ష్యంతో మనపై యుద్ధాన్ని ప్రకటించింది చంద్రబాబు ప్రభుత్వం. అందుకు ప్రజల తాజా తీర్పును కోరతూ ముందస్తు ఎన్నికలకు సిద్ధపడింది. చంద్రబాబు మనపై విసరిన యుద్ధసవాల్‌ని యుద్ధతరహాలోనే త్రిప్పికొట్టాలని తీర్మానించు కున్నాం. టిడిపి, దానికి అన్నివాధాలా అండగా నిలచే బిజెపి నేతల్ని మట్టుబెట్టే లక్ష్యంతో మన దాడుల్ని ముమ్మరం చేసాం. టిడిపి, బిజెపిల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాం. మన దాడులపై పాలక టిడిపి, బిజెపిల అరుపులు, ఆహాకారాలుతప్ప ప్రత్యేకించి చంద్రబాబు రంకెలు, పెడబొబ్బలుతప్ప సామాన్య ప్రజలలో ఒక్కరి నుంచి కూడా 'అయ్యోపాపం!' అనే సానుభూతి వ్యక్తం కాలేదు. ఇక్కడ గమనించాల్సిన అతిముఖ్య విషయం ఏమంటే – ఈ భీకర యుద్ధంలో ప్రజలు కేవలం ప్రేక్షకపాత్రలోనే మిగిలిపోలేదు. తమకు తోచిన తీరులో ఈ యుద్ధంలో పాలుపంచుకున్నారు. శత్రు కదలికలు తెలియజేస్తూ, సరకుల సరఫరాలో సహకరిస్తూ మనం జరిపిన కరువుదాడుల్లో చురుగ్గా కదులుతూ ఈ యుద్ధంలో పాత్రధారులయ్యారు. కట్టలు త్రెంచుకున్న కసి, ద్వేషాలను ప్రదర్శిస్తూమరీ చంద్రబాబు ప్రజాకంటక ప్రభుత్వాన్ని మట్టికరిపించారు.

## కసితో కదిలిన ప్రజలు

౧౯౯౯ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ౯౧ స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అదనంగా ౯౫ స్థానాల్లో నెగ్గి మొత్తం ౧౮౬ స్థానాల్ని దక్కించుకుంది. కాంగ్రెస్ మిత్రపక్షాలు టిఆర్ఎస్ ౨౬ స్థానాల్ని; సిపిఎం ౯ స్థానాల్ని, సిపిఐ ౬ స్థానాల్ని గెలిచినందున కాంగ్రెస్ కూటమి ౨౨౭ స్థానాల్ని కైవసం చేసుకుంది.

***(౩వపేజీ బాక్స్ కొరవ)***

*చంద్రబాబు ప్రభుత్వ ఈ బుల్‌డోజర్ పాలనని అడుగడుగునా ప్రతిఘటిస్తూ రాష్ట్ర ప్రజల పక్షాన దృఢంగా నిలిచి పోరాడుతూ రాష్ట్రంలో నిజమైన పత్రిపక్ష పాత్ర పోషిస్తూ వచ్చింది మా పార్టీయే. కనుకనే చంద్రబాబు హయంలో రాష్ట్రంలో కరువైపోయిన శాంతి, ప్రజాస్వామ్యాల పునరుద్దరణ కోసం మా పార్టీతో ప్రభుత్వం చర్చలు జరపాలని రాష్ట్రంలోని ప్రజాస్వామిక శక్తులు సంస్థలు చంద్రబాబు ప్రభుత్వంపై గట్టి ఒత్తిడినే తీసుకొచ్చాయి. ఈ ఒత్తిడికి చంద్రబాబు ఖంగు తిన్నాడు. మా పార్టీ, ఉద్యమాలపై అణచివేతను ఇంకా అనేక రెట్లుగా పెంచేయడం ద్వారానే ఈ ఒత్తిడి నుంచి బయటపడాలని చంద్రబాబు ప్రభుత్వం నిశ్చయించుకుంది. అలానే మాపై నిర్బంధకాండ పెచ్చరిల్లిపోయింది. దీనికి ధీటైన జవాబు ఇవ్వాలని మేమూ నిశ్చయించుకున్నాం. పర్యవసానమే అలిపిరి దాడి. ఈ దాడి కేవలం మా పార్టీ ఉద్యమాల ప్రయోజనం కోసం జరిగింది మాత్రమే కాదు, అంతకంటే ప్రధానంగా విశాల ప్రజ ప్రయోజనాల రీత్యా జరిగినది. ఇది నిజం. కనుకనే మా దాడి నుంచి తలవెంట్రుకవాసిలో చావుతప్పి బయటపడ్డ చంద్రబాబుపై సామాన్య ప్రజల నుండి కనీస మర్యాదపూర్వక సానుభూతి సైతం వ్యక్తం కాలేదు.*

*ఈ చేదు నిజాన్ని, ఘోర పరాభవాన్ని చంద్రబాబు అరిగించుకోలేక పోయాడు. దాన్నంతటినీ దిగమింగుకుంటూ అలిపిరి దాడిపై లేని సానుభూతిని ఉన్నట్టుగా చిత్రించుకుంటూ, ప్రచార ఊదరతో ఎలాగోలాగా ఎన్నికల్లో తిరిగి విజయం సాధించేయడం ద్వారా ఈ పరాభవాగ్నిని చల్లార్చుకోవాలనుకున్నాడు. ఆగస్టు ౨౭ తిరుపతి మహానాడు నుండే ముందస్తు ఎన్నికల సన్నాహాల్లో మునిగి వుండిన చంద్రబాబు అలిపిరి దాడిని ఆసరాగా చేసుకుని మా పార్టీ ఉద్యమాలపై యుద్ధాన్ని ప్రకటిస్తూ అదే ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లోకి ఉరికాడు. ఎన్నికల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం మాపై రుద్దిన అక్రమ అన్యాయ యుద్ధాన్ని యుద్ధతరహాలోనే ఎదిరించాలని మేమూ తీర్మానించుకున్నాం. నేరపూరిత ఫాసిస్టు సంస్కృతిని ఒంటబట్టించుకన్న, ప్రజా శత్రువులైన పాలక టిడిపి, బిజెపి నేతల్ని మట్టుబెట్టాలని తీర్మానించుకున్నాం. దీన్ని స్పష్టంగా, బహిరంగంగా ప్రకటించాం. మా ప్రతిఘటనా దాడులు ముమ్మరం చేసాం.*

*మాయీ దాడులతో మతిచలించిన చంద్రబాబు ఈ దాడుల్ని సైతం ఎన్నికల లబ్దిలోకి మార్చేసుకోవాలనే కుటిల ఎత్తుగడతో రాష్ట్రంలోని బిజెపియేతర ప్రతిపక్షాలన్ని మా పార్టీతో కుమ్మక్కయిపోయాయని ప్రచారం లంకించుకున్నాడు. మా పార్టీ ఉద్యమాల మీద అలానే రాష్ట్రంలో ముఖ్యమైన రాజకీయ ఉద్యమంగా కొనసాగుతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమంపైన విషం కక్కుతూ రెచ్చగొట్టడు విచ్ఛిన్నక ప్రచారాలకి పాల్పడింది చంద్రబాబు ప్రభుత్వం. ఎన్నెన్ని కుటిల ఎత్తుగడలకి పాల్పడినా, ఇంకెన్ని విచ్ఛిన్న పథకాలు పన్నినా ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వానికి ఘోర పరాజయం, పరాభవం తప్పలేదు.*

*ఈ ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వంపై వ్యక్తమైన ప్రజా వ్యతిరేకత సాధారణమైనది కాదు. ౧౯౭౭ ఎన్నికల్లో ఇందిరాగాంధి ఎమెర్జన్సీ పాలనకి వ్యక్తమైనంతటి తీవ్ర వ్యతిరేకత ఇది. అన్ని రంగాలలోని సామాన్య ప్రజల్ని, మరీ ప్రత్యేకించి కార్మికులు, రైతుల సమస్యల్ని అతి ఘోరంగా నిర్లక్ష్యం చేయడం; ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు ఆందోళన్నింటిపై పాశవిక అణచివేతని అమలు చేయడం; మరింత ప్రత్యేకంగా గడచిన కొన్ని దశాబ్దాలాయ తెలంగాణా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల ప్రతిబింబంగా సాగుతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సమస్యపట్ల నేరపూరిత నిర్లక్ష్య వైఖరిని, వ్యతిరేకతని ప్రదర్శించడం; రాష్ట్రంలో పీడిత ప్రజలకి అండగా నిలిచే మా పార్టీ ఉద్యమాలను తుపాకీ బలంతో అణచివేయడమే లక్ష్యంగా పని చేస్తూ రావడం – అనేవి చంద్రబాబు ప్రభుత్వంపట్ల ప్రజల్లో పెల్లుబికిన తీవ్ర వ్యతిరేకతకి, ద్వేషానికి ప్రధాన కారణాలు.*

*కేంద్రంలోని బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం, అలానే ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు, నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వం ఘోర పరాజయం పాలవడానికి, స్థానే అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం బిజెపి, టిడిపి ప్రభుత్వాపట్ల ప్రజల్లో పెల్లుబికిన వ్యతిరేకతే కారణంతప్ప కాంగ్రెస్‌పట్ల సానుకలతగా భావించరాదు. అంటే – కాంగ్రెస్ ప్రజల ప్రతికూల ఓటుతోనే అధికారంలోకి వచ్చిందితప్ప సానుకూల ఓటుతో కానేకాదు. ఇది సహజమే! ఎందుకంటే సామ్రాజ్యవాద సంస్కరణల్ని తొలిసారిగా నెత్తికెత్తుకున్న భ్రష్ట చరిత్ర కాంగ్రెస్‌దే. హిందూమత దురహంకార శక్తులతో ఎప్పడూ లాలూచీపడుతూ బుజ్జగించే చరిత్రతప్ప దానికి వ్యతిరేకంగా దృఢంగా నిలిచి పోరాడే చరిత్ర అంటూ కాంగ్రెస్‌కి లేనేలేదు. ప్రజాస్వామ్య హక్కులపైన, ప్రజా పోరాటాలపైన కాంగ్రెస్ ప్రయోగించిన దమనీతి చరిత్ర ప్రజలకు స్వానుభవమైనదే. మరీ ప్రత్యేకించి విప్లవోద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచుతూ మన రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్ల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిన దుర్మార్గ చరిత్ర కూడా కాంగ్రెస్ వెనకేసుకుంది.*

*కనుక బిజెపి, టిడిపి బరువుల్ని తొలగించుకోడానికి ఇంకోమార్గంలేక కాంగ్రెస్‌ని గద్దెనెక్కించిన ప్రజలు కాంగ్రెస్‌పాలనపట్ల తగిన అప్రమత్తతతో వుంటూ తమ ప్రతిఘటనా శక్తిని, పోరాట శక్తిని పెంచుకుంటూ తమ మౌలిక సమస్యల శాశ్వత పరిష్కారానికి మా పార్టీ నే తృత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి మరింత చేరువ అవడం ఖాయం. తద్వారా రాష్ట్రంలో మా ప్రజాయుద్ధం మరింతగా విస్తరించడం, బలపడటం కూడా ఖాయం.*

అధికార టిడిపి కేవలం 47 స్థానాల్లోను, దాని ఏకైక మిత్రపక్షం బిజెపి రెండే రెండు స్థానాల్లోనూ గెలవగలిగాయి. 99 ఎన్నికల్లో 180 స్థానాల్లో నెగ్గుకొచ్చిన టిడిపి ఈసారి వాటిలో 133 స్థానాల్ని కోల్పోయింది. అలానే గత ఎన్నికల్లో 12 స్థానాలు దక్కించుకున్న బిజెపి వాటిలో 10 స్థానాల్ని పోగొట్టుకుంది. 99 ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే టిడిపి అదనంగా 3 శాతం ఓట్లని గెలుచుకోగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు టిడిపికంటే 7శాతం ఓట్లు అదనంగా గెల్చుకున్నాయి. అధికార టిడిపి మంత్రివర్గంలోని 37మందిలో ముగ్గురికి ఈ ఎన్నికల్లో సీట్లు నిరాకరించబడగా 34మంది మంత్రులు పోటీ చేసారు. వారిలో 28మంది ఓడిపోయారు. వీరిలో 1978 నుంచి ఓటమి అంటూ ఎరగని సీనియర్ టిడిపి మంత్రి అశోక్‌గజపతిరాజు ఓడిపోవడం విశేషం ! అసెంబ్లీ స్పీకర్ ప్రతిభాభారతి సైతం ఓడిపోయింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొత్తం 118 స్థానాల్లో టిడిపి కేవలం 6 స్థానాల్లోనే నెగ్గగలిగింది. ఈ 10 జిల్లాల్లో 6 తెలంగాణా జిల్లాలే కావడం గమనార్హం! ''మరీ ఇంత దారుణంగా ఓడిపోతామనుకోలేదు'' అని ఓడిన మంత్రులంతా గొల్లుమన్నారు. ''పార్టీపట్ల అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకత నెలకొంది. అందుకే ఈ ఘోర పరాజయం!'' అని మాజీ హోంమంత్రి దేవేంద్రగౌడ్ వాపోయాడు. ''ప్రభుత్వ పనితీరు బాగోలేకనే ఓటమి'' అని టిడిపి అధికార ప్రతినిధి రామచంద్రయ్య అంగీకరించాడు. లోక్‌సభ ఫలితాల్లోనూ ఇదే బాణీ కొనసాగింది. రాష్ట్రంలోని 42 స్థానాల్లో 34 స్థానాలకి పోటీ చేసిన కాంగ్రెస్ 29 స్థానాల్లో నెగ్గింది. ఆరు స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ మిత్రపక్షం టిఆర్ఎస్ 5 స్థానాలు దక్కించుకోవడంవిశేషం ! గత లోక్‌సభలో 29 స్థానాలు కలిగి వుండిన టిడిపి ఈ ఎన్నికల్లో కేవలం 5 స్థానాలకే పరిమితం కాగా గత ఎన్నికల్లో 7 లోక్‌సభ స్థానాల్ని గెలుచుకున్న బిజెపి ఈసారి ఒక్కగానొక్క స్థానంలో సైతం గెలవలేకపోయింది. ఒక్కొక్క స్థానంలోనే పోటీ చేసిన సిపిఐ, సిపిఎం, ఎమ్ఐఎమ్‌లు వాటిని దక్కించుకున్నాయి. ఈ ఎన్నికలలో ప్రజల నుండి వ్యక్తమైన ప్రభుత్వ వ్యతిరేకత సాధారణమైనది కాదు. 1977 నాటి లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధి ఎమర్జెన్సీ పాలనపట్ల వ్యక్తమైనంతటి తీవ్ర వ్యతిరేకత ఇది అని ఈ ఫలితాల గణాంకాలు చాటి చెబుతున్నాయి.

అధికారంలో వుండే ఏ పార్టీ ప్రభుత్వమైనా కొద్దోగొప్పో ప్రజల అసంతృప్తిని వ్యతిరేకతని ఎదుర్కోకతప్పని స్థితిని మనం చూస్తాం. ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద 'సంస్కరణల్ని' అన్ని పార్టీలు, ప్రభుత్వాలు అనుసరిస్తుండటమే దీనికి కారణం! కాగా, కేవల ప్రభుత్వ వ్యతిరేకతే కాకుండా, అంతకంటే ఎక్కువగా హిందూ దురహంకారాన్ని ప్రజలు వ్యతిరేకించడాన్ని ఈ ఎన్నికల్లో మనం చూస్తాం. కనుక 'సంస్కరణల' వ్యతిరేకత, బిజెపి వ్యతిరేకత ఈ ఎన్నికల్లో కొట్టొచ్చినట్టుగానే కనబడతాయి. గుజరాత్ మారణకాండపై కనీస పశ్చాత్తాపాన్ని సైతం వ్యక్తం చేయని బిజెపి రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ శాసనసభల ఎన్నికల్లో సాధించిన విజయాలతో ఇక ఎవరినీ పట్టించుకోవాల్సిన అవసరం లేదనే నిర్లక్ష్య నిరంకుశ వైఖరుల్ని పెంచుకుంది. లోక్‌సభ రద్దునాటికే ఎన్‌డిఏలో పెద్ద భాగస్వామ్య పక్షం అయిన డిఎంకెతో సహా 8 భాగస్వామ్య పక్షాలు బిజెపికి దూరం అయిపోయాయి. ఎన్నికల ప్రచారపర్వం ప్రారంభంనాటికే దేశంలోని ప్రాంతీయ జాతీయ పార్టీలన్నీ బిజెపి దాని మిత్రపక్షాలు, కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు అనే రెండు శిబిరాలుగా సమీకరణ అయిపోయాయి. పరస్పరంగా ఎన్నికల్లో తలపడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఎస్‌పి, బిఎస్‌పి పార్టీలు ఇందుకు కొంత మినహాయింపుగా వుండిపోయాయి. ఏ కూటమి అధికారంలోకి వచ్చినా బేరమాడి లబ్ధి పొందాలనే వైఖరిని అవి పాటించాయి. ఆ రకంగా బిజెపిని వ్యతిరేకించే చిన్నా పెద్దా పార్టీలన్నింటినీ తన చుట్టూతా సమీకరించుకోవడం ద్వారానే కాంగ్రెస్ అనూహ్య విజయాన్ని సాధించగలిగింది.

ఇక ఆంధ్రప్రదేశ్‌లోనైతే, ప్రజల తీవ్ర వ్యతిరేకత కోపాల్ని మూటగట్టుకున్న టిడిపి, బిజెపిల మధ్య పొత్తు అనేది కాంగ్రెస్ ఘనవిజయానికి తోడ్పడిందని చెప్పాలి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ కంటే తీవ్రంగాను దృఢంగాను టిడిపి దుష్టపాలనా విధానాలతో నిర్విరామంగా పోరాడుతూ వచ్చిన సిపిఐ, సిపిఎం, టిఆర్ఎస్ లాంటి రాజకీయ పార్టీలేగాక ఎం.ఆర్.పి.ఎస్, మాలమహానాడు లాంటి బలమైన సామాజిక బృందాలు, అన్ని కార్మిక, రైతాంగ, ప్రజాసంఘాలు ప్రజాతంత్ర సంస్థలు వీరంతా టి.డి.పి., బి.జె.పి.లపట్ల వ్యతిరేకతతో కాంగ్రెస్ చుట్టూ సమీకరణ అయ్యారు. ఈ శక్తులన్నింటినీ పట్టువిడుపులతో తనకు దగ్గరగా నిలుపుకోవడంలో కాంగ్రెస్ సైతం చాలామట్టుక్కి విజయవంతం అయింది. పర్యవసానమే రాష్ట్రంలో టిడిపి, బిజెపిల ఘోరపరాజయం ! చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో కార్మికులు, రైతాంగం, ఉద్యోగులు, విద్యార్థులు, దళితులు - అందరి హక్కులపై, ఆందోళనలపై దాడులు జరగని రోజంటూ లేదు. ఇక మన ఉద్యమంపై సాగుతూ వచ్చిన క్రూర నిర్బంధకాండ గూర్చి చెప్పనే అఖ్ఖర్లేదు. మన ఉద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాలన్నింటినీ పోలీసు క్యాంపులుగా మార్చేసింది ప్రభుత్వం. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచీ మన ఉద్యమ ప్రాంతాలన్నీ వేలాది సాయుధ బలగాల మోహరింపుల మధ్య ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. ఈ నిర్బంధకాండ ప్రజలని తీవ్రంగా కలచివేసింది. చంద్రబాబు ప్రభుత్వంపై ద్వేషాన్ని పెంచింది.

ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు దాని బూటకపు అభివృద్ధి పథకాలు; ప్రజలపైన ప్రజాపోరాటాలు విప్లవోద్యమంపై చంద్రబాబు ప్రభుత్వం ప్రయోగించిన దారుణ అణచివేతలు - రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల్ని కొట్టొచ్చినట్టుగా ప్రభావితం చేసిన ప్రధాన అంశాలు ఇవే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తోపాటు సిపిఐ, సిపిఎం, టిఆర్ఎస్‌ల ఘనవిజయాలకి తోడ్పడ్డ అంశాలు ఇవే.

కాగా, రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల్ని ప్రభావితం చేసిన మరో ముఖ్యాంశం ప్రత్యేక తెలంగాణా సమస్య. ప్రత్యేక తెలంగాణా సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన టిఆర్ఎస్ మొట్టమొదటిసారిగా ఈ ఎన్నికల్లో పోటీ చేసింది. తెలంగాణాలోని 54 స్థానాల్లో (అసెంబ్లీ)పోటీచేసి 26స్థానాలు గెలుచుకున్నది. ఆరు లోక్‌సభ స్థానాలకు పోటీ చేసి ఐదింటిని గెలుచుకుంది. టిఆర్ఎస్ నాయకత్వం మరింత రాజకీయ మెలకువని, ఎత్తుగడల నైపుణ్యాన్ని, బాధ్యతాయుత వైఖరిని ప్రదర్శించి వుంటే మరిన్ని ఫలితాలుసాధించుకుని వుండేది. అయినా తొలిసారి పోటీలో ఈ విజయాలు తక్కువైనవి కావు. ప్రత్యేక తెలంగాణా ప్రాధాన్యతను చాటి చెప్పే ఫలితాలివి. అంతేకాదు, మన ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా తెలంగాణ గ్రామీణ ప్రాంతాలపై చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన దారుణ దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తపరిచిన స్పందనలు ఈ ఫలితాల్లో అంతర్భాగంగా వున్నాయని మనం గుర్తించాల్సి వుంటుంది. టిఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు ఎన్నికల ముందు 'నక్సలైట్ల ఎజెండాయే మా ఎజెండా' అని ప్రకటించడం ఇందువల్లనే.

## ప్రత్యేక తెలంగాణా సాధన, ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం మన బాధ్యత

1960ల నాటి నుండి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దఫదఫాలుగా దగాలకి గురవుతూనే వచ్చింది. తాజాగా ఈ ఉద్యమ నినాదాన్ని నెత్తికెత్తుకున్న టిఆర్ఎస్‌కి వుండే పరిమితులు, దాని

బలహీనతలు, రుగ్మతలు చాలానే బహిర్గతమవుతున్నాయి. వీటన్నింటికీ మూలమైన దాని మౌలిక బలహీనత ఏమంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఎన్నికల రాజకీయాల గాటనే కట్టిపడేయటం. ఇలాంటి టిఆర్ఎస్ నాయకత్వంలో భౌతిక భౌగోళిక ప్రత్యేక తెలంగాణా సాధన సైతం సాఫీగాను, సత్వరంగానూ సాధ్యమయ్యేవిగా కనబడటం లేదు. ప్రభుత్వ నిర్వహణ కోసం ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేనంతటి బలాధిక్యతతో వుంటున్న కాంగ్రెస్, టిడిపి తరహాలో కాకపోయినా, వాస్తవాచరణలో తెలంగాణా సమస్యను నిర్లక్ష్యం చేస్తూనే పోవచ్చు, గతంలో వలెనే కాంగ్రెస్ ఈ సమస్యపై సాచివేత వైఖరినే ప్రదర్శించవచ్చు, అంటే తిరిగి మరోసారి తెలంగాణా ప్రజలు దగాకు గురయ్యే ప్రమాదం వుంది. కాని ఈసారి ఇలాంటి దగాని విద్రోహాన్ని తెలంగాణా ప్రజలు సహించబోరని, సమరశీలంగా ప్రతిఘటించి తీరుతారని మనం ఆశించవచ్చు. తెలంగాణా ప్రజల్లో అలాంటి తెగింపు ధోరణి, సమరశీలతలు వ్యక్తమవుతున్నాయి. కనుకనే టిఆర్ఎస్ నేత చంద్రశేఖరరావు సైతం తన 'ప్రాణత్యాగం' గురించి 'రక్తపాతం' గురించి 'ఆత్మహుతిదాడులు' గురించి పెద్దగొంతుతో హెచ్చరికలు చేస్తున్నాడు.

కాని, ఇలాంటి వాగాడంబరతలతోనే ప్రత్యేక తెలంగాణా సాధించబడిపోదు. ఆ ఉద్యమం మరోసారి దగాకి గురి కాకుండా దానికి అండగా మనం నిలవాల్సి వుంటుంది. నిజానికి ప్రత్యేక తెలంగాణా వుద్యమంతో నిర్మాణాత్మకంగా ఉద్యమస్ఫూర్తితో నిజాయితీగా అంటిపెట్టుకు వస్తున్నది మనం మాత్రమే. ఈ దిశలో ఇప్పుడు మరింత చురుగ్గాను, నిశ్చయాత్మకంగాను మనం పాత్ర పోషించాల్సి వుంటుంది. ఈ సమస్యపై బలమైన ప్రజారాజకీయ ఉద్యమాన్ని నిర్మించాల్సి వుంటుంది. ఇలాంటి రాజకీయ ఉద్యమం మన ప్రజాయుద్ధాన్ని బలోపేతం చేయడానికి, దాన్ని విస్తరింప జేయడానికి దోహదపడుతుందనే స్ఫూర్తితో అవగాహనతో మనం ఈ ఉద్యమానికి నడుం బిగించాల్సి వుంటుంది. ప్రజాస్వామ్య తెలంగాణాను నిర్మించడం అనేది కేవలం మనకు మాత్రమే సాధ్యమయ్యేది. దానికి ముందు ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ తరహాలో జరగాల్సిన ప్రత్యేక తెలంగాణా సాధనలో సైతం మనం వెనుకబడరాదు, ముందుపీఠిన వుండడానికే కృషి చేయాలి. లేకుంటే ప్రజాస్వామ్య తెలంగాణాను నిర్మించజాలం.

**మన ఉద్యమ పురోగమనం ప్రజల ఆకాంక్ష**

తమ పాలిట ప్రత్యక్ష ప్రధాన శతృవులుగా మారిపోయి తమ నెత్తినెక్కి కూర్చున్న బిజెపి, టిడిపి ప్రభుత్వాలను వదిలించుకోడానికి వేరుదారిలేక ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారుతప్ప, కాంగ్రెస్‌పట్ల విశ్వాసం అభిమానం వుండి కాదు. కాంగ్రెస్‌పట్ల ప్రజల్లో అలాంటి విశ్వాసం, అభిమానం వుండగల అవకాశమే లేదు. ఏమంటే ఐదు దశాబ్దాలపాటు దోపిడీ పాలకవర్గాల విశ్వసనీయ ప్రధాన ప్రాతినిధ్య పార్టీగా కొనసాగిన చరిత్రే కాంగ్రెస్‌దీను. సామ్రాజ్యవాద సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల్ని రెండు చేతులా ఆహ్వానించి దేశ ప్రజల నెత్తిన రుద్దిన ప్రజావిద్రోహ చరిత్ర దీనిదీను! హిందూమత దురహంకార శక్తులతో అడుగడుగునా రాజీపడుతూ బూటకపు సెక్యులరిజం బురఖాలో నెట్టుకొస్తున్న దివాళాకోరు చరిత్రే కాంగ్రెస్‌దీను.

ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రజావిద్రోహ చరిత్ర రాష్ట్ర ప్రజలకి తెలిందేమీకాదు. ఈ రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండను ప్రవేశపెట్టిన నేరపూరిత చరిత్ర కాంగ్రెస్‌దే. దశాబ్దాలతరబడిగా రాష్ట్రంలో ఒక రాజకీయ ఉద్యమంగా రగులుతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసి పదేపదే విద్రోహాలకి గురిచేసిన దగాకోరు చరిత్రను సైతం కాంగ్రెస్ వెనకేసుకుంది. ఇలాంటి కాంగ్రెస్ హయాంలో తమకు న్యాయం జరిగిపోగలదనే భరోసాతో ప్రజలుండగల అవకాశం లేదు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి వారు పోరుదారిలోనే ప్రయాణిస్తారు.

ఇంకోపక్క - అధికార అందలాలెక్కి సామ్రాజ్యవాద దుష్టశక్తులకి, వారికి ఊడిగం చేసే దేశీయ దోపిడీ పాలకవర్గ మూకలకి సేవ చేయడంలో తలమునకలై తరించిపోతూ ఫాసిస్టు పార్టీలుగా మలచబడిన బిజెపి, టిడిపిల ప్రతీకార కుట్రలు, ప్రతీఘాతుక ఉద్యమాలు బ్రద్దలయ్యే అవకాశాలు మెండుగానే వున్నాయి. సోనియాగాంధీ విదేశీయత సాకుతో ఆమెను ప్రధాని పదవికి దూరంగా వుంచడానికి హిందూ ఫాసిస్టు బిజెపి ఎంతటి బరితెగింపు ధోరణికి దిగిందో చూసాం. భవిష్యత్తులో హిందూ ఫాసిస్టు మూకలు మరింత విచ్చలవిడిగా పెట్రేగిపోయే ప్రమాదాలున్నాయి. పరాజయ పరాభవాలతో మగ్గిపోయే బిజెపి, టిడిపిలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచే అన్నిరకాల కుట్రలకి దిగుతాయి. కాగా కాంగ్రెస్‌లోని ముఠాకోరు సంస్కృతి దానికున్న అప్రతిష్ఠాకర చరిత్ర మనకుతెలీందికాదు. వెరసి రేపటి ముఖచిత్రం ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం పెను సంక్షోభ చిత్రంగానే వుంటుంది.

రాష్ట్ర రాజకీయ పరిస్థితిలో పెద్ద మార్పే వచ్చింది. ఈ మార్పులో మన ఉద్యమ పాత్ర వుంది. మనం చిందించిన రక్తం వుంది. కనుక మన ఉద్యమాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోడానికి దోహదపడగల స్వభావం మారిన పరిస్థితికి వుంటుంది. అయినా ఇది రూపంలో మార్పే! ఈ మార్పు వెనుక పని చేసిన ప్రజల అసంతృప్తి ఆగ్రహాల్ని చల్లార్చగల మార్పు కాదిది. ప్రజల ఆకాంక్షలకి న్యాయం చేయగల మార్పు కాదిది. దేశంలో 'సంస్కరణల బ్రహ్మ'గా పాలకవర్గాల మెప్పుని ప్రపంచబ్యాంకు కితాబుని పొందిన మన్‌మోహన్‌సింగ్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే 'సంస్కరణలకి' ఢోకా వుండదని సామ్రాజ్యవాదులకి భారత పాలక వర్గాలకి భరోసా ఇచ్చాడు.

ప్రజలనెత్తిన రుద్దిన 'సంస్కరణలు' అలానే కొనసాగుతాయి, వాటినంటి పెట్టుకుని రాజ్య నిర్బంధమూ కొనసాగుతుంది. ప్రజల అసంతృప్తి ఆగ్రహాలు ఆందోళనలు కొనసాగుతూనే వస్తాయి. రేపు అవి మరింత పెద్దయెత్తున బ్రద్దలవుతాయి. ఇంకోపక్క పాలకవర్గాలు పార్టీలు ప్రభుత్వాల మధ్య ఆంతరంగిక వైరుధ్యాలు, సంక్షోభాలు సైతం మరింత తీవ్రం అవుతాయి.

మన ప్రజాయుద్ధాన్ని మరింత బలోపేతం చేసుకోడానికి, మరింత విస్తరింప జేసుకోడానికి వీలుగా మనం ఈ నూతన పరిస్థితిని, బద్దలుకానున్న నూతన వైరుధ్యాల్ని, సంక్షోభాల్ని వినియోగించుకోవాలి. మన సాయుధ ప్రజాయుద్ధానికి బాసటగా బలమైన ప్రజా రాజకీయ వుద్యమాల నిర్మాణానికి మనం నడుం బిగించాలి. బలమైన విశాలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, హిందూఫాసిస్టు వ్యతిరేక, రాజ్య నిర్బంధ వ్యతిరేక ఐక్యసంఘటనలను నిర్మించాల్సి వుంటుంది. మన ప్రజాపునాదిని గట్టిపరుచుకుంటూ విస్తరింపజేయాలి. తద్వారా మన ప్రజాయుద్ధాన్ని నూతన స్థాయికి అభివృద్ధి చేసుకోవాలి. ఇదే ప్రజల నిజమైన ఆకాంక్ష. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ కూల్చివేత వెనుక పని చేసిన ప్రజల ఆగ్రహావేశాలకు రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం కాదు, ప్రత్యామ్నాయం కాదు. మన పార్టీ ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజాయుద్ధం మాత్రమే సరైన నిజమైన పరిష్కారం కనుక ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. ❑

# భారత్ వ్యతిరేక వేర్పాటువాద సంస్థలపై 2003 డిసెంబరులో జరిగిన సైనిక చర్య భారత సైన్యం జరిపినదే!

# భూటాన్ రాచరిక సైన్యం (బి.ఆర్.ఏ) ఒక మేలిముసుగు మాత్రమే!!

'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోమ్' (ఇకపై దీన్ని 'ఉల్ఫా' అనే అంటాం) కి చెందిన 13; 'నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఇకపైదీన్ని ఎన్.డి.ఎన్.బి అనే అంటాం) కి చెందిన 12; 'కామాత్‌పూర్ లిబరేషన్ ఆర్గనైజేషన్' (ఇకపై దీన్ని కె.ఎల్.ఓ అనే అంటాం) కి 5 మొత్తం 30 శిబిరాలపై 2003 డిసెంబరు 15వ తేదీన భూటాన్ రాచరిక ప్రభుత్వానికి చెందిన (రాయల్ భూటాన్ గవర్నమెంట్ –ఆర్‌బిజి) 'భూటాన్ రాచరిక సైన్యం (రాయల్ భూటాన్ ఆర్మీ – ఆర్‌బిఏ) భారీ సైనిక చర్యకి తలపడింది. డిసెంబరు 26 వరకు 10 రోజులపాటు జరిగిన ఈ సైనిక దాడిలో ఎంతమంది మిలిటెంట్లు హతులయ్యారు ? ఎంతమంది పట్టుబడ్డారు ? ఎంతమంది తప్పించుకున్నారు? అనే వాటికి సంబంధించి భూటాన్ ప్రభుత్వం నుండి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కాని 100 మంది పైగా పోరాటకారులు మరణించారని; వారిలో కొద్దిమంది ముఖ్య నాయకులు సైతం వున్నారని; 500మంది బంధీలుగా పట్టుబడ్డారని సుమారు అన్ని కథనాలు నిర్ధారించాయి. కాగా 3వేల మంది సాధారణ పౌరులు కనబడకుండా పోయారని కూడా రూఢి అయింది. వీరిలో కొందరు మిలిటెంట్లు, వారి సానుభూతిపరులేగాక సామాన్య పౌరులు సైతం వున్నారు.

తమ దేశంలో స్థావరాలేర్పరుచుకుని భారత్‌కు వ్యతిరేకంగా వేర్పాటువాద ఉద్యమాలు నిర్వహిస్తూ భారత్‌తో తమకు లేనిపోని వైరుధ్యాలు వైషమ్యాలు కలిగిస్తున్నందున తాము వేర్పాటువాదులపై సైనిక దాడికి దిగాల్సి వచ్చిందని, అది స్వయానా తమ స్వంత నిర్ణయమేనని, చర్యేనని భూటాన్ ప్రభుత్వం దాని సైన్యం నమ్మబలికాయి. 'అవును ఇది అక్షరాలా నిజం! ఇందులో మా ప్రమేయం ఏమీలేదు. పాపం అంత పెద్ద ఊచకోతకి తలపడి అలసిపోతున్నభూటాన్ రాచరిక సైన్యానికి అవసరమైన' యుద్ధేతర వస్తు వాహనాలందించే మద్దత్తు' మాత్రమే అందించాం! కనుక ఎవరూ ఈ విషయంలో అపోహపడాల్సిన అవసరం లేదు' అనే మాటలతో భారత ప్రభుత్వం భారత సైన్యం భుజాలు తడుముకున్నాయి. భారత ప్రభుత్వం, భారత సైన్యం అద్భుత అమాయకత్వాన్ని నటించొచ్చు. కాని, దాన్ని నమ్మే అమాయకులెవరట! ఇప్పటికీ యుద్ధేతర సిబ్బందితోసహా ఆర్.బి.ఏ సంఖ్యా బలం కేవలం 10వేలు మాత్రమే! వేర్పాటువాద సాయుధ పోరాట శక్తులతో తలపడే అనుభవం దానికి ఏమాత్రం లేదు! అలాంటిది సంవత్సరాల తరబడిగా పోరాటాలలో రాటుదేలి వస్తున్న మిలిటెంట్ సంస్థలకి చెందిన 30 శిబిరాలను ఒక్కసారిగా తుడిచి పెట్టేయడం, 120 మంది పోరాటకారులను మట్టుబెట్టేయడం, వందలాది మందిని బంధించేయడం, ఇంకా వేలాది మంది సామాన్య పౌరుల్ని కనబడకుండా చేసేయడం ఈ చర్యలన్నీ ఆర్.బి.ఏ శక్తికి అతీతమైనవి. పైగా ఇందులో తమవైపు నుంచి జరిగిన నష్టం కేవలం ఏడుగురు సైనికులు చనిపోవడమేనని కూడా ఆర్‌బిఏ ప్రకటించుకుంది. ఇంతటి సైనిక పాటవాన్ని, ఇంతటి సాంకేతిక పరిజ్ఞాన శక్తిని అది ఎప్పుడు సంపాదించుకుందో ఎవరికీ తెలియదు. కనుక ఈ ఘనకార్యాలు ఆర్‌బిఏవి కావుగాక కావు. ఇవీన్న 'ఘనత వహించిన' భారత సైన్యానివే.

ఈ సైనిక దాడిలో భీమకాంత్ బురగోహైన్ అనే 'ఉల్ఫా' అగ్రనేత సైన్యానికి పట్టుబడ్డాడు. కాని అతడు దాడి మొదటి రోజునే సైన్యం చేతిలో హతుడయ్యాడని బిఆర్ఏ ప్రకటించింది. 'ఔను అది నిజమే' అని భారత సైన్యం వంత పలికింది. భారత దేశానికి సంబంధించిన ఒక టెలివిజన్ ఛానల్ అయితే మరింత పెద్ద అబద్ధాన్నే అల్లింది. బుర్‌గోహైన్ సైన్యం కాల్పులలో చనిపోయిన ప్రాంతానికి 600కి.మీ. దూరంలో వున్న అతడి స్వగ్రామానికి అతడి మృతదేహం తరలించబడిందని, అతడి అంత్యక్రియలకి వేలాదిగా అతడి అభిమానులు తరలి వచ్చారని కూడా ఆ ఛానల్ ప్రకటించేసింది. బుర్‌గోహైన్ మరణవార్త పెద్ద సంచలనాన్నే రేపింది. చాలా పత్రికలు సంపాదకీయాలు రాసాయి. కవులు, రచయితలు ఘన నివాళులర్పించారు. బుర్‌గోహైన్ మరణవార్తపై భూటాన్ శాసనసభలో సైతం వాడి వేడి చర్చ జరిగింది. అసలు తనకేమీ తెలీనే తెలీదని భూటాన్ ప్రభుత్వం బుకాయించింది. ఇక ఇందులో అమ్నెస్టీ ఇంటర్‌నేషనల్, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థలు జోక్యం కల్పించుకోగోరాయి. ఇంకోపక్క డిసెంబరు 20 ఉదయం 5గంటలక నుండి 48 గంటలపాటు 'అస్సాం బంద్'కి ఉల్ఫా, ఎన్‌డిఎఫ్‌బి, కెఎళ్‌ఓలు సంయుక్తంగా పిలుపు నిచ్చాయి. ఇన్నిన్ని జరిగాక బుర్‌గోహైన్ చనిపోలేదని, తమకు లొంగిపోయాడని భూటాన్ సైన్యం చల్లగా ప్రకటించింది. డిసెంబర్ 20, 21 రెండు రోజుల బంద్ అస్సాం, తూర్పు బెంగాల్‌లలో పూర్తిగా విజయవంతం అయ్యింది. ఈ బంద్ నాగాల్యాండ్, మణిపూర్‌లో సైతం పాటించారు. ఆ రకంగా వివిధ వేర్పాటువాద తిరుగుబాటు సంస్థల మధ్య మున్నెన్నడూ కానరాని సంఘీభావం వ్యక్తమైంది. ఆర్‌బిఏ సైనిక చర్యలో హతులైనఅందరి మృతదేహాలను వారి వారి బంధు మిత్రులకు అప్పజెప్పాలనేదే ఈ 'బంద్' ప్రధాన డిమాండ్. ఇంకోపక్క అస్సాం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరత్‌చంద్ర సిన్హా నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రముఖ పౌరులు 33 మందిసంతకాలు చేసి భూటాన్ రాచరిక ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి పత్రాన్ని అందించారు. అందులో వారు ''భూటాన్ రాచరిక ప్రభుత్వం, భూటాన్ రాచరిక సైన్యం, భారత సైన్యాలు యుద్ధరంగంలో లేని వారిపైన మహిలు, పిల్లల పైన అప్రతిహతంగా అమానవీయంగా జరుపుతున్న దాడుల్ని తక్షణం విరమించాలి'' అని డిమాండ్ చేసారు. అంటే ఈ సైనిక చర్యలో భారత సైన్యం పాత్రలేదు అనే దాన్ని భూటాన్‌లోనే కాదు, అస్సాంలో సైతం ఎవరూ నమ్మటం లేదనే వాస్తవం రూఢి అవుతుంది. అంతేకాదు, ఈ సైనిక చర్య అమాయిక నిరాయుధ ప్రజల్ని, మహిళల్ని, పిల్లల్ని సైతం లక్ష్యాలుగా చేసుకుని సాగిన ముష్కర చర్య అని కూడా రూఢి అవుతోంది. అంతేకాదు, 'భూటాన్ రాచరిక సైన్యం' మేలి ముసుగులో భారతసైన్యం ప్రధాన ప్రత్యక్ష పాత్ర పర్యవేక్షణలతో జరిగిన సైనిక చర్య ఇది అని కూడా తేటతెల్లం అవుతోంది.

## సైనిక చర్య సుదీర్ఘ నేపథ్యం

ఈ సైనిక చర్యకు సుదీర్ఘ నేపథ్యమే వుందని చెప్పాలి. 1990ల ప్రారంభంలో భారత ప్రభుత్వం సైన్యం 'ఉల్ఫా' తదితర వేర్పాటువాద సంస్థలకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ భజరంగ్', 'ఆపరేషన్ రినో'ల పేరుతో బహుముఖ అణచివేత చర్యలు చేపట్టాయి. ఈ దాడుల తరువాత 'ఉల్ఫా' భూటాన్‌లో తమ శిబిరాల ఏర్పాటుకి నిర్ణయించింది. అప్పటి భూటాన్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుండింది. అన్ని రంగాలలో వెనుకబడే వుండింది. మరీ ప్రత్యేకించి అప్పటి దాని ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా వుండింది. అలాంటి స్థితిలో ఉల్ఫా రాకకు అది సంతోషించింది. ఒకరకంగా ఉల్ఫాను స్వాగతించిందనే చెప్పాలి. ఏమంటే – తన ఉద్యమ అవసరాల రీత్యానే అయినా భూటాన్‌లో ఉల్ఫా కల్పించనున్న మౌలిక సదుపాయాల వ్యవస్థ ద్వారా భూటాన్ సైతం లాభపడుతుంది. నిజానికి అలానే ఉల్ఫా రాకతో దాని శిబిరాల ఏర్పాటుతో భూటాన్‌లో అంతవరకూ అధ్వాన్న స్థితిలో వుండిన మౌలిక సదుపాయాల వ్యవస్థ మెరుగుపడింది. ఆ రకంగా

అక్కడి ఆర్థిక వ్యవస్థ కొంత పుంజుకోడానికి ఉల్ఫా శిబిరాలు తోడ్పడ్డాయి. ఇంకోమాటలో చెప్పాలంటే దశాబ్ది క్రితం ఉల్ఫా శిబిరాల ఉనికి భూటాన్‌కి ఒక సేవారంగ అంశంగానే పని చేసింది. రాచరిక భూటాన్‌కి ఉల్ఫా ఒక మిత్రపక్షంగానే వ్యవహరించింది.

భూటాన్‌లో ఉల్ఫా ప్రవేశం తరువాత క్రమకమంగా ఎన్‌డిఎఫ్‌బి, కెఎల్‌ఓ లు సైతం ప్రవేశించి అక్కడ తమ శిబిరాల్ని ఏర్పరిచాయి. కె.ఎల్.ఓ.ని నిజానికి ఉల్ఫాయే రప్పించుకుంది. ఎందుకంటే ఉల్ఫా సైతం అబ్బురపడే సమరశీలత పోరాట చొరవలను కెఎల్‌ఓ ప్రదర్శిస్తూ వచ్చింది. తాను నిర్వహించిన అనేక సైనిక దాడులలో ఉల్ఫా కెఎల్‌ఓని భాగస్వామ్యం చేసుకుంది, కొన్ని దాడులను కేవలం కేఎల్‌ఓ చేతనే చేయించింది కూడా! ఆ రకంగా గడచిన 10, 12 సంవత్సరాలలో ఈ మూడు మిలిటెంట్ సంస్తలూ ఈశాన్య భూటాన్ టెర్రయిన్ అంతటిపైన తమ పట్టు బిగించాయనే చెప్పాలి. ఉత్తర బెంగాల్, తూర్పు నేపాల్, దక్షిణ భూటాన్, మధ్యపశ్చిమ అస్సాంలతో కూడిన ఈ ప్రాంతం ఈ పోరాట సంస్థల స్థావరంగా మారిందని చెప్పాలి. ఈ సంస్తలు ఉత్తర భారత్ బంగ్లాదేశ్, మైన్మార్ (ఒకప్పటి బర్మా)లలోని మిలిటెంట్ సంస్థలతో సంబంధా లేర్పర్చుకున్నాయి. ఈ క్రమంలో ఈ సంస్తల సంఖ్యా బలం రానురాను పెరుగుతూ వచ్చింది. ఈ వివిధ పోరాట సంస్థల మధ్య లక్ష్యాలు, ఆశయాలు, సిద్ధాంతాలకి సంబంధించి ఎన్ని విబేధాలున్నప్పటికీ 'రాజ్య వ్యతిరేకత' అనే అంశం (భారత ప్రభుత్వ వ్యతిరేకత) వారందరి మధ్య ఒక ఉమ్మడి అంశంగా వుంటూ వారి మధ్య ఐక్యతాంశంగా పని చేసింది. ఆ రకంగా ఈ సంస్తలు పరస్పర సహకారంతో బలపడసాగాయి.

అయితే ఈ సానుకూల పరిస్థితులు ఇలానే కొనసాగిపోలేదు. ప్రతికూలించసాగాయి. భూటాన్‌ని స్థావరంగా చేసుకుని భారత్‌కి వ్యతిరేకంగా పని చేస్తున్న వేర్పాటువాద సంస్థల శిబిరాలని నాశనం చేసి వారిని తమ దేశం నుండి వెళ్లగొట్టాలని భూటాన్ ప్రభుత్వంపై న్యూఢిల్లీ ప్రభుత్వం తొలి నుంచీ వత్తిడి చేస్తూనే వచ్చింది. కాని తొలి 4, 5 సంవత్సరాల కాలం భూటాన్ ప్రభుత్వం భారత్ ఒత్తిడిని పట్టించుకోలేదు, అసలు తమ దేశంలో ఉల్ఫా తదితర భారత్ వ్యతిరేక వేర్పాటువాద సంస్థల శిబిరాలుగానీ వారి కార్యకలాపాలు గానీ లేనేలేవని బుకాయిస్తూ వచ్చింది. 1995లో మాత్రమే మొట్టమొదటిసారిగా భూటాన్ ప్రభుత్వం భారత్ ఆరోపణని, వాదనని అంగీకరించింది. ఎందుకంటే అప్పటికి తాను సైతం ఈ సంస్థల తాకిడికి గురవుతూ వీటితో తలపడటమెలా అనే ఆలోచనలో పడింది భూటాన్ ప్రభుత్వం. 1997లో నలుగురు భూటాన్ పోలీసుల్ని ఈ సంస్థలు మట్టుపెట్టాయి. 1998లో ఒక భూటాన్ ఆర్మీ అధికారి కాన్వాయిపై ఆంబుష్ దాడి జరిపాయి. 2000 డిసెంబరులో ఈ సంస్థలు జరిపిన ఒక దాడిలో 15 మంది భూటాన్ పౌరులు చనిపోగా అనేక మంది గాయపడ్డారు. ఇలా అడపా దడపా జరుగుతూ వచ్చిన ఘటనల వల్లనే భూటాన్ ప్రభుత్వానికి ఈ సంస్థలకి మధ్య వుంటుండిన సామరస్యత బెడిసి కొట్టిందనుకుంటే పొరపాటే. ఇందుకు అసలైన కారణాల్ని కొంత లోతుగా పరిశీలించాల్సి వుంటుంది.

తమ దేశ స్వాతంత్ర్యానికి బలీయమైన భారత్ ముప్వ కలిగించే అవకాశాలున్నాయనేది భూటాన్‌ని ఎప్పడూ వెంటాడే భయం. సిక్కిం పరిణామాల తరువాత ఈ అనుమానం, భయం సహజంగానే బలపడ్డాయి. భారత వ్యతిరేక వేర్పాటువాద సంస్థల ఉనికి సాహచర్యం ఇలాంటి ముప్వకి ఒక చెక్‌లాగా పని చేయగలదని భూటాన్ ప్రభుత్వం భావించింది. తొలి నాలుగైదు సంవత్సరాల భూటాన్ ప్రభుత్వ సానుకూలత సామరస్యతలకి అసలు కారణం ఇదే. కాని, త్వరత్వరగా మారుతూ వచ్చిన ప్రపంచ పరిణామాలు, రాజకీయ శక్తుల పునరేకీకరణల నేపథ్యంలో వేర్పాటువాద మిలిటెంట్ సంస్థలతో సాహచర్యం అనేది తనకు మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని భూటాన్ రాచరిక ప్రభుత్వం గ్రహిస్తూ వచ్చింది. మరీ ముఖ్యంగా

## సైనిక చర్యకు గురైన వేర్పాటువాద సంస్థల సంక్షిప్త పరిచయం

### యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సామ్ (యు.ఎల్.ఎఫ్.ఏ - ఉల్ఫా)

'సర్వసత్తాక సోషలిస్టు అస్సాం' స్థాపన లక్ష్యంగా 1979, ఏప్రిల్ 7వ తేదీనాడు ఎగువ అస్సాంలోని శిబసాగర్‌లో 'ఉల్ఫా' ఆవిర్భవించింది. పరేష్ బారువా, అరబింద రాజకోవ, గోలవ్ బారువా, సమీరన్ గొగాయ్, భద్రేశ్వర్ గోహెయిన్‌లు దీని వ్యవస్థాపక నేతలు. ఉల్ఫా ముందుగా నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాల్యాండ (ఎన్.ఎస్.సి.ఎన్)తోను , తరువాత 'కచిన్ ఇండిపెండెన్స్ ఆర్మి (కె.ఐ.ఏ)'తోను సంబంధాలు ఏర్పర్చుకుంది. ఈ కె.ఐ.ఏ ద్వారానే ఉల్ఫా తొలి తిరుగుబాటు పాఠాలను నేర్చుకుంది. తరువాత్తరువాత ఉల్ఫా పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐ.ఎస్.ఐ.తోను; ఆఫ్ఘనిస్తాన్‌లోని ముజాహిద్దీన్‌తోను; శ్రీలంక ఎల్‌టిటిఇతో సైతం సంబంధా లేర్పర్చుకుందని భారత ప్రభుత్వ ఇంటలిజెన్స్ వర్గాల ఆరోపణ. 1989ల నుండి బంగ్లాదేశ్‌లో సైతం ఉల్ఫా డజనుకు పైగా శిబిరాలను నిర్వహిస్తోందని భారత ప్రభుత్వం ఆరోపిస్తుంది.

### నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఎన్.డి.ఎఫ్.బి)

తొలిలో దీని పేరు 'బోడో సెక్యూరిటీ ఫోర్స్'! బ్రహ్మపుత్రా నది ఉత్తర తీర ప్రాంతాలన్నింటా సర్వసత్తాక బోడోల్యాండ్ నిర్మాణం అనేది దీని లక్ష్యం! కొంత కాలం తరువాత ఇది ఎన్‌డిఎఫ్‌బిగా మారింది. రంజన్‌డైమారీ సైనిక నేతృత్వంలో ఇది ఏర్పడింది. దీని వైస్ ఛైర్మన్ 2003 జనవరిలోను దీని ప్రధాన కార్యదర్శి 2002 నవంబర్ 25న అరెస్టయ్యారు. దీని సంఖ్యా బలం సుమారుగా 3500. ఇది 'ఉల్ఫా'తో దగ్గర సంబంధాలు కలిగి వుంటుంది.

### కామాతపూర్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (కె.ఎల్.ఓ)

1995 డిసెంబరు 28న ఇది ఆవిర్భవించింది. తమీర్‌దాస్ అలియాస్ బిబాన్‌మియా దీని ఛైర్మన్. 1999 అక్టోబరులో ఇతడుఅరెస్టయి, తరువాత విడుదలయ్యాడు. 2003 డిసెంబరులో భూటాన్ రాచరిక సైన్యం (పేరు మీద భారత సైన్యం) జరిపిన సైనిక చర్యలో ఇతడు హతుడయ్యాడు. మిల్టన్ బర్మాన్ అలియాస్ మిహిర్‌దాస్ ఇతడి స్థానాన్ని భర్తీ చేసాడు. కాని మిహిర్‌దాస్‌తోపాటు కె.ఎల్.ఓ సైనిక దళ కమాండర్ అయిన జైదేబ్‌రాయ్‌లను భూటాన్ రాచరిక సైన్యం (బిఆర్‌ఏ) అరెస్టు చేసింది. డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి సబ్ డివిజన్‌లోను, జల్పాయిగురిలోను, సౌత్ దీవజ్‌పూర్, నార్త్ దీవజ్‌పూర్, కూచిబీహార్, మాల్దా అనే 7 జిల్లాల్లోను క్రింది అస్సాంలోని ధుబ్రబి, బొంగాయిగాన్, కోక్రాజ్‌హర్ గోల్‌సారా అనే 4 జిల్లాల్లోను ఇది చురుగ్గా పని చేస్తోంది. దీనికి ఎన్‌డిఎఫ్‌బితోపాటు సిపిఎన్(మావోయిస్టు)తో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. 'కామాత్‌పురా పొలిటికల్ పార్టీ'తో కెఎల్‌ఓ కి సన్నిహిత సంబంధాలున్నా ఈ రెండింటి రాజకీయ ఎజెండాలు ఒకటి కాదు. కె.పి.పి. కేవలం ప్రత్యేక కామాతపురా రాష్ట్రాన్నే కోరుతుంది. కాగా ఉత్తరబెంగాల్, అస్సాంలతో కూడిన ప్రత్యేక దేశమే ఏర్పడాలనేది కె.ఎల్.ఓ లక్ష్యం.

'సెప్టెంబర్ 11' దాడుల తరువాత. 'టెర్రరిజం వ్యతిరేక పోరాటం' అనేది ఒక ప్రపంచ వ్యాపిత నినాదంగా రంగం మీదకి రావడం 'టెర్రరిజం వ్యతిరేక అంతర్జాతీయ కూటమి' అనేది అమెరికా నాయకత్వంలో ఏర్పడటం; భారత్ అత్యుత్సాహంతో అందులో భాగం కావటం; దేశ దేశాల్లోని దోపిడీ పాలకవర్గ ప్రభుత్వాలన్నింటి లాగానే భారత ప్రభుత్వం సైతం అమెరికా అడుగులకి మడుగులొత్తుతూ తాను సైతం గొప్ప టెర్రరిజం వ్యతిరేక పోరాట శక్తిగా అమెరికా మెప్పు పొందాలని వెంపర్లాడటం; 'టెర్రరిజం వ్యతిరేక పోరాటం' ముసుగులో ముస్లిం వ్యతిరేకత, పాక్ వ్యతిరేకతల్ని రెచ్చగొడుతూ బుష్ తరహాలోనే పాకిస్తాన్‌ని బెదిరింపులు, బుజ్జగింపులతో తన దారికి తెచ్చుకోవాలని భారత్ ప్రయత్నించడం – ఇత్యాది పరిణామ పరంపర నంతటినీ దగ్గరగా పరిశీలిస్తూ వచ్చిన భూటాన్ ప్రభుత్వానికి త్వరలోనే జ్ఞానోదయం అయింది.

ఇలా వుండగా భూటాన్ ప్రభుత్వ జ్ఞానోదయాన్ని త్వరిత పరిచే మరొక కీలక పరిణామాన్ని మనం చూడాలి. నేపాల్ జాతీయత/ దేశీయతతో (ఆరిజన్) కూడిన సుమారు లక్షమంది జనాభా భూటాన్‌లోని ఏడు జిల్లాలలో వ్యాపించి వుండేవారు. 1995 ప్రాంతంలో వారంతా కొద్ది నెలల వ్యవధిలోనే భూటాన్‌ని విడిచి నేపాల్ చేరారు. గడచిన 7, 8 సంవత్సరాలుగా వారంత తూర్పు నేపాల్‌లోని మొరాంగ్, జాపా అనే రెండు జిల్లాల్లోని నిర్వాసిత (శరణార్థి) శిబిరాల్లోనే నెట్టుకొస్తున్నారు. ఇది నేపాల్ భూటాన్‌ల మధ్య ఒక వివాదగ్రస్త సమస్యగా వుంటోంది. వీరిపై నేపాల్‌లోని మావోయిస్టు పార్టీ ఉద్యమ ప్రభావం బాగానే వుంటోంది. ఇంకోపక్క నేపాల్‌లోని మావోయిస్టు ఉద్యమం భూటాన్ దక్షిణాది ప్రాంతాలలోని యువతని సుళువుగాను బలంగాను ఆకర్షిస్తోంది. ఈ పరిణామం సహజంగానే భూటాన్ ప్రభుత్వాన్ని తీవ్రంగానే కలవరబెడుతోంది.

ఇదిలా వుండగా పులి మీద పుట్రలా ఇంకోపక్క 22-4-03న లెనిన్ జయంతిని పురస్కరించుకుని భూటాన్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. భూటాన్ రాచరిక పాలనకి అత్యంత కలవరపాటు కలిగించే పరిణామం యిది. భూ.క.పా.(మావోయిస్టు) గడచిన 'మే డే'నాడు (1-5-03) 10 అంశాలతో కూడిన ఒక డిమాండ్ పత్రాన్ని విడుదల చేసింది. నేపాలీ దేశీయతతో (ఆరిజన్) కూడిన భూటాన్ పౌరుల తరువాత ద్వితీయ శ్రేణిగా వుండే 'షార్‌లాప్స్' కూడా భూటాన్ ఫ్యూడల్ రాచరికం కింద నలుగుతున్నారని ఆ పత్రంలో పేర్కొనడమైంది. కాగా భూటాన్‌లో ఇప్పటికీ మైనారిటీగానే వుంటున్న 'డ్రుక్పాలు' 'రాచరికం నశించాలి' అనే నినాదాన్ని ఇప్పటికే అందుకున్నారు.

వేర్పాటువాద పోరాట శక్తులకు వ్యతిరేకంగా ఖచ్చితమైన కొన్ని తీవ్ర చర్యలు చేపట్టే దిశగా భూటాన్ రాచరిక ప్రభుత్వాన్ని నడిపిన అంతర్గత పరిణామ పరంపర ఇది. దీనికి తోడు భారత్ చేస్తుండిన నిరంతరాయమైన ఒత్తిడి. వెరసి భారత సైన్యం పాత్ర పర్యవేక్షణలలో భూటాన్ భారత్ సైన్యాల ఉమ్మడి సైనిక చర్య!

భారత్ విస్తరణవాద కాంక్ష నిజమే కావొచ్చు; దాని ప్రాంతీయ ఆధిపత్య ధోరణి నిజమే కావొచ్చు; వీటివల్ల తన దేశ స్వాతంత్ర్య సార్వభౌమత్వాలకి ముప్పున్న మాట కూడా నిజమే కావొచ్చు; కానీ భారత్ వ్యతిరేక వేర్పాటువాద సంస్థలతో అంటకాగడం అనేది వీటికి పరిష్కారం కాగలుగుతుందా? కాదు, తన వర్గ ప్రయోజనాల రీత్యా ఇది పరిష్కారం కానే కాదు. ఇందుకు బదులు భారత్‌కి కోపం కలిగించకుండా, దాన్ని రెచ్చగొట్టకుండా దాన్ని సంతృప్తి పరచడంలోనే దాని మెప్పు పొందడంలోనే కొంతయినా ప్రయోజనం వుంటుంది. ఇదీ భూటాన్ పాలకులకైన జ్ఞానోదయం. దీని వెలుగులో అది తన నడకని దిద్దుకోనారంభించింది. వేర్పాటువాద సంస్థల తలబరువును వదిలించుకోవా లనుకుంది. అయితే అనుకున్నదే తడవుగా అయిపోదు కదా! ఇన్నాళ్లూ సఖ్యతగా వుండి, వారి వల్ల కొంత లాభపడి వుండిన భూటాన్ ప్రభుత్వం ఒక్కసారిగా వారితో ఘర్షణకి దిగిపోవడం సాధ్యమా? పైగా వారితో ఘర్షణ పడిపోకుండా మైత్రీపూర్వకంగానే తమ గడ్డనుంచి వారిని సాగనంపాలని భూటాన్ ప్రభుత్వం తలపోసింది . అందుకు వేర్పాటువాద సంస్థలతో చర్చల ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రక్రియ కొనసాగడానికి అవసరమైన వ్యవధి కోసం భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. చర్చల ప్రక్రియ ప్రారంభమైంది ఈ మూడు వేర్పాటువాద సంస్థలతోను భూటాను ప్రభుత్వం నాలుగు విడతలుగా చర్చించింది. కాని ఎలాంటి పరిష్కారం కుదరలేదు. చర్చల ద్వారా పరిష్కారం అంటే ఏమిటి? తక్షణం కాకున్నా కొంత కాలనిడివిలోనైనా, ఒక్కసారిగా కాకపోయినా దశలవారిగా నైనా వేర్పాటువాద సంస్థలు తమ శిబిరాలను ఎత్తేసుకుని భూటాన్‌ని విడిచి పోవాలి. ఎక్కడికి పోవాలి? భారత్‌లోకే పోవాలి. అంటే పెనంలోంచి పొయ్యిలోకి. ఇది భూటాన్ ప్రభుత్వానికి పరిష్కారంం కావొచ్చుగానీ పోరాట సంస్థలకి కాదు. కనుకనే చర్చల ప్రక్రియ అర్థంతరంగానే ఆగిపోయింది. భూటాన్‌పై భారత్ ఒత్తిడి పెరిగిపోయింది. ఇక భారత్ తనకి నచ్చజెప్పకునే దశ దాటిపోయిందని, తన చెవి మెలేసే దశ వచ్చేసిందని భూటాన్ ప్రభుత్వం గ్రహించింది. అలా చెవి మెలేయించుకోడం కంటే భారత ప్రభుత్వం భారత్ సైన్యాల జోక్యాన్ని హుందాగా ఆహ్వానించడమే ఎక్కువ ప్రయోజనమని భావించింది. అయితే అలా బయటపడి పోకూడదని భావించింది. తనని బయటపెట్టేయ వద్దని భారత్‌ని వేడుకుంది. భారత్ అందుకు అంగీకరించింది. ఇదీ జరిగిన సైనిక చర్య క్రమం!

## వేర్పాటువాద సంస్థల ఎత్తుగడల వైఫల్యం

వాస్తవ నిర్దిష్ట పరిస్థితుల్ని నిశితంగా పరిశీలిస్తూ సరైన అంచనాలకి రావడంలోను, తదనుగుణమైన సరైన ఎత్తుగడలను అవ లంభించడంలోనూ భూటాన్ ప్రభుత్వంతో పోలిస్తే వేర్పాటువాద పోరాట సంస్థల నాయకత్వాలు బాగా వెనుకబడిపోయాయి అనిపిస్తుంది.

భూటాన్‌లోని మిలిటెంట్ సంస్థలను ఏరివేయాలని గడచిన ఏడు సంవత్సరాల నుండి భూటాన్ ప్రభుత్వాన్నిభారత్ ఒత్తిడి చేస్తూనే వచ్చింది. ఈ వేర్పాటువాద మిలిటెంట్ సంస్థలపై అస్సాం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించ లేకపోతున్నా యనే అసంతృప్తి భారత కేంద్ర ప్రభుత్వానికి తొలి నుంచీ వుంది. కాగా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వ హయాంలో ఇది మరింత పెరిగింది. ఆ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల్ని తన ఆలోచన మేరకు ఒప్పించడంలో వాజ్‌పాయ్ ప్రభుత్వం విఫలమైంది, విసుగు చెందింది. ఇక భూటాన్‌పై ఒత్తిడి పెంచడమే మెరుగైన పరిష్కారం అనే వైఖరికి వచ్చింది. మిలిటెంట్ సంస్థలతో చర్చల పేరుతో భూటాన్ ప్రభుత్వం చేస్తుండిన కాలయాపన పట్ల అసంతృప్తిని అసహనాన్ని వ్యక్తం చేస్తూ వచ్చింది భారత ప్రభుత్వం. ఇక కాలయాపనను సహించేది లేదనే సందేశాన్ని భూటాన్ ప్రభుత్వానికి స్పష్టంగానే అందించింది. 2003 మార్చిలో భారత ప్రధాన కార్యదర్శి బ్రిజేష్‌మిశ్రా భూటాన్‌ని సందర్శించిన సందర్భంగా ఈ సందేశాన్ని సూటిగాను, స్పష్టంగానే అందించాడని చెప్పాలి.

బ్రిజేష్ మిశ్రా భూటాన్ పర్యటన తరువాత చురుకుగాను గొలుసుకట్టుగాను జరుగుతూ వచ్చిన పరిణామ పరంపర అంతా ఒక లక్ష్యం దిశలో సాగుతూ వచ్చినవేనని ఆ లక్ష్యం సైనిక చర్యేనని స్పష్టంగానే అర్థం చేసుకోవచ్చు. 2003 జూలైలో భూటాన్ నేషనల్ అసెంబ్లీ చివరి సమావేశం జరిగింది. ఇందులో భూటాన్‌లోని వేర్పాటువాద సంస్థల సమస్యే ప్రధానంగా చర్చించబడింది. వేర్పాటువాద సంస్థలను దేశం నుంచి సాగనంపడానికి అవసరమైతే సాయుధ సంఘర్షణకి సైతం ప్రభుత్వంసిద్ధపడాలని, ఈ విషయంలో ప్రభుత్వానికి నేషనల్ అసెంబ్లీ పూర్తి మద్ధతుగా నిలుస్తుందని తీర్మానపరంగా హామీ పడింది అసెంబ్లీ. ఈ చర్చ సందర్భంగానే, సైనిక చర్యే అనివార్యం అయితే జరుగగల విపరీతాలు విషాదాల గూర్చి వివరిస్తూ భూటాన్ ప్రభుత్వ హోంమినిష్టర్ ''చివరంటా సైనిక చర్య అవసరాన్ని తప్పించడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. కాని ఇది

కేవలం మన చేతుల్లోనే లేదు, ఇందుకు వేర్పాటువాద సంస్థలు సైతం ప్రభుత్వంతో సహకరించాల్సి వుంటుంది'' అంటూ ముక్తాయించాడు. ఈ చర్చ సందర్భంగా కొందరు సభ్యులు భారత సైన్యం జోక్యం గూర్చి భయ సందేహాలను వ్యక్తం చేయగా ''నేషనల్ అసెంబ్లీ, కేంద్ర కేబినెట్ల అనుమతి లేకుండా భారత సైన్యం భూటాన్లో అడుగు పెట్టదు అని భారత ప్రభుత్వం గట్టిగా హామీ ఇచ్చింది'' అని నేషనల్ అసెంబ్లీలో పాల్గొన్న భూటాన్ రాజు ప్రకటించాడు. ఈ సందర్భంగానే ''రాజు సింహాసనం నుంచి ఆజ్ఞ వస్తే నేను సాధారణ సైనికుడిగా మారి దేశం కోసం పోరడడానికి సిద్ధం'' అంటూ నేషనల్ అసెంబ్లీలో ప్రభుత్వ విద్యామంత్రి వీరదేశభక్తిని ఒలకబోసాడు. ఈ పరిణామాలన్నింటినీ దగ్గరగా పరిశీలిస్తే నేషనల్ అసెంబ్లీ చివరి సమావేశం అనేది తప్పనిసరిగా జరగనున్న సైనిక చర్యకి ముందస్తు కసరత్తేనని స్పష్టంగానే అర్థమవుతుంది.

అయితే, పరిస్థితి సంతరించుకున్న ఈ తీవ్రతని వేర్పాటువాద పోరాట సంస్థలు గ్రహించిన దాఖలాలు కనబడవు. 'గ్రహించినా చేయగలిగేదేముంది గనుక! ఎదుర్కోవడం మినహా!' అని భావించాయా? ఇంతటి భారీ మూల్యం చెల్లించడం మినహా దాన్ని నివారించుకునే మార్గాంతరం లేదనే అవి భావించాయా? ఈ ప్రశ్నలకుసరైన సమాధానాలు ఆ సంస్థల సమీక్షలలోనే దొరుకుతాయి తప్ప వెలుపల వున్నవారు వీటిపై ఖచ్చితమైన సమాధానాలు చెప్పడం కష్టం. కాని, తమ దేశ భూభాగాల నుండి ఖాళీ చేయాల్సిందిగా భూటాన్ ప్రభుత్వం తమని ఒత్తిడి చేయడాన్ని ఈ పోరాట సంస్థలు 'ద్రోహం'గా అభివర్ణించాయి. అంటే, భూటాన్ ప్రభుత్వంపై భారత్ ఒత్తిడి అబద్దం అని నమ్ముతున్నారా? తాను నేరుగా పొమ్మనలేక భారత్ ఒత్తిడి పేరుతో పొమ్మంటోంది అని భావించారా? లేక భూటాన్ ప్రభుత్వం తమతో భుజం కలిపి భారత్‌కి వ్యతిరేకంగా పోరాడాలని కోరుకున్నారా? అలా పోరాడగలదని భావించారా? భూటాన్ ప్రభుత్వం భారత్‌కి భయపడి దాసోహం అయిపోవడమనేది ఆ దేశ స్వాతంత్ర్య సార్వభౌమత్వాన్ని పణం పెట్టే దేశద్రోహ చర్యే, ప్రజా ద్రోహ చర్యే. మరి ఈ అర్థంలోనేనా వారు 'ద్రోహం' అని అన్నది? అంటే భూటాన్ పాలకవర్గాలు పాలకవర్గ ప్రభుత్వం తమ వర్గ ప్రయోజనాల కతీతంగా ప్రవర్తించాలని ఈ పోరాట సంస్థలు కోరుకున్నాయా? అలా కోరుకోవడంలో తప్పులేదు, కాని అవి అలానే ప్రవర్తించగలవని కూడా వీరు భావించారా? అలా భావిస్తే మట్టుక్కి అది రాజకీయ అమాయికత్వం తప్ప వేరు కాదు. భూటాన్ తమ సాధారణ హెడ్‌క్వార్టర్ అని కమాండ్ హెడ్‌క్వార్టర్ అని ఈ సంస్థలు అనేక సందర్భాలలో బహిరంగంగానే ప్రకటించుకున్నాయి. ఉల్ఫా వైస్ ఛైర్మన్ తరుణ్‌గొగాయ్ భూటాన్ ప్రభుత్వం తమపట్ల 'ద్రోహానికి' పాల్పడిందని వాపోయాడు. అంటే నిర్దిష్ట వాస్తవ పరిస్థితికి సంబంధించిన వారి ఆలోచనలు, అభిప్రాయాలు, అంచనాలు రాజకీయంగా సరికానివనే చెప్పాలి. అందుకనే మారుతుండిన పరిస్థితులకు ధీటుగా అవసరమైన సరైన ఎత్తుగడల్ని వారు అవలంబించ లేకపోయారు. ❑

# ప్రజాయుద్ధంలో భాగంగా ప్రభుత్వ బూటకపు సంస్కరణలను తిప్పికొడ్తూ విప్లవ సంస్కరణలను చేపడ్తున్న వివిధ జిల్లాల విప్లవ ప్రజానీకం

ప్రపంచబ్యాంకు మార్గదర్శకత్వంలో చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో విప్లవోద్యమాన్ని అణచడానికి సమగ్రమైన పథకం రూపొందించింది. ఈ పథకంలో భాగంగానే గెరిల్లాదళాలపైన, ప్రజలపైన సాయుధ దాడులు ముమ్మరం చేస్తూ మరోవైపు గ్రామీణ ప్రాంతంలో కుప్పలు, తెప్పలుగా ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం ప్రజల్ని విప్లవోద్యమం నుండి దూరం చేయడమే. ఈ కుటిల ఎత్తుగడలో భాగంగా గడచిన ౯ సంవత్సరాల కాలంలో జన్మభూమి పథకం నుండి వెలుగు పథకం వరకు దాదాపు ౨౦ రకాల పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాల అమలుకు ప్రజల భాగస్వామ్యం పేరిట, అనేక నిర్మాణాలను ఏర్పాటు చేసి, ఈ ప్రభుత్వ పథకాలకు ప్రజల నుండి కొమ్ముకాసే ఒక చిన్న సెక్షన్‌ను తయారు చేసుకున్నది. చంద్రబాబు ప్రభుత్వం ఆశించిన విధంగానే వివిధ పథకాల ద్వారా లబ్దిపొందిన ఈ చిన్న సెక్షన్ తెలుగుదేశం పార్టీకి సాంఘిక పునాదిగా మారారు. వీరితో ఏర్పరిచిన వివిధ నిర్మాణాలు (విద్యా కమిటీలు, నీటి పారుదల కమిటీలు, వనసంరక్షణ సమితులు, డ్వాక్రాగ్రూపులు మొ.వి) ప్రభుత్వ అధికార కేంద్రాలుగా మారాయి. వీటి పలుకుబడి ముందు, గ్రామాలలో పంచాయితీ ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రతిపక్ష నాయకుల పాత్ర సైతం నామమాత్రమైంది. ఈ నిర్మాణాలు విప్లవ ప్రతీఘాతుక వ్యూహంలో భాగంగా ఏర్పడినవి కావటం వలన, కొన్నిచోట్ల ఇవి విప్లవ వ్యతిరేక కార్యాచరణను చేపట్టాయి. ఈ నిర్మాణాలలో వుంటున్న కొద్దిమంది వ్యక్తులు స్థానిక పోలీసు అధికారుల నేతృత్వంలో ఇన్ఫార్మర్స్‌ను, కోవర్టులను తయారు చేయడంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు.

౧౯౯౬ నుండి చంద్రబాబు ప్రభుత్వం ఒక పథకం ప్రకారం అమలు చేస్తున్న ఈ పథకాల లక్ష్యాన్ని ప్రారంభంలో మనం అర్థం చేసుకోలేక పోయాము. ఫలితంగా సరైన ఎత్తుగడలను రూపొందించ లేకపోయాము. విప్లవ కార్యాచరణలో వున్న ఈ బలహీనతను చంద్రబాబు ప్రభుత్వం సొమ్ము చేసుకొంది. అయితే ౯వ కాంగ్రెస్ అందించిన నూతన మార్గదర్శకత్వంలో చంద్రబాబు బహుముఖ దాడిని ఎదుర్కొనేందుకు సరైన ఎత్తుగడలు రూపొందించుకున్నాము. ఈ ఎత్తుగడలలో భాగంగానే చంద్రబాబు అనుసరిస్తున్న ప్రపంచబ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలన్ని రాజకీయంగా సంఘటిత పరచటం, ప్రభుత్వ అధికార కేంద్రాలను ధ్వంసం చేయటం, విప్లవ సంస్కరణలను అమలు చేయటం వంటి ఎత్తుగడల ద్వారా ప్రజల్ని చంద్రబాబు 'సంస్కరణల మాయాజాలం' నుండి బయటపడేసేందుకు కృషి చేసాము.

## ప్రజల్ని రాజకీయంగా సంఘటిత పరిచేందుకు జరిగిన కృషి

చంద్రబాబు అమలు జరుపుతున్న సంస్కరణల వెనుక గల కుట్రను బహిర్గతం చేయటంలో భాగంగా, చంద్రబాబు ప్రభుత్వ విధానాలను ప్రజలలో విస్తృతంగా మన దళాలు ఎండగట్టాయి. చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి తెచ్చిన వేలాది కోట్ల రూపాయలను నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల వారి ప్రభువులైన సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు వెచ్చించిన తీరును బహిర్గత పరిచాయి. ఒకవైపున రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడ్తూ మరోవైపు ప్రజల్ని ప్రక్కదారి పట్టించడానికి అమలు చేస్తున్న సంస్కరణల కుటిలత్వాన్ని ప్రజలకు అర్థం చేయించాయి. ఈ సంస్కరణలు కేవలం ఎంగిలి మెతుకులేననీ వాటిని తిప్పికొట్టాలనీ, రాష్ట్రాన్ని పరాధీనంగావిస్తూ, ప్రజల్ని బానిసత్వంలోకి నెడ్తున్న చంద్రబాబు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చాయి. మన దళాలు చేసిన ఈ ప్రచార కృషి వలన ప్రజలలో కొంతమేరకు ప్రభుత్వ వ్యతిరేక చైతన్యం పెరిగింది. ప్రజలు తమ నిత్య జీవితాల నుండి కూడా మన ప్రచారంలో వున్న వాస్తవాలను అర్థం చేసుకోగలిగారు. చంద్రబాబు బూటకపు పథకాల వెనుక వున్న కుట్రను అర్థం చేసుకోగలిగారు.

## స్వయం సహాయక బృందాల రద్దు

ఉద్యమం బలంగా వున్న ప్రాంతాలలో ఈ నిర్మాణాల రద్దుకై మన పార్టీ పిలుపు నిచ్చింది. పార్టీ పిలుపు నందుకుని చాలా గ్రామాలలో వివిధ నిర్మాణాలను రద్దు చేసారు. ఈ నిర్మాణాల రద్దు సందర్భంగా, వాటిని నిర్మించటంలో ప్రభుత్వానికి వున్న రాజకీయ దురుద్దేశాన్ని ప్రజలకు అర్థం చేయించారు. ప్రత్యామ్నాయంగా ప్రజల రాజ్యాధికార పునాదిపై వివిధ నిర్మాణాలను ఏర్పర్చుకోవాలనీ, అందుకు సాయుధ ప్రతిఘటనకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా సాయుధ ప్రతిఘటనకు ఊతం ఇచ్చేవిధంగా కొన్ని విప్లవకర సంస్కరణలను అమలుచేసారు.

## విప్లవ సంస్కరణలు

విప్లవకర ఎత్తుగడలలో భాగంగా అనేక గ్రామాలలో మన దళాలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాయి. అయితే కా.లెనిన్ చెప్పినట్లు ఈ సంస్కరణలు బూర్జువా పరిపాలనను శిథిల మొనర్చుటకు ఉపయోగపడే సాధనాలుగా, విప్లవోద్యమాన్ని మరింత ముందుకు తీసికెళ్లడానికి బలమైన పునాదులుగా వుండాలనే అవగాహనకు అనుగుణంగా వీటి నిర్వహణ జరిగింది.

ప్రభుత్వ బహుముఖ దాడిని ఎదుర్కోవటంలో భాగంగా వివిధ ఎత్తుగడలతో సంస్కరణలను అనుసందానించటం వలన ప్రజలు మరింత ధైర్యంగా విప్లవ కార్యాచరణలో పాల్గొనగలిగారు. శత్రువుకు కాళ్లు, కళ్లలాగా పని చేస్తున్న ఇన్ఫార్మర్ వ్యవస్థను, అధికారపక్ష రాజకీయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, ఈ చర్యలకు అభివృద్ధి కార్యక్రమాలను అనుసంధానించారు. ఇన్ఫార్మర్ వ్యవస్థను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేయటం వలన శత్రువుకు గెరిల్లా బలగాలను నిర్మూలించటం గుడ్డివాడు నీళ్లల్లో చేపలు పట్టుకున్న చందమైంది. అధికారపక్ష రాజకీయ నాయకులను, స్వయం సహాయక బృందాలను నియంత్రించటం వలన ప్రభుత్వ కార్యకలాపాల నడక కుంటుపడింది. అధికారపక్ష రాజకీయ కార్యకలాపాలకు బ్రేక్ పడింది. ఈ పరిస్థితులలో వివిధ ప్రాంతాలలో గెరిల్లా దళాలు చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ప్రభుత్వ బలగాలను ఎదుర్కోవాలనే మానసిక స్థితిని కల్గిస్తున్నాయి.

## వివిధ జిల్లలలో సంస్కరణ కార్యక్రమాలు

2004 ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు జరిగిన కరువు వ్యతిరేక క్యాంపెయిన్‌లో కరువు దాడులతోపాటు, ధాన్యం పంపిణి కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు. గుంటూరు, మహబూబ్‌నగర్, నల్గొండ, అనంతపురం జిల్లాలలో వివిధ రూపాలలో సేకరించిన 4 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అనేక గ్రామాలలో పంచారు. తీవ్రమైన కరువు పరిస్థితులలో ఈ పంపిణీ కార్యక్రమం ముఖ్యంగా అత్యంత పేదరికాన్ని అనుభవిస్తున్న చెంచులకు, జాలర్లకు గొప్ప ఊరట నిచ్చింది. ఈ సందర్భంగానే ప్రభుత్వం చేపట్టిన పనికి ఆహార పథకం తెలుగుదేశం నాయకులకు 'భోజన పథకం' అవుతున్న తీరును ప్రజలు గ్రహించి స్థానిక సంఘాల నాయకత్వంలో ఆ బియ్యాన్ని కూడ పంచుకున్నారు. బియ్యం పంపిణీతోపాటు వ్యవసాయభివృద్ధి, విద్యా, వైద్యం, సాగునీరు వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

# గుంటూరు జిల్లా

### వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు

గత సంవత్సరం రాష్ట్రవ్యాపితంగా వచ్చిన కరువు ఈ జిల్లాను కూడా వదిలిపెట్టలేదు. ముఖ్యంగా మన ఉద్యమ ప్రాంతంల కరువు విలయతాండవం చేసింది. జిల్లాలో ఆదివాసీలు నివసించే నల్లమల ప్రాంతంలో దీని ప్రభావం మరింత ఎక్కువగా వుంది. ఈ ప్రాంతంలోని ఆదివాసీల వద్ద వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి లేకపోవటం వలన గత కొన్ని సంవత్సరాలుగా భూములు బీడుపడ్డాయి. ఈ పరిస్థితులలో స్థానిక గెరిల్లా దళం రెండు గూడాలలో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమం చేపట్టింది.

***రాచిచెరువులో వ్యవసాయాభివృద్ధి :*** ఈ గూడెంలో అందరూ చెంచు ఆదివాసీలే. వీరందరికి ఎంతో కొంత భూమి వున్నప్పటికీ, పెట్టుబడులులేక గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయం మూలపడింది. ఈ పరిస్థితిలో స్థానికంగా వ్యావసాయాభివృద్ధి కమిటీని పెట్టుకుని 45 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చారు. ఈ కమిటీ గూడెంలోని ప్రజలందరికి సజ్జలు, జొన్నలు రకరకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేసింది. ఈ వ్యవసాయాభివృద్ధి కార్యక్రమానికి పార్టీ నుండి 25,000 రూ.లు కమిటీకి అందాయి.

***మర్రికుంటలో వ్యవసాయాభివృద్ధి :*** ఈ గూడెంలో కూడా అందరూ చెంచు ఆదివాసీలే. వీరందరికి కూడా భూమి వున్నప్పటికీ పెట్టుబడులులేక గత నాలుగు సంవత్సరాలుగా ఇక్కడ వ్యవసాయం మూలపడింది. ఇక్కడ కూడా వ్యవసాయాభివృద్ధి కమిటీని ఏర్పర్చుకుని ప్రతి కుటుంబం రెండు ఎకరాల చొప్పన భూమిని సాగు చేసారు. సజ్జలు, జొన్నలు, రకరకాల కూరగాయల విత్తనాలు వేసారు. ఈ మొత్తం కార్యక్రమం వ్యవసాయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరగగా పార్టీ నుండి ఈ కార్యక్రమానికి 21,000 రూపాయల నిధులు అందాయి.

లోతట్టు ఆదివాసీ ప్రాంతాలలోనే కాకుండా మైదాన ప్రాంతాలలో కూడా కరువు సమస్య తీవ్రంగా వుండటంతో కొన్ని గ్రామాలలోని పేదరైతులకు అప్పలు దొరకక పెట్టుబడి సమస్య సీరియస్‌గా ముందుకు వచ్చింది. ఇటువంటి గ్రామాల నుండి వర్గపోరాటం సీరియస్‌గా జరిగిన కొన్ని గ్రామాలను ఎంచుకుని పార్టీ అక్కడ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడింది. ఈ సహాయం కూడా 3 ఎకరాల లోపు భూమి వుండి, బాగా చితికిపోయిన రైతులకు అందించాలని స్థానిక పార్టీ నిర్ణయించింది. వ్యవసాయ అవసరాలకు తీసుకునే ఈ అప్పను తిరిగి 3రూ.ల వడ్డీతో చెల్లించాలనీ, ఇట్లా వసూలు అయిన మొత్తాన్ని తిరిగి అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని నిర్ణయించారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎక్కడి కక్కడ గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పరిచారు. ఈ అప్పను పైసల రూపంలో కాకుండా విత్తనాల రూపంలో అందించారు. ఇలా కరువు విపరీతంగా వుండి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తున్న తరుణంలో మనం చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలలో మంచి ప్రభావాన్ని వేసాయి.

***పంపిణీ జరిగి విధానం***

| సంఖ్య | గ్రామం | విత్తనాలు | సంచులు | కుటుంబాలు |
|---|---|---|---|---|
| 1 | కల్లూరు గోపాలపురం | పత్తి | 45న్నర | 36 |
| 2 | ,, | వడ్లు | 6 బస్తాలు (బస్తాకు-50కె.జీలు) | 12 |
| 3. | గోవర్ధనగిరి | పత్తి | 4 | 8 |
| 4. | గుర్రన్నపాడు | పత్తి | 55 | 45 |

### త్రాగునీటి సమస్య

జిల్లాలో ఏర్పడిన వర్షాభావం వలన (త్రాగు) నీటి సమస్య కూడా తీవ్రంగా ఏర్పడింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సమస్య మరింత తీవ్రతరమైంది. ఈ పరిస్థితుల్లో బొల్లాపల్లి ఏరియాలో నాలుగు గ్రామలలోను, వెల్దుర్తి ఏరియాలో 2 గ్రామాలలోను బోర్లు వేయించారు. ఒక గ్రామంలో బోరుకు అమరవీరుల పేర్లు పెట్టారు. ఈ కార్యక్రమం కూడా ప్రజలలో మంచి ప్రభావాన్ని వేసింది.

జిల్లాలో జరిగిన ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కోసం మన గెరిల్లా దళాలు, మిలీషియా కలిసి వెల్లటూరు బ్యాంకుపై

దాడి చేసి ఏడున్నర లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఆ 7.5లక్షల రూ.లతో అనేక గ్రామాలలో ఇంటికి 30 నుంచి 50 కిలోల వరకు బియ్యాన్ని పంపిణీ చేసారు.

## నల్లమలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

నల్లమలలో జీవిస్తున్న చెంచుల జీవితాలు పరమ దుర్భరంగా వుంటాయి. బహుశ ఇంతటి ఆదిమ జీవితాన్ని మరే తెగ ప్రజలు కూడా జీవించటం లేదంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇక్కడ నివసించే ఆదివాసీ ప్రజలలో చాల మంది బంక, తేనె, సారపప్పు వంటి వాటిని సేకరించి, ప్రభుత్వ స్టోర్లులకు అమ్మడం ద్వారా జీవిస్తుంటారు. వ్యవసాయం నామమాత్రమని చెప్పాలి. విద్యా వైద్యం వారికి అందని మ్రానిపండుగా మిగిలిపోయాయి. తరచుగా వచ్చే మలేరియా, టైఫాయిడ్‌ల వంటి విష జ్వరాలతో అనేకమంది చనిపోతుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు అకాల మరణాలకు గురి అవుతుంటారు. వారి సగటు జీవిత కాలం 35 నుండి 40 సంవత్సరాల వరకు వుంటుందంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పకుని 57 సంవత్సరాలు కావస్తున్నా వారి జీవితాలలో ఎటువంటి మార్పు రాలేదు. వారి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ సంస్థ కేవలం రాజకీయ నాయకుల, అధికారుల జేబులు నింపడానికి మాత్రమే ఉపయోగపడింది. చెంచుల జీవితంలో మాత్రం ఎటువంటి మార్పు తీసుకురాలేకపోయింది. ఈ మధ్యకాలంలో గూడాలలో మన ప్రభావం పెరుగుతుండడంతో వారిని విప్లవోద్యమం నుండి ప్రక్కదారి పట్టించడానికి ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేసింది. ముఖ్యంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ కార్యక్రమాలు చేపట్టింది. ఈ సంస్కరణల అమలుకు ప్రతిగూడెంలోనూ, గూడెం పెద్దలను ప్రెసిడెంట్, సెక్రటరీలుగా నియమించారు. వీరిలో కొద్దిమంది ఐటిడిఎ అధికారుల ప్రలోభానికి గురై దళారీలుగా మారారు. వీరు ప్రభుత్వ అధికారుల, పోలీసు అధికారుల చెప్పచేతల్లో వుంటూ ప్రజల్ని విప్లవోద్యమంలోకి పోకుండా వివిధ రూపాల్లో వత్తిడి తెస్తున్నారు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి మన దళాలు ఒకవైపున ఆదివాసి ప్రజల్ని వివిధ సమస్యలపై కదిలిస్తూ మరోవైపువారి అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తున్నాయి. గడచిన సంవత్సరంలో జరిగిన కరువు దాడుల్లో చెంచులు ప్రధాన పాత్ర పోషించారు. కరువు దాడుల్లో స్వాధీనం చేసుకున్న ధాన్యం, వస్తువులను రికవరి చేసుకోవడానికి వచ్చే పోలీసులను దెబ్బతీయడంలో గెరిల్లాదళాలకు పరోక్షంగా సహకరించారు. ఇంకా ఫారెస్టు అధికారులకు, స్టోరు అధికారులకు వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రభుత్వ వ్యతిరేక చైతన్యాన్ని సంతరించుకుంటున్నారు. మన దళాలు ప్రధానంగా ఈ పోరాట సాంప్రదాయాన్ని ప్రోత్సహిస్తూ మరోవైపు వ్యవసాయం, విద్యా, వైద్యం వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని చేపడుతున్నాయి.

### వ్యవసాయాభివృద్ధి కార్యక్రమం

ఎన్ఎఫ్‌డిలోని అనేక పెంటలలో వ్యవసాయం చేస్తే జీవాలు చచ్చిపోతాయనీ, వ్యవసాయం మనకు అచ్చిరాదనే అభిప్రాయం వుండేది. ఈ మూఢ నమ్మకాన్ని పోగొట్టడానికి మన దళం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కృషి చేసింది. ఈ క్రమంలోనే మానుపెంటలో అభివృద్ధి కమిటీ పెట్టింది. అంతేకాకుండా, 30మంది దాక గెరిల్లా బలగాలు, ఇక్కడి ఆదివాసీలతో కలిసి చెట్లు నరికి భూమి చదును చేసారు. దీంతో ఆదివాసీలలో వ్యవసాయం చేయాలనే పట్టుదల మరింత పెరిగింది. ఈ విషయం తెలిసి మరికొన్ని పెంటల నుండి కూడ వ్యవసాయం చేస్తామని ఆదివాసీలు ముందుకు వచ్చారు.మూడు పెంటలలో వ్యవసాయానికి ఎద్దులు ఇచ్చారు. మరో 7 పెంటలలో మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు ఇచ్చారు. ప్రభుత్వ నిర్బంధం వల్ల ప్రారంభంలో పురుషులు ముందుకు రావడానికి సిద్ధపడక పోవడంతో మహిళలే ధైర్యంగా కదిలారు. రెండు పెంటలలో మన దళం దగ్గిర వుండి వ్యవసాయ పద్ధతులు నేర్పుతూ విత్తనాలు వేయడంలో సహకరించారు. దీంతో ఆదివాసీ ప్రజలు వ్యవసాయంవైపు మరింతగా మొగ్గుచూపారు.

ఈసారి మన దళం చేసాన ప్రయత్నం రెండు పెంటలలో మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఈ పెంటలలో మొక్కొజొన్నలు బాగా పండాయి. సహజంగానే సమిష్టితత్వం కలిగిన ఆదివాసీలు తమకు పండిన మొక్కజొన్న పంటలో కొంత భాగాన్ని మూడు గూడాలకు పంచారు. చాల పెంటల నుండి ప్రజలు ఈ రెండు పెంటలకు వచ్చి కూరగాయలు తీసికెళ్లడం కూడా జరిగింది. ఈ రెండు పెంటలు వ్యవసాయంలో అభివృద్ధి సాధించి మిగిలిన వాటికి ఒక మోడల్‌గా నిలిచాయి.

### విద్యా వైద్యం

పైన చెప్పినట్లుగానే విద్యా వైద్యంలో ప్రభుత్వ కృషి నాస్తి అని చెప్పవచ్చు. కొన్ని పెంటలలో ఐటిడిఎ నియమించిన నర్సులు వున్నప్పటికీ, వారికి ట్రైనింగ్‌గానీ, మందుల సరఫరాగానీ లేకపోవటంతో వారివైపు నుండి ప్రజలకు ఎటువంటి సహకారం లభించలేదు. ఈ పరిస్థితిలో మన దళం కొన్ని పెంటలకు ప్రాథమికంగా అవసరమైన కొన్ని మందులను సమకూర్చింది. అప్పటికే నర్సులుగా వున్నవారితోపాటు నర్సులులేని పెంటలలో, అభివృద్ధి కమిటీ నుండి ఒకరిని సెలెక్టు చేసుకుని ట్రైనింగ్ ఇచ్చారు. ఒక గూడెంలో స్కూల్ నడిపిస్తున్నారు. వారి జీవనంలో మార్పు రావడానికి కొన్ని పెంటలలో గొడ్డళ్లు, మేకలువంటివి కూడా సమకూర్చారు. మనం చేపట్టిన ఈ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, వారిని విప్లవోద్యమంలో మరింత దృఢంగా నిలబెట్టడానికి దోహదపడుతున్నాయి. పెంటలలోని వివిధ సెక్షన్ల ప్రజలు అనేక నిర్మాణాలలోకి సంఘటిత పడుతున్నారు. పోలీసుల సమాచారం సేకరించటం, గెరిల్లా బలగాలకు సప్లైలు సమకూర్చటం వంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు.

## మహబూబ్‌నగర్

### వ్యవసాయాభివృద్ధి కార్యక్రమం

జిల్లాలో ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి నల్లమలలోని ఆదివాసీలలో మనం పని చేస్తూ వచ్చాము. ఇక్కడ కూడా ఆదివాసీలు మన పార్టీ నాయకత్వంలో అనేక పోరాటాలు చేసారు. అత్యంత క్రూరమైన శత్రు నిర్బంధాన్ని చవిచూసారు. ఈ పరిస్థితిలో మరింత నిబ్బరంగా శత్రువు నెదుర్కోవడానికి ఇక్కడ కూడా కొన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జిల్లాకమిటీ చేపట్టింది.

ఈ జిల్లాలోని ఆదివాసీలలో మన ప్రభావం విస్తృతంగా వుండటం వలన, చాలా పెంటలలో వ్యవసాయాభివృద్ధికి చర్యలు చేపట్టారు. దాదాపుగా 16 పెంటలలో మొక్కజొన్న, కందులు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేసారు. కొన్ని పెంటలలో అరకలతోనూ, కొన్ని పెంటలలో ట్రాక్టర్లతోను దున్నించి విత్తనాలు వేయించారు. ఈ మొత్తం కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా కదిలి పాల్గొన్నారు. ప్రజలలో సహకార భావన వెల్లివిరిసి ఒకరి పొలంలో మరొకరు పని చేసారు. ఈ మొత్తం కార్యక్రమానికి దాదాపుగా 63,000 రూ.లు ఖర్చు పెట్టారు. ఈ వ్యవసాయ కార్యక్రమం అమలు చేయకముందు ఒకప్పుడు చింతపండు, బూడిద కలుపుకని తినే పరిస్థితి వుండేది. ప్రస్తుతం మొక్కజొన్నలు, కూరగాయలు పండించటంతో, ఆహార పరిస్థితిలో కొంత మెరుగుదల వచ్చింది.

ఇక విద్యా వైద్యం విషయం షరా మామూలే. ఇక్కడ కూడా హెల్త్ వర్కర్స్ వున్నప్పటికీ, వారికి సరైన ట్రైనింగ్ లేదు. మందులు అందుబాటులో వుండవు. మొబైల్ హెల్త్ వ్యాన్ కూడా సరిగా

(కొరవ 29వ పేజీలో)

# ప్రపంచ కార్మికవర్గ పోరాట దీక్షా దినం 'మే డే' వర్ధిల్లాలి!

సామ్రాజ్యవాద 'సంస్కరణల్ని'; దాని ఆర్థిక సరళీకరణ విధానాల్ని పారిశ్రామిక ప్రైవేటీకరణ విధానాల్ని; ప్రపంచబ్యాంకు బూటకపు అభివృద్ధి పథకాల్ని దగాకోరు ప్రచారంతో బలప్రయోగంతో ప్రజల నెత్తిన రుద్దిన నేరానికి కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్.డి. ఏ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వం లోని టి.డి.పి. ప్రభుత్వం ఎన్నికల్లో మట్టికరిచాయి. ఈ ప్రభుత్వాలు కార్మకులపై ఎక్కుపెట్టిన క్రూరమైన దాడులు ఇన్నన్నికావు. విదేశీ బహుళజాతి సంస్థలకి అమ్ముడుపోయిన స్వదేశీ బ్రాండు వాజ్‌పాయి ప్రభుత్వం రక్షణ శాఖలోని కొన్ని కీలకరంగాల్ని సైతం విదేశీ సంస్థలకప్పగించేంతటి బరితెగింపు వైఖరికి పాల్పడింది. ప్రైవేటీకరణ కోసం ఏకంగా ఒక మంత్రిత్వశాఖనే ఏర్పరిచిన 'ఘనత' వాజ్‌పాయి ప్రభుత్వానిదే! ఇక చంద్రబాబు ప్రైవేటీకరణ దూకుడు గూర్చి చెప్పనే అఖ్ఖర్లేదు. ఈ ప్రపంచబ్యాంకు ఏజెంట్ హయాంలో రాష్ట్రంలోని సింగరేణి కాలరీస్ ఏ.పి.ఎస్.ఆర్.టి.సి.లు పై'వేటు'నపడ కుండా ఆగాయి అంటే అందుకు కారణం ఆ సంస్థల కార్మికులు ఐక్యంగా రాజీ లేకుండా చేస్తూ వచ్చిన నిర్విరామ మిలిటెంట్ పోరాటాలే. వాజ్‌పాయి ప్రభుత్వం దేశ కార్మికవర్గంపై '2వ లేబర్ కమిషన్' కత్తినెత్తింది. అయితే దేశ కార్మికులంతా విజయవంతమైన సమ్మైక్య సార్వత్రిక సమ్మె పోరాటంతో ఆ కత్తి వేటుని తాత్కాలికంగా అడ్డుకున్నారు. వేలాదిగా చిన్నా పెద్దా పరిశ్రమల్ని మూత వేయించేసి; లక్షలాది కార్మిక కుటుంబాల్ని 'పని'కి దూరం చేసేసి; ఐ.టి.రంగం, పర్యాటకరంగం; సినిమాలు, టీవీలు, ఫ్యాషన్ షోలు, అప్పరల్ పార్కులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్వర్ణ చతుర్భుజులు - అంటూ కొద్దిమంది సంపన్నుల విలాసాలు తీర్చే, కొద్దిమంది పరాన్న భుక్కులకి లాభాల పంటలు పండించే అనుత్పాదక అభివృద్ధిని ప్రజలకు అవసరమైన అభివృద్ధిగా ప్రచారం చేసుకు చెలాయించుకు పోయాయి ఈ ప్రభుత్వాలు.

మానవ సమాజం సమిష్టిగా అభివృద్ధి చేసుకున్న జ్ఞాన సంపదకంతటికీ మూలం శ్రమేనని; అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ వస్తున్న జ్ఞాన, విజ్ఞానాలకి కార్మికవర్గమే ప్రధాన ప్రతినిధి అనే ప్రాథమిక సత్యాన్ని గుర్తించలేని ఈ అజ్ఞాన పాలకులు ఐ.టి. విప్లవంతో, కంప్యూటరీకరణతో 'జ్ఞాన సమాజాన్ని' కొత్తగా నిర్మించేస్తామని అహంకారం తో ప్రగల్భించుకుపోయారు. ప్రజలు వీరి అజ్ఞానాన్ని వెక్కిరిస్తున్నారు.

సామ్రాజ్యవాద సంస్కరణల్ని రెండు చేతులా మొదటిసారిగా ఆహ్వానించిన కాంగ్రెస్ అటు కేంద్రం, ఇటు మన

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. సామ్రాజ్యవాదుల చేత, ప్రపంచబ్యాంకు చేత 'సంస్కరణల బ్రహ్మ'గా కీర్తించబడ్డ, దేశ పాలకవర్గాల మెప్పు పొందిన మన్‌మోహన్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజలపై 'సంస్కరణల' దాడులు కొనసాగించి తీరుతుంది. కనుక దేశ కార్మికవర్గం అప్రమత్తత కోల్పోరాదు.

కార్మికుల్ని పనికి ఉత్పత్తికి దూరం చేసేసి, పని కోసం వారి మధ్య దారుణమైన పోటీని సృష్టించి, కారుచవగ్గా వారి శ్రమని కొల్లగొట్టడమే లక్ష్యంగా కార్మికవర్గంపై దాడులకి పూనుకున్న సామ్రాజ్యవాద సంస్కరణల్ని, దాని ఎల్.పి.జి. విధానాలని దేశ దేశాల కార్మికులు శక్తివంచన లేకుండా ప్రతిఘటి స్తునే వున్నారు. 'ప్రపంచ వాణిజ్య సంస్థ' సమావేశాల్ని ఎక్కడికక్కడ భగ్నపరుస్తూ చికాకుపరచడంలో దేశదేశాల కార్మికులు లక్షలాదిగా కదిలి వీధి పోరాటాలకి తలపడ్డారు. ప్రపంచ కార్మికుల పోరాటాలు ఇలాంటి నిరసనలకే పరిమితం అయిపోరాదు. ప్రపంచ మానవాళి ఎదుర్కొనే సర్వ సమస్యలకీ సర్వానర్థాలకీ మూలం అయిన సామ్రాజ్య వాదాన్ని భూమి నుండి తుడిచి పెట్టేసే లక్ష్యంతో ప్రపంచ కార్మికవర్గం నిశ్చయాత్మక పోరాటాలకి సిద్ధపడాలి. ఇరాక్‌పై అమెరికా రుద్దిన దురహం కారపూరిత యుద్ధానికి వ్యతిరేకంగా; పాలస్తీనాను ప్రపంచ పథం నుంచి తుడిచిపెట్టేసే దుర్లక్ష్యంతో ఇజ్రాయిల్ అమెరికాలో పాలస్తీనాపై చేస్తున్న అనాగరిక దాడులకి వ్యతిరేకంగా ప్రపంచ కార్మికులంతా కదిలి పోరాడాల్సిన అవసరం వుంది. ఇతర పీడిత వర్గాలు, జాతులతో కూడిన పీడిత జనావళి నంతటినీ విముక్తం చేయడం ద్వారానే కార్మికవర్గం తనని తాను విముక్తం చేసుకుంటుందనే మార్క్స్ సూక్తిని మనసులో పెట్టుకుంటూ ప్రపంచ కార్మిక వర్గం సామ్రాజ్య వాదంతో, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదంతో తుది యుద్ధానికి సిద్ధపడాల్సిన చారిత్రక సన్నివేశం నేడు నెలకొని వుంది.

కార్మికవర్గం ఇలాంటి చొరవను ప్రదర్శించకపోతే, ప్రపంచ వ్యాపితంగా పెల్లుబుకుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలన్నింటినీ అనేక విధాల విచ్ఛిన్నం చేసేసి అణచివేసే కుట్రల్ని సామ్రాజ్యవాద దుష్టశక్తులు విజయవంతంగా అమలు చేసుకుపోతాయి. 'సెప్టెంబర్ 11' దాడులు సారాంశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక దాడులే. కాని, 'ముస్లిం మత ఛాందసవాదం', పేరుతో, 'టెర్రరిజం' ముద్రతో, 'నాగరికతల మధ్య యుద్ధం' అనే దగాకోరు ప్రచారంతో ఆ దాడుల తరువాత ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల దురాక్రమణకి దిగిపోయింది అమెరికా. అదే తరహాలో ఇరాన్ సిరియా తదితర దేశాలన్నింటినీ కబళించే కుట్రలు చురుగ్గానే పన్నుతోంది. ఈ కుట్రల్ని ఛేదించాలి. సామ్రాజ్య వాదానికి గోరీకట్టాలి. ప్రపంచాన్ని, చరిత్రని రక్షించుకోవాలి. కనుక ప్రపంచ కార్మికులంతా ఏకమవుదాం - సామ్రాజ్యవాదానికి గోరీ కడదాం ! ❑

*(పోయిన సంచిక తరువాయి భాగం)*

# చైనాలో పురివిప్పుకున్న పెట్టుబడిదారీ విధానానికి వత్తాసు పలికిన చైనా కమ్యూనిస్టు పార్టీ 16వ మహాసభ

## పెరుగుతున్న వర్గ సంఘర్షణ

ఈ పత్రిక జనవరి సంచికలో 2002 సంవత్సరంలో చైనా కార్మికవర్గ పోరాటాలు పెద్దఎత్తున పెరుగుతున్న విషయాన్ని తెలిపాము. నిజానికి 1990లంతటా ఈ ధోరణి పెరగటం మనం చూడవచ్చు. 1992 నుండి 1993 మధ్య కార్మిక తగాదాలు 53శాతం పెరిగాయి. 1995లో 1994 నుండి వివాదాలు 73శాతం పెరిగి 2లక్షలకు పెరిగాయి. గత రెండు సంవత్సరాలలో ఇది అత్యధికం అయ్యి ఇంకా పెరుగుతూనే వుంది. ఈ పోరాటాల మిలిటెన్సీకి ఉదాహరణ 2002లో లియావోనింగ్‌లో గని కార్మికుల పోరాటం. వేలాది మంది కార్మికులు తమ గని దివాళా తీయటంపై ఆగ్రహంతో పోలీసు కార్లు మొదలైన వాటిని తగులబెట్టారు. ఈ వివాదం సైన్యంతో ఎన్నో రోజులు కొనసాగింది. తొమ్మిది లోతట్టు ప్రాంతాలు స్వయం పాలిత ప్రాంతాలు తీవ్రమైన పేదరికంలో వుండిపోయాయి. దక్షణాన యునాన్ నుండి ఉత్తరాన జిన్‌జియాంగ్ వరకూ మధ్యన వున్న ప్రాంతం పేదరికంతో కూడిన ప్రాంతం చైనా భూభాగంలో సగం వుండి 28.5కోట్ల మంది ప్రజలకు నివాస ప్రాంతంగా వుంది. 2000 ఆగస్టులో దక్షిణ జియాంగ్సీలోని రైతాంగం చిన్నదే అయినా అవినీతి అధికారులకు వ్యతిరేకంగా ముఖ్యమైన తిరుగుబాటునే చేపట్టింది. వారు ప్రాంతీయ, జాతీయ పన్నులకు అదనంగా వేసినఅధిక స్థానిక పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. వారు ప్రభుత్వ అధికారులను దేహశుద్ధి చేసి వివిధ పట్టణాలలోని ధనవంతుల ఇళ్లను కొల్లగొట్టారు. జియాంగ్‌జింగ్‌లోని ఉయిగిర్‌లు నిరంతర తిరుగుబాటు పరిస్థితిలో వున్నారు. జియాంగ్‌జింగ్ ప్రాంతంలోని 150లక్షల జనాభాలో వీరు 70లక్షల మంది వున్నారు. ఇస్లాం ప్రభావంలో వున్న వీరు, వేర్పాటు కావాలని కోరుకుంటున్నారు. 8 దేశాలతో సరిహద్దు గల జింగ్ జియాంగ్‌లో పెద్ద ఎత్తున చమురు సహజవాయువు నిక్షేపాలున్నాయి. టిబెట్‌లోని అల్పసంఖ్యాకులపై హాన్ దురహంకారాన్ని ఉపయోగించి వారిని అదుపు చేస్తున్నారు. జియాంగ్‌జింగ్‌లో నేడు ఆ ప్రాంత జనాభాలో హాన్ చైనీయులు 38శాతం మంది - 40 సంవత్సరాల క్రింత కేవలం 15శాతం జనాభా మాత్రమే హాన్ జాతికి చెంది వుండేవారు. చైనాలో నూతనంగా అభివృద్ధి అయిన పెట్టుబడిదారీ విధానం అనేక పాత పద్ధతులు తిరిగి పుంజుకోవటం చూసింది. పిల్లలను ఎత్తుకు పోవటం, చిన్న వయసులోని వధువులను వారి కుటుంబాలు ఎక్కువ వయసు గల రైతులకు అమ్మివేయటం, హెరాయిన్‌కు పెరుగుతున్న వ్యసనపరులు; ఇవేకాక, ఏ చైనీయులు రిపోర్టు చూసినా ఫ్యూడల్, సామ్రాజ్యవాద, బూర్జువా విలువలు సోషలిస్టు పద్ధతుల స్థానంలో తిరిగి చోటు చేసుకున్నాయి, ఇక పశ్చిమ వాసులను అనుకరించటం ధనికులు, ఉన్నతవర్గాలకు అతి యిష్టపూర్వకమైన వినోదం అయ్యింది. అలా నేడు చైనాలో తమ జీవన ప్రమాణాలు అన్ని విధాలుగా విపరీతంగా పడిపోతున్న అధిక జనాభా వుంది; చైనా అధికారిక గణాంకాలు పరిపాలనా విభాగం ఏమి చెప్పినా వాటినే బర్ధన్, సూర్జీత్‌లు అమితంగా నొక్కి చెప్పినా వాస్తవాలు భిన్నంగా వున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుండి స్థానభ్రంశం చెందిన 200 మిలియన్‌ల మంది ప్రథమంగా వుంటారు. వీరేకాక ప్రతి ఏడాది ప్రభుత్వరంగ సంస్థల నుండి బయటికి వెళ్లగొట్టబడుతున్న మిలియన్‌ల మంది, మరో 50 మిలియన్‌ల వరకూ వుంటారు - వీరు నిరంతరంగా పెరుగుతున్నారు. అనధికార గణాంకాలు చైనాలో నిరుద్యోగం శ్రామికశక్తిలో 28శాతంగా వుందని పేర్కొన్నాయి. పెద్దఎత్తున వున్న ఈ దిక్కులేని 25కోట్ల జనాభా ఒక ప్రమాదకరమైన అగ్నిపర్వతం లాంటివారు. వీరు ఏరోజైనా భ్రద్దలై రష్యా, తూర్పు యూరప్ దేశాలలోలా చైనా కమ్యూనిస్టు పార్టీని తుడిచి పెట్టేయగలరు.

## ఆర్థిక సంస్కరణల వెనక వున్న రాజకీయాలు, భావజాలం

ఈ పై పరిస్థితిని ఎదుర్కోవటానికే 16వ కాంగ్రెస్ ప్రైవేటు పెట్టుబడిదారులను పార్టీలోకి చేర్చుకోవాలని నిర్ణయించింది. ప్రైవేటు పెట్టుబడిదారులు పెరుగుతున్న వారి ప్రభావం, సామ్రాజ్యవాదులతో పెరుగుతున్న వారి దగ్గరి సంబంధాలతో ప్రజలలో వున్న అసంతృప్తిని వుపయోగించుకుని ఏకపార్టీ వ్యవస్థను పశ్చిమ దేశాల శైలి 'ప్రజాస్వామ్యం'గా మలిచేందుకు ప్రయత్నించే అవకాశ, వుంది - సామ్రాజ్యవాదులు నిరంతరాయంగా దీనినే గట్టిగా కోరుతున్నారు. జి.డి.పి.లో 50శాతం వరకూ వుండే ప్రైవేటు రంగాన్ని పాలకవర్గాలలో పెద్ద వర్గంగా వున్న వీరిని రాజకీయ అధికారం నుండి దూరంగా వుంచటం రాజకీయ అస్థిరతకు దారితీసి వుండేది. దీనివలన ప్రభుత్వ పెట్టుబడిదారులు, పైస్థాయి అధికారులు, పైస్థాయి పార్టీ నాయకులు తమ అధికారాన్ని కొంత నూతనవర్గంగా వున్న పారిశ్రామికుడితో పంచుకోవాల్సి వచ్చినా అది నేడు వాస్తవికంగా వున్న పరిస్థితికి ఆమోదముద్ర మాత్రమే వేసింది. 2001లోనే సి.పి.సి. 80వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ వ్యాపారస్తులను తన శ్రేణులలోనికి ఆహ్వానిస్తూ ఒక ప్రకటన జారీ చేసింది. అప్పటికే సుమారు 1,13,000 పారిశ్రామికులు పార్టీలో చేరి వున్నారని అంచనా. వీరి సంస్థలు దేశ జి.డి.పి.లో 20శాతం వరకూ తోడ్పడుతూ వుండినాయి. 16వ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన మరో ముఖ్యమైన మార్పు సైద్ధాంతిక పరిధిలో జరిగింది. ప్రైవేటీకరణలోనూ, పారిశ్రామికులను పార్టీలోకి ఇముడ్చుకోవటంలోనూ ప్రతిబింబించిన ఆర్థిక, రాజకీయ మార్పులుసహజంగానే దానికి తగిన సైద్ధాంతిక మార్పులను ముందుకు తెచ్చింది. 16వ కాంగ్రెస్‌లో జియాంగ్‌జెమిన్‌ను వ్యక్తిగతం పైకి ఎత్తుతూ ''మూడు ప్రాతినిధ్యాలు'' అనే నూతన సైద్ధాంతిక సూత్రీకరణను ప్రవేశపెట్టారు. ''ఈ కాంగ్రెస్ ఏకగ్రీవంగా మూడు ప్రాతినిధ్యాలు అనే ముఖ్యమైన ఆలోచనను, మార్క్సిజం-లెనినిజం, మావోజెడాంగ్ ఆలోచన మరియు డెంగ్‌జియావోపింగ్ సిద్ధాంతాన్ని పార్టీకి దారి చూపే సైద్ధాంతిక మార్గదర్శకంగా ఆమోదించింది.

మార్క్సిజం–లెనినిజం, మావో జెడాంగ్ ఆలోచనా విధానం, డెంగ్ జాయావోపింగ్ సిద్ధాంతాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి చేయటంలో మూడు ప్రాతినిధ్యాలు అనే ముఖ్యమైన ఆలోచన చైనాలోనూ ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలోనూ వచ్చిన మార్పులు మూలంగా కొత్తగా వచ్చిన పార్టీ, జాతీయ అవసరాలను ప్రతిబింబించేందుకై తీసుకోవటం జరిగింది. అది పార్టీని బలోపేతం చేయటానికి, పార్టీ నిర్మాణాన్ని పెంచుకోవటానికి చైనాలో సోషలిజాన్ని అభివృద్ధి చేయటానికి అలాగే స్వయం అభివృద్ధి (సెల్ఫ్ఇంప్రోవ్‌మెంట్) కై ఇది బలమైన సైద్ధాంతిక ఆయుధం. నిరంతరాయంగా ''మూడు ప్రాతినిధ్యాల''ను పార్టీ నిర్మాణానికి పునాదిగానూ, దాని పరిపాలనకు మూలస్థంభం గానూ, దాని బలానికి మూలంగానూ నిర్ణయించారు. మూడు ప్రాతినిధ్యాల అనే ముఖ్యమైన ఆలోచన సారంలో కాలంతోపాటు వెళ్లటం, పార్టీ పురోగామి స్వభావాన్ని నిలుపుకోవటం, అలాగే రాజ్య అధికారాన్ని ప్రజల ప్రయోజనాల కనుగుణంగా వుపయోగించాలి అనేదే. జియాంగ్ జెమిన్ మూడు ప్రాతినిధ్యాలు చైనా కమ్యూనిస్టు పార్టీ అత్యంత పురోగామి ఉత్పాదక శక్తుల అభివృద్ధికి ప్రాతినిధ్యం వహించాలని (నూతన పారిశ్రామికుడికి ఇది ఒక అర్థాలంకారం), అత్యంత పురోగామి సంస్కృతిపట్ల మొగ్గు కలిగి వుండాలని (బూర్జువా సంస్కృతి), అలాగే చైనాలోని అత్యధిక సంఖ్యాకుల ప్రాథమిక అవసరాలపట్ల శ్రద్ధ తీసుకోవటం (ఇది సాధారణ రివిజనిస్టు వాక్పటిమయే). జియాంగ్‌తా ను పార్టీ అధ్యక్షుడు అయిన 13 సంవత్సరాల కాలం నుండి సాధించిన వాటిపైనే కేంద్రీకరించేట్టుగా కాంగ్రెస్ కార్యకలాపాలను జాగ్రత్తగా రచించేట్టు చూసుకున్నాడు. జి.డి.పి.ని 2020 నాటికి 4రెట్లు పెంచటాన్ని గురించి మాట్లాడి, తద్వారా సమాజం అధిక విరామ సమయాన్ని పొందగలుగుతుందని అలాగే నేడు ఫ్రాన్స్‌లో వున్న జీవన స్థాయి కలిగి వుంటుందని అంటాడు. ఇది అభివృద్ధి రేటును పెంచి భారతదేశాన్ని భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దుతామని నిరంతరాయంగా భారతదేశ నాయకులు చేసే ప్రకటనలాగే ఇదీ లేదు. డెంగ్‌లాగే జియాంగ్‌కూ అభివృద్ధే మూల సూత్రం. ఇది ప్రపంచబ్యాంకు తరహా సంస్థల వాగాడంబరాన్ని భారత పాలకులు రాత్రనక పగలనక ప్రచారం చేసినట్టుగా లేదూ, జియాంగ్ మూడు ప్రాతినిధ్యాల సారం పార్టీలోనికి పారిశ్రామికాధిపతులను అనుమతించటానికి కావాల్సిన సైద్ధాంతిక పునాది కోసమే. ఇక్కడ అతడు కపటంగా సభ్యత్వానికి ప్రాతిపదికగా ప్రామాణికంగా వుండే ''పురోగామి వర్గం'' అనే దానిని ''అత్యంత పురోగామి ఉత్పాదక శక్తులుగానూ'' అదే సమయంలో 'శ్రామిక సంస్కృతి' స్థానంలో 'అత్యంత పురోగామి సంస్కృతి' అనే పదాన్ని వాడాడు. ఇవే ప్రాతిపదికగా తీసుకునేట్టయితే అత్యంత పురోగామి ఉత్పాదక శక్తులు అభివృద్ధి అయ్యింది అమెరికాలోనే, కాబట్టి వారిని ఉత్తమ కమ్యూనిస్టులు అనగలమా ? అలాగే వారి సంస్కృతి అత్యంత పురోగామి అయినదా లేక అత్యంత తిరోగామి అయినదా? బర్ధన్, సూర్జిత్‌లు చెప్పకుంటున్నట్టుగా ఇది పిడివాదంకాని మార్క్సిజమా? లేక పదాలతో ఆడుకుంటూ చేసే బూర్జువా వంచన కాదా? సారంలో జియాంగ్ డెంగ్ ఉత్పత్తిశక్తుల సిద్ధాంతంలో మరో అడుగు ముందుకెళ్లాడు. డెంగ్ వర్గ పోరాటంపై కంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వగా జియాంగ్ కార్మికవర్గంతోపాటు అన్ని వర్గాల కంటే ఎక్కువగా ''అత్యంత పురోగామి ఉత్పత్తి శక్తులు'' మరియు ''అత్యంత పురోగామి సంస్కృతి'' పేరుతో బూర్జువా వర్గానికి ప్రాధాన్యత ఇచ్చాడు. ఇదే జియాంగ్ గొప్ప ఆలోచనల సారాంశం!!! ఇది 1976లో కపటంగా మావోపై మరీ ప్రత్యేకంగా సాంస్కృతిక విప్లవంపై జరిగిన దాడి ఉచ్ఛస్థానాన్ని పొంది సైద్ధాంతికంగా తిరోగామి దశను చేరటమే; సాంస్కృతిక విప్లవ ప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వారిని 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్' పేరుతో దాడికి లక్ష్యంగా చేసారు. సైద్ధాంతిక దాడి మొదటి దశలో సిద్ధాంతాన్ని కళంకం చేసి ''వాస్తవాల నుండి సత్యాన్ని వెతకటం'' అనే నినాదాన్ని విస్తృతంగా వక్రీకరించి ప్రచారం చేసారు. వాస్తవాలు లేదా ఆచరణ లేదా యదార్థం సత్యాన్ని చేరుకోవటానికి ప్రాతిపదికే అయినా, అదే సత్యం కాదు, ఎందుకంటే వాస్తవాలను ఎన్నో విధాలుగా వ్యాఖ్యానించవచ్చు – ప్రత్యేకంగా కార్మికవర్గ పద్ధతిలో లేదా బూర్జువావర్గ పద్ధతిలో. అలా లోతైన జ్ఞానం లేదా నిజమైన వాస్తవం, వాస్తవాలను శాస్త్రీయంగా వ్యాఖ్యానించటం ద్వారా వస్తుంది. దీనిని మార్క్సిస్టు సిద్ధాంతం వెలుగులో చూడటం ద్వారా ఉత్తమంగా సాధిస్తారు. అలాకాని ఎడల అది బూర్జువా వ్యాఖ్యానం అయివుండే వుంటుంది. అలాగే ఒక వర్గ సమాజంలో వాస్తవాలను వుపయోగించటం వర్గాలకు అతీతంగా వుండదు; అవే వాస్తవాలను బూర్జువా వర్గం ఒక విధంగా వుపయోగించుకుంటే కార్మికవర్గం వాటిని మరోవిధంగా వుపయోగించుకుంటుంది. ఈ నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయటం సారాంశంలో మార్క్సిస్టు (మరియు మావోయిస్టు) సిద్ధాంతాన్ని సారగ్రహణం చేయటానికి ఒక పద్ధతి. కానీ రివిజనిస్టులు సిద్ధాంత ప్రాధాన్యతను ప్రామాణిక గ్రంథాలను తిరస్కరిస్తూ, సిద్ధాంతంలో లెక్కలేనన్ని వక్రతలను ముందుకు తీసుకొచ్చారు, వీటిని సరైన లోతైన మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికతోటే ఎదుర్కోగలం – అలా ఉదాహరణకు 1979లో హు మావోచాంగ్ (అప్పటి ప్రచార విభాగ అధిపతి) 'సిద్ధాంత' కాన్ఫరెన్స్‌ను హాజరుపరచగా అది పెట్టుబడిదారీ పునరుద్ధరణపై మావోయిస్టు సిద్ధాంతానికి సంబంధించిన సమగ్రమైన రాజకీయ, తాత్విక వైఖరిపై దాడిని ప్రారంభించింది. (ఇదే సాంస్కృతిక విప్లవ సారాంశం). ఇక్కడ గొప్ప ముందడుగు అలాగే సాంస్కృతిక విప్లవానికి సంబంధించిన విధానాలపై చైనాలోని ఉన్నతస్థాయి మేధావులు దాడి చేసారు. తరువాత 1980లలో చైనా ఇంకా ''సోషలిజం ప్రాథమిక స్థాయి''లో వుందనే ప్రాతిపదికపై నూతన సూత్రీకరణను ప్రచారం చేసి పెట్టుబడిదారీ అభివృద్ధిని సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

సుషావోజీ, ఫాంగ్‌లాన్‌రూయి తదితర సిద్ధాంతకర్తలు వివిధ సిద్ధాంతాలను ప్రచారం చేయటం మొదలుపెట్టారు – లెనిన్ నూతన ఆర్థిక విధానాన్ని వక్రీకరించటం, యుగోస్లావియా అనుభవం మరియు పోలిష్ ఆర్థికవేత్త వోడ్జిఎర్‌గ్రాస్ లాంటి వారి సిద్ధాంతాలు మొదలగునవి. ఇదేకాక కల్పిత మానవతా దృక్పథంలో నుండి 'స్టాలినిజం'పై విమర్శలను విస్తృతంగా ప్రచారం చేయటం, ఆల్ తూస్సార్, లూకాస్ ఫ్రాంక్‌ఫర్ట్ పాఠశాల, ఆగ్నస్ హెల్లర్ మొదలగు వారివేకాక కాంట్, లాక్, ఆల్విన్‌టాఫ్లర్, మిల్టన్ ఫ్రీడ్‌మెన్ భావలను విస్తృతంగా ప్రచారం చేసారు. ఈ మొత్తం అంతా కూడా లెనిన్, స్టాలిన్, మావోల సోషలిస్టు నమూనాలను ప్రాథమికంగా వ్యతిరేకించటమే. వాటిలో ఏ లోపాలు వున్నా అవే కొంత కాలం వరకూ సోషలిజాన్ని విజయవంతంగా నిర్మించటానికి ఉపయోగపడింది; చైనా కమ్యూనిస్టు పార్టీ ముందున్న సమస్య వాటిలో కొరతలను కనుగొని వాటిని పూడ్చుకోవటం. కానీ వారి పెట్టుబడిదారీ విధాన మార్గాన్ని తీసుకురావటానికి వారుసోషలిజం ప్రాథమిక సూత్రాలను తోసిరాజని, అత్యంత అభివృద్ధి నిరోధకమైన ఫ్రీడ్‌మన్‌తో సహా అన్నిరకాల మార్క్సిస్టేతర భావనలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఇదేకాక తాత్విక స్థాయిలో లెనిన్ పరావర్తన సిద్ధాంతం (మెటీరియలిజమ్ అండ్ ఎంపీరియోక్రిటిసిజం)పై పెద్దఎత్తున దాడి జరిగి, దాని స్థానంలో

''ఆచరణాత్మక భౌతికవాదం'' లాంటి భావనలను ముందుకు తీసుకొచ్చారు. అలాగే జిన్‌గువాన్‌తో తన ''టువార్డ్ది ఫ్యూచర్'' పుస్తక పరంపరలో ఆధునిక సైకాలజీ, భౌతిక శాస్త్రంలోని మార్పులు, సాపేక్షిక సిద్ధాంతం, క్వాంటమ్ మెకానిక్స్‌ల వెలుగులో ఏంగిల్స్ మరియు లెనిన్‌ల జ్ఞాన సిద్ధాంత సూత్రీకరణలను కాలం చెల్లినవిగా వాదించారు. ఈ మొత్తం మేధోపరమైన చర్చ మార్క్సిస్టు సూత్రాలను తోసిరాజని త్వరితగతిన ఆర్థిక సంస్కరణలు అమలు చేయటానికి ప్రాతిపదికను ఏర్పరిచింది. ఈ మొత్తం 1987లో సిపిసి 13వ కాంగ్రెస్ పంథాగా ఏకమయ్యి ''ప్రాథమిక స్థాయి సోషలిజం'' సూత్రీకరణ (అంటే అభివృద్ధికాని సోషలిజం)ను పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి ప్రధాన సైద్ధాంతిక సమర్ధనగా ప్రచారం చేసారు. ఉన్నతశ్రేణి సిద్ధాంతకర్త యగువాంగ్ యువాన్ చైనా సోషలిజం అపరిపక్వంగా వుందనే ప్రాతిపదికపై పెట్టుబడిదారీ విధానాలు అమలు చేయటాన్ని సమర్ధించారు. ఇలాంటి సిద్ధాంతపరమైన వైఖరులతోపాటుగా సాంస్కృతిక దాడి కూడా చేపట్టారు. 1988 వేసవిలో ప్రసారం అయ్యి విస్తృతంగా ప్రచారం అయిన టీ.వీ. సీరియల్ రివర్ ఎలజీ దీనికి సరైన ఉదాహరణ. ఇది చైనా సమాజం వెనుకబాటుతనంపై దృష్టి సారించి దాని స్థానంలో ఆధునిక పశ్చిమ సంస్థలను నిలపాలని తెలిపింది. ఇలాంటి ఆలోచనలనే అనేకమంది కళాకారుల పనిలోనూ, లియుజైపూ, లియూ జియావో జో, గాన్‌యాంగ్ లాంటి రచయితలు పనిలోనూ ప్రతిబింబించాయి. చైనా కమ్యూనిజం అంటే వ్యక్తిని నియంత్రించే కన్‌ఫ్యూషియన్ నిరంకుశతకు కొనసాగింపేనని ఈ రచయితలు ప్రచారం చేసారు. ఇవన్నీ కూడా ప్రజలలో అవినీతి బంధుప్రీతి, నయా రివిజనిస్టు పాలకుల నిరంకుశ పని విధానానికి వ్యతిరేకంగా ప్రజలకు భావజాలమైన తోడ్పాటు ఇవ్వటంతో అది అంతిమంగా తియానాన్‌మెన్ తిరుగుబాటుగా బ్రద్దలయ్యింది. దీనిని అణచివేసిన తరువాత అదే సమయంలో సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లో రివిజనిస్టు ప్రభుత్వాలు పడిపోవటంతో సి.పి.సి. నాయకులు నూతన తరహా జాతీయ వాదాన్ని ముందుకు తీసుకొచ్చారు. 1991లో ఇది మొదట ఒక డాక్యుమెంట్ రూపంలో వచ్చింది. దాని పేరు ''సోవియట్ తిరుగుబాటు తరువాత చైనా ముందున్న వాస్తవిక ప్రతిస్పందన వ్యూహాత్మక ప్రతిస్పందనలు''. ఇది నిర్లిప్తంగా మార్క్సిస్టు-లెనినిస్టు వంశపారంపర్యత్వం వల్ల తూర్పుయూరప్‌లోను, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయకపోవడం వల్ల, సోవియట్ యూనియన్‌లోను ప్రజా ఆగ్రహానికి గురయి కమ్యూనిజం కుప్పకూలింది అని వాఖ్యానించింది. కమ్యూనిజం కూలిపోయిన తరువాత పాఠం లాంటిదని పేర్కొంది. అలా జాతీయవాదమే అందరిని ఐక్యంగా వుంచి ఒకే తాటిపై నడపగల శక్తి అని, దానిని పాశ్చాత్య హేతువాదం ''చైనా ప్రజల ఉన్నతమైన ఘనమైన సాంప్రదాయ సంస్కృతి''తో మిళితమైన సైద్ధాంతిక చట్రంలో ఇరికించారు. 1990లలో అడ్డు అదుపూలేని పెట్టుబడిదారీ విధానం పరాయీకరణకు దారితీయగా, దానితోపాటువచ్చిన పెరుగుతున్న అసమానతలు జీవితంలో అభద్రతను దూరం చేయటానికి నయా కన్‌ఫ్యూషియనిజాన్ని 'వ్యక్తి' మరియు 'సాంస్కృతిక గుర్తింపు'కై వెతుకులాటలో ముందుకు తీసుకొచ్చారు. పశ్చిమ దేశాలలోనూ కనిపించే మతం వైపు మొగ్గు ప్రకారం నయా కన్‌ఫ్యూషియనిజమ్ (తన మూడవ శకంలో) పశ్చిమ ఉదారవాదం కంటే వ్యక్తికి, సమూహానికి మధ్య సంతోషకరమైన సమతుల్యాన్ని ఇస్తుందని అంటాడు. సి.పి.సి. ఇలాంటి భావజాలపరమైన సాంస్కృతిక ధోరణులను స్వయంగా ప్రోత్సహించటం ద్వారాగానీ లేదా స్వతహాగా పెరుగుతున్న దాని పట్ల శీతకన్ను వహించటం ద్వారాగానీ వాటిని పెరగనిచ్చారు. పెట్టుబడిదారీ అభివృద్ధి అలాంటి భావాలను పెంచుతుంది, అలాగే అలాంటి భావాల పెరుగుదల పెట్టుబడిదారీ అభివృద్ధిని బలవత్తరం చేస్తుంది. రాజకీయ అధికార నిర్మాణాలను చెదరగొట్టనంత వరకూ వాటిని అభివృద్ధి కానిచ్చారు. ఇలాంటి సైద్ధాంతిక ధోరణులను ఆనాటి బూర్జువా వర్గం అవసరాలను తీర్చటానికి తీసుకున్నారు. ఇవే నేడు ''మూడు ప్రాతినిధ్యాల'' సిద్ధాంత రూపం తీసుకున్నాయి.

## మరో విప్లవ అవసరం

కేంద్ర కమిటీలోని ముసలివారైన ఏడుగురు ప్రముఖులు ఎవరూ లేకుండా చిన్న వయసులోని నాయకత్వ బృందానికి నాయకత్వాన్ని ఏ గందరగోళం లేకుండా మార్పిడి చేయటాన్ని గురించి చాలా ప్రచారం చేసారు. అయినా జియాంగ్ నేటికీ కేంద్ర మిలిటరీ కమీషన్ నాయకుడిగా (76ఏళ్లలో) వెనుక నుండి వ్యవహారాలు నడిపేవాడుగా వుంటాడు. నేడు అధికారం 58ఏళ్ల హుజిన్‌టావో కు బదిలీ అయ్యింది. ఇతనిని 10 సంవత్సరాల క్రితమే డెంగ్ నాయకత్వంలోకి తీసుకున్నాడు. ఇతనికి ముఖస్తుతికి అలాగే జియాంగ్ 'ఆలోచన'ను ప్రోత్సహిస్తాడని అవసరమైన వాళ్లను ప్రసన్నం చేసుకునే వాడిగానూ పేరు ప్రతిష్ఠలున్నాయి. పొలిట్‌బ్యూరోలోని ఏడుగురు ఇతర స్టాండింగ్ కమిటీ సభ్యులలో ఐదుగరు జియాంగ్ మనుషులు. 356 మంది సభ్యులు వున్న నూతన కేంద్రకమిటీలో 50శాతం మంది కొత్త సభ్యులు వారిలో అత్యధికులు టెక్నోక్రాట్‌లే. స్పష్టంగా కమ్యూనిస్టు పార్టీలో క్రింది నుండి పై వరకూ బూర్జువా వర్గం బలంగా వేళ్లూనుకుని వుంది. చైనా ప్రజలచే గౌరవించబడే మావోను అంత సులభంగా త్యజించలేని స్థితిలో నూతన పాలకులు అతనిని జాతీయ (చైనా) ప్రతిమగా చేసారు. డెంగ్, జియాంగ్ విధానాలను పిడివాదంకాని మావో మార్క్సిస్టు వ్యాఖ్యానంగానూ చూపుతున్నారు. ఆశ్చర్యకరమైన దేమిటంటే సి.పి.ఐ./సి.పి.ఎం.లు ఇదే వ్యాఖ్యానాన్ని ప్రచారం చేయటం. 1976 కాలంలో వీరే అన్ని మావో రచనలపై విషంకక్కారు. ఎటువంటి వివరణా లేకుండా ఎందుకీ సైద్ధాంతిక యాక్రోబాటిక్స్ మావో పిడివాదాన్ని వ్యతిరేకించటానికి ప్రస్తు చైనాలోని మలినానికి మధ్య విపరీతమైన తేడా వుంది. మావో సృజనాత్మకత మార్క్సిజం అన్వయంలోనూ అభివృద్ధిలోనూ, అలాగే కార్మికవర్గ నియంతృత్వంలో విప్లవాన్ని కొనసాగించటంపై మన జ్ఞానాన్ని పెద్దఎత్తున పెంచాడు. డెంగ్/జియాంగ్‌ల సృజనాత్మకత మార్క్సిజాన్ని తిరగదోడటంలోనూ సోవియట్ యూనియన్‌లోలా గొయ్యిలో పడిపోకుండా (నేటివరకూ) చైనాను విజయవంతంగా పెట్టుబడిదారీ మార్గంలో ముందుకు తీసుకెళ్లటంలో వుంది. చైనాలో నూతన విప్లవానికై మొదట కావాల్సినది నేడు ప్రచారంలో వున్న తప్పుడు సిద్ధాంతాలను తిరస్కరించి మావోయిజం సారాన్ని ఎత్తిపట్టి చైనా చరిత్రలోని గొప్ప విప్లవ సాంప్రదాయాలను ప్రోత్సహించటమే. నిరంతరాయంగా కార్మిక, రైతాంగ పోరాటాలు బ్రద్దలవ్వటం భవిష్యత్తు ఆశాజనకంగా వుందని చూపుతుంది. వీటికి విప్లవ సిద్ధాంతాన్ని మిళితం చేసి నిజమైన కమ్యూనిస్టు పార్టీని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం ప్రాతిపదికపై పునర్నిర్మిం చటం అవసరం.

(సమాప్తం)

# సామ్రాజ్యవాద దేశాల దోపిడీ వ్యవస్థను నిలబెట్టే విదేశీ వుద్యోగాలను తిరస్కరించాలి ! మేధోవలసలను ప్రోత్సహించే సామ్రాజ్యవాద అనుకూల భావజాలాన్ని త్రిప్పికొట్టాలి !

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో భారతదేశంలో కొనసాగుతున్న 'ఆర్థిక సంస్కరణలు', వారికి మానవ వనరులను సమకూర్చే కేంద్రంగా మారిపోయింది. మన దేశంలోని అత్యున్నత వృత్తి నిపుణులను సామ్రాజ్యవాద దేశాలకు తరలిపోయేలా సామ్రాజ్యవాదులు, వారి నమ్మినబంట్లైన భారత పాలకవర్గాలు నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. శాస్త్ర పరిజ్ఞానం గల వ్యక్తుల సంఖ్యలో ప్రపంచంలో మూడవ స్థానంలో వున్న భారత్‌ను మానవ వనరుల ఎగుమతి జోన్‌గా మార్చివేసారు. భారత్‌లోని విద్యను నేటి సామ్రాజ్యవాద దేశాల అవసరాలు తీర్చే విధంగా తీర్చిదిద్దుతున్నారు. వేషభాషల్లో, నడతలో, మాట తీరులో అన్నింటా దోపిడీ సంస్కృతిని వంటబట్టించుకున్న భారతీయులను తయారు చేయడంలో నిమగ్నమైనారు. తమ గుప్పిట్లోనే వున్న ప్రచార మాధ్యమ ద్వారా నిత్యం సామ్రాజ్యవాద భావజాలాన్ని తలకెక్కిస్తున్నారు. మోసం, దగా, కుట్రల్లో ఆరితేరిన బిల్‌గేట్స్‌నే ఆదర్శంగా చిత్రీకరిస్తున్నారు. పాశ్చాత్య వెర్రి నాగరికతా వ్యామోహాన్ని, భారీ ఆదాయాలను, విలాసవంతమైన జీవితాలను పంచరంగుల్లో చూపించి వృత్తి నిపుణుల ఎగుమతి ప్రక్రియను సులభతరం చేసుకుంటున్నారు.

ప్రస్తుతం దేశాన్ని, మన రాష్ట్రాన్ని వెర్రెక్కిస్తున్న ఈ విదేశీ వుద్యోగాల వ్యామోహంలో అల్ప, మధ్య ఆదాయాల ప్రజలు చిక్కుకు పోయి వున్నారు. విదేశీ అవకాశాలు సన్నగిల్లినా, అమెరికా వైరస్ ఫివర్ వృత్తి విద్యాసంస్థల్లో, విశ్వ విద్యాలయాలలో, ఐ.టి. శిక్షణా సంస్థల్లో, అభివృద్ధి చెందిన జిల్లాల్లో, హైదరాబాద్‌లో తీవ్రతతో కొనసాగుతూనే వుంది. అమెరికా లేదా మరేదైనా విదేశం వెళ్లడమే యువత సుందర స్వప్నంగా మారిపోయింది. ఇలాంటి స్వప్నాలను సృష్టించటానికే చంద్రబాబు లాంటివారు రాష్ట్రానికి అమెరికా ప్రెసిడెంట్‌ను, బిల్‌గేట్స్‌ను తీసుకు వస్తుంటారు. అమెరికాలో ఆర్థిక మాంద్యం తీవ్రమై సాఫ్టవేర్, ఐ.టి. సంస్థలు తీవ్ర నష్టాలకు గురై లక్షలాది వుద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో - ఇక్కడ అమెరికా కోసం శిక్షణ పొందుతున్న వారు మాత్రం మంచి రోజులు రాకపోతాయా అంటూ ఎదురు చూస్తూనే వున్నారు. ఒకప్పడు ఈ మేధోవలసను అసహ్యించుకుని, దేశం గురించి, దాని అభివృద్ధి గురించి, జాతీయత గురించి చాటి చెప్పటమే దేశభక్తిగా పరిగణించేవారు. కాని, నేటి బి.జె.పి. నాయకత్వంలో ఎన్‌డి.డి.ఎ. పాలనలో పాకిస్తాన్‌ను వ్యతిరేకించడం ముస్లిం ప్రజలను ఊచకోత కోయడమే దేశభక్తిగా, సామ్రాజ్యవాదులకు సేవ చేయడమే ప్రపంచీకరణగా మారిపోయింది.

## దళారీ పాలకుల దుష్పరిపాలనా ఫలితవేు నేడు కొనసాగుతున్న విదేశీ వలసలు

వుద్యోగాన్వేషణలో పొట్టచేతబట్టుకుని విదేశాలకు వెళ్లి స్థిరపడటం అనేది బ్రిటీష్ వలస పాలకుల పాలన నుండే ప్రారంభమైంది. అదీ వారి అవసరాలను తీర్చటానికే. ఒక వెల్లువలా ప్రారంభమైన ఈ వలసలు ఆ తర్వాత ఆ ఉధృతి తగ్గినా, అప్పడప్పడు కొందరు భారతీయులు వలసపోతూనే వున్నారు. అయితే ఒక వెల్లువలాగా వెళ్లడమనేది బ్రిటిష్ పాలనలోను, తరువాత 'స్వతంత్ర భారతం'లో కూడా రెండు సందర్భాల్లో సాగింది.

మొదటగా 1830లలో ప్రారంభమైన ఈ విదేశీ వలసలు ఆ శతాబ్దం చివరి వరకు సాగుతూనే వున్నాయి. 1834లో బ్రిటీష్ వలసలలో తిరుగుబాట్ల ఫలితంగా బానిస విధానాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఆ కాలంలో అప్పటి పారిశ్రామికాధిపతులలో 'ఒప్పందాల' పేరిట లక్షలాది నిరుపేద భారతీయులను కాంట్రాక్టు పనివారలుగా బ్రిటీష్ వలసలకు బ్రిటీష్‌వారు తరలించారు. ఈ కాలంలో స్త్రీలు, పిల్లలతో సహా 70 లక్షలకు పైగానే భారతీయులు వలస పోయారు. వీరి వలసలు మానవజాతి చరిత్రలోనే రక్తసిక్తమైనవి. ఎంతోమంది ప్రయాణాల్లోనే మరణించగా, మిగిలిన వారిలో అనేకులుఅక్కడి దుర్భర పరిస్థితుల వల్ల రోగాల, బారినపడి దేశంకాని దేశంలో దుర్మరణం చెందారు. ఇప్పటి 'ఇమిగ్రేషన్ కన్సల్టెన్సీ' సర్వీసుల్లాగానే ఆనాడు ఆర్కాటీలు అనే ఏజెంట్లు గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఈ వలసలకు తరలించారు. క్రమక్రమంగా వీరంతా ఆఫ్రికా, వెస్ట్ఇండీస్, ఫిజీ, మారిషస్, గయానా, ట్రినిడాడ్, జమైకా, సింగపూర్, మలేషియాలలో స్థిరపడిపోయారు. అప్పటి నుండి విదేశీ వాణిజ్యంలో వున్న వ్యాపారస్తులు, మాజీ మహారాజుల్లాంటి వారి, బ్రిటన ప్రభు భక్తి పరాయణులు బ్రిటన్‌లోనూ, దాని వలసల్లోనూ స్థిరపడుతూనే వున్నారు.

రెండవసారి 1970లలో విదేశాలలో ఉపాధిని వెతుక్కుంటూ భారతీయులు ఒక వెల్లువలా తరలిపోయారు. ప్రత్యేకించి సామ్రాజ్యవాద దేశాలైన అమెరికా, యూరోపు దేశాలకు అత్యున్నతమైన వృత్తి నిపుణులు, అధిక వేతనాల కోసం వలసపోగా, 'చమురు' రాకతో నూతనంగా ధనవంతమైన పశ్చిమాసియాకు నిపుణత కలిగిన భారతీయ కార్మికులు వలసపోయారు. రాష్ట్రంలో అనేక జిల్లాల నుండి దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా, యు.ఎ.ఇ. లాంటి దేశాలకు తరలిపోయారు. ఒక్క సౌదీ అరేబియాకే 15లక్షల భారతీయులు చేరిపోయారు. తర్వాత దీని ఉధృతి తగ్గినప్పటికీ తాత్కాలిక షరతులపై కొన్ని వలసలు సాగుతూనే వున్నాయి. దుబాయ్ వెళ్లడంతో డబ్బు సంపాదన పెరిగినప్పటికీ, ఆయా దేశాల్లో వీరు ఎలాంటి హక్కులు లేకుండా, వారి దయా దాక్షిణ్యాలపైనే జీవించాల్సి వస్తుంది. గల్ఫ్‌లో ఏ యుద్ధం మేఘం ఉరిమినా వేలాదిగా భారత్‌కు తిరిగి తరలి వస్తుంటారు.

మూడొవసారి 1990లలో జరిగింది. ఇది గతంకన్నా విస్తృతమైనది. పెద్దది కూడా. ఈసారి అమెరికా, కెనడా, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సాధారణ నిపుణుడి నుండి అత్యున్నత స్థాయి శాస్త్ర నిపుణుల వరకు వలసపోయారు.

సామ్రాజ్యవాద దేశాల్లో సంక్షోభంలో భాగంగా, తమ వుత్పత్తి ఖర్చులను తగ్గించుకోవటానికి, తక్కువ వేతనాలకు అధిక ఫలితాలను అందించగల 'మైగ్రెంట్స్' సామ్రాజ్యవాద దేశాలకు అవసరం ఏర్పడి, భారతదేశం నుండి వలసలనుప్రోత్సహించాయి. ఈ వెల్లువలో వృత్తి నిపుణులు, డిప్లొమా హోల్డర్లు, నర్సులు, విద్యార్థులు ఒక్కరేమిటి తమకు అవసరమైన వారందరినీ సామ్రాజ్యవాద సంస్థలు తమ దేశాలకు రప్పించుకున్నాయి. సామ్రాజ్యవాద ప్రత్యేక లక్షణాలలో ఒకటైన 'సామ్రాజ్యవాద దేశాల నుండి విదేశాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గిపోవడమూ, వేతనాలు తక్కువగా వున్న మరీ వెనుకబడిన దేశాల నుండి సామ్రాజ్యవాద దేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరగడమూ' అనేది

అమలు జరుగుతున్నది. ఒకప్పుడు యూరోపులో వెనకబడిన దేశాల నుండి అమెరికాకు వలసలు సాగగా, నేడు ఆసియా ప్రాంత దేశాల నుండి వలసలు అధికమైనాయి. నిరుద్యోగ సమస్యని చిత్తశుద్ధితో పరిష్కరించలేని భారత దోపిడీ పాలకవర్గాలు తమ సామ్రాజ్యవాద ప్రభువుల అవసరాలను తీర్చడం కోసం వలసలను పెద్దఎత్తున ప్రోత్సహించాయి.

ప్రస్తుతం భారతీయ పాస్‌పోర్టు కలిగి వుండి విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు 2కోట్లకు పైగానే వు న్నారు. ఈ కాలంలో ఒక్క అమెరికాకే 20లక్షల మంది భారతీయులు వలసపోయారు. గత రెండేళ్లలోనే అమెరికాకు 2లక్షల 46వేల మంది చేరుకున్నారు. ఇలా ప్రతి ఏటా 85వేల మంది నిపుణత కలిగిన భారతీయులు భారతదేశాన్ని వదిలి వెళ్తూనే వున్నారు. అత్యున్నతమైన నిపుణత కలిగిన వీరు, ఇలా ప్రతి సంవత్సరం దేశం నుండి తరలిపోవడం వలన భారతదేశం సాలీనా 10వేల కోట్ల రూపాయల వనరులను కోల్పోతున్నది.

ఈ మానవ వనరులను విదేశాలకు తరలించడంలో ఆంధ్ర రాష్ట్రం భారత్‌లోనే ముందంజలోనే వుంది. భారత్ నుండి అమెరికా వెళ్లిన సాఫ్ట్‌వేర్ నిపుణలలో 23శాతం మంది ఆంధ్రులే. ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోని కుటుంబాలలో ఎవరో ఒకరు అమెరికాలో వుద్యోగమో, చదువో వెలగబెడుతూనే వున్నారు. అమెరికాలో చదవడమో, వుద్యోగం చేయడమో, అక్కడే సెటిలయ్యిపోవడమో నేడు మధ్యతరగతికి ఒక స్టేటస్‌గా మారింది. చివరకు పెళ్లిళ్ల ప్రకటనల్లో కూడా అమెరికా సంబంధాలనే అడుగుతున్నారు. నిత్యం హైటెక్ జపం పటిస్తూ, సామ్రాజ్యవాద దేశాల అవసరాలు తీర్చడంలో నిమగ్నమైన చంద్రబాబు ప్రభుత్వం, హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపడం, విదేశాలకు పాస్‌పోర్టులు, వీసాల మంజూరులో త్వరితగతిన పనులు పూర్తయ్యేలా కేంద్రంతో చెట్టాపట్టాలు వేసుకుని పని చేస్తున్నది. ఇక నిత్యం 'స్వదేశీ' నినాదాన్ని పలికే బి.జె.పి. నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం ఈ 'విదేశీ' వలసలకు రాజముద్ర వేస్తున్నది. పైగా ఇటీవల అమెరికా పర్యటించిన ప్రధానమంత్రి వాజ్‌పాయ్ అక్కడ నివసిస్తున్న భారతీయులకు 'ద్వంద్వ పౌరసత్వం' కల్పిస్తామనే భరోసా కూడా ఇచ్చారు.

## సామ్రాజ్యవాద అనుకూల భావజాలం; భారతీయులపై దాని ప్రభావం

సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారీ సంస్థలు, వారి వందిమాగధులైన భారత పాలకవర్గాలు, వారి సర్వయంత్రాంగం ఒక పథకం ప్రకారమే సామ్రాజ్యవాద అనుకూల భావజాలాన్ని ప్రజలకు నూరిపోస్తున్నారు. అసంఖ్యాకమైన 'స్వదేశీ', 'విదేశీ' టీ.వీ ఛానెళ్ల ద్వారా, పత్రికల ద్వారా, ఇంటర్‌నెట్ ద్వారా, ప్రకటనల ద్వారా ఈ భావజాలాన్ని క్రమం తప్పకుండా ప్రజల బుర్రల్లోకి చొప్పిస్తున్నారు. గ్లోబలైజేషన్ పేరిట నేడు సాగుతున్నదంతా సామ్రాజ్యవాదుల అవసరాలు తీర్చటానికే.

## ఇంగ్లీగు భాషా వ్యామోహం; విదేశీ చదువులు

మాతృభాషలో విద్యాబోధన, పరిపాలనలో మాతృ భాషా వినియోగం అని పాలకులు గత ఐదు దశాబ్దాలుగా ఊదరగొడుతూనే వున్నా ఆచరణలో అంతా ఇంగ్లీషే ! 'తెలుగు వారందరం – తెలుగే మాట్లాడుదాం' అంటూ తియ్యని ప్రకటనలు గుప్పిస్తూనే ఇ-గవర్నెన్స్‌కే పెద్దపీట వేస్తున్నారు. నేడు అతి చిన్న పట్టణం నుండి మహానగరాల వరకు పిల్లలకి చదవడం, రాయడం, మాట్లాడటం, తినటం, త్రాగటం, ఆడుకోవడం అన్నీ ఇంగ్లీషులోనే. వుద్యోగాలకు డిగ్రీలు వున్నా ప్రధాన అర్హత ధారాళంగా, సొగసుగా ఇంగ్లీగు మాట్లాడటం, రాయడమే. అక్షరాభ్యాసమే ఇంగ్లీషులో సాగుతున్నది. నేటి విద్యార్థి లక్ష్యం ర్యాంకులు తెచ్చుకోవటం, పై చదువులక సీట్లు ఖాయం చేసుకోవడం, వున్నతోద్యోగాలు సంపాదించడం, విదేశాలకు తరలడం.... దానికోసం బ్రిటన్ ఇంగ్లీషు, అమెరికన్ ఇంగ్లీషు ప్రత్యేకంగా అధ్యయనం చేయడం. ఈ వెర్రి ముదిరి విదేశాల్లో చదివించడమే ఉత్తమమనే అభిప్రాయం బలపడిపోయింది. 2003 నాటికి పది లక్షలకు పైబడి భారతీయ విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తుండగా, అందులో సగానికి పైగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల్లోనే వున్నారు. అమెరికాలో విద్యనభ్యసించే విద్యార్థుల్లో నూటికి తొంభై మంది తిరిగి భారత్ ముఖమే చూడటం లేదు. ఈ విదేశాల్లో చదివే వారిలో సంపన్న వర్గాలు, ఉన్నతాదాయ వర్గాలే కాకుండా, అల్ప, మధ్య ఆదాయాల కుటుంబాలవారు కూడా గణనీయమైన సంఖ్యలోనే వున్నారు.

## వెర్రితలలు వేస్తున్న పోటీతత్వం

పదవ తరగతి నుండి ఎంసెట్ వరకు ర్యాంకుల కోసం నేటి విద్యార్థులు పుస్తకాల పురుగుల్లా మారిపోయారు. విశ్వవిద్యాలయాలలో సీట్లు సంపాదించాలంటే 90శాతం మార్కులు కూడా చాలడం లేదు. ర్యాంకులు సాధించినవారే ఇంజనీరింగ్, మెడిసిన్, కంప్యూటర్ కోర్సుల్లో, ఐ.ఐ.టి.ల్లో సీట్లు సాధించగలరు. విదేశాలకు వెళ్లగలరు. విలాసవంతమైన జీవనం సాగించగలరు. మధ్యతరగతి వారి సుందర స్వప్నం తమ పిల్లల్ని విదేశాలకు పంపడం, వున్నతోద్యోగాలు సాధించడం. అందుకే వారి పిల్లలు ఫలితాలు సాధించాలని వారిని అమితంగా ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఈ ర్యాంకుల వేటలో కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్ల రూపాయలు కూడబెట్టుకుంటుంటే, విద్యార్థులకు మానసిక శాంతి కరువై చుట్టూ వున్న ప్రపంచాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా చదువే సర్వస్వం అయిపోయింది. అందుకే వీరికి ఆంధ్ర రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పట్టవు. కరువు తీవ్రత తెలియదు. గుజరాత్‌లో హిందూ మతోనాత్మదులు జరిపిన మారణకాండను పట్టించుకోరు. ఆఫ్ఘనిస్తాన్ పైనా, ఇరాక్‌పైనా అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాలు అసలే పట్టవు. ధ్యాసంతా ర్యాంకులపైనే. ఈ ర్యాంకుల పోటీలో ర్యాంకులు పోతాయనే భయంతో ప్రక్కవాటిని కూడా నమ్మకపోవడం, సమిష్టితత్వం నశించడం, ఎవరికివారే త్రోసుకుంటూ 'పరమపద సోపానపటం'లో ఎగబ్రాకటానికి ప్రయత్నించటం; ఇందులో పాములు మింగి క్రిందపడిన వారికి ఆత్మహత్యలే శరణ్యమనే పరిస్థితిని – దోపిడిటీ పాలకవర్గాలు కల్పించగలిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పరీక్షా ఫలితాలు వెలువడిన వెంటనే ర్యాంకులు, తగిన మార్కులు రాలేదన్న మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య నానాటికి పెరిగిపోతున్నది.

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఈతరం దేశ జనాభాలో (10ఏళ్ల నుండి 19లోపు వయసున్నవారు) 25కోట్ల మంది వున్నారు. వీరిలో గ్రామీణ నిరుపేద కుటుంబాల పిల్లల్ని తీసివేసినా, అల్ప, మధ్య ఆదాయ వర్గాల పిల్లల సంఖ్యేమి తక్కువ వుండదు.

## మార్కెట్ సంస్కృతి; వస్తు వినియమ జీవనశైలి

సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారీ సంస్థలు తమ వుత్పత్తులను ప్రజలపై రుద్దటానికి, మార్కెట్‌ను పెంచుకోవటానికి భారత జాతీయతతో సంబంధంలేని వెర్రి సంస్కృతిని ప్రవేశపెడుతున్నాయి. అందుకే తాజాగా మన 'డే'లలో వాలెంటైన్స్‌డే, ఫ్రెండ్‌షిప్‌డే, బాస్‌డే, సెక్రటరీస్ డే లాంటివి వచ్చిపడ్డాయి. ప్రత్యేకించి వాలెంటైన్స్ డే పేరుతో దేశవ్యాపితంగా యువతను పెడద్రోపట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రతి 'డే'కి బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడాలు,

బోకేలు, అభినందనలను అందించుకోవడం, పార్టీలు జరుపుకోవడం లాంటివి గుత్తపెట్టుబడిదారీ సంస్థలు తమ వుత్పత్తులకు గిరాకీ పెంచుకోవటానికే ఈ పాశ్చాత్య జీవనశైలిని అలవరుస్తున్నాయి. ఆడంబరంగా జీవించడం, అత్యాధునిక సాంకేతిక పరికరాలను కోరుకోవడం లాంటివి ఇళ్లల్లో జొరబడిన టీ.వీ. ఛానల్స్ ద్వారా బోలెడంత ప్రచార ఆర్భాటాలు సాగిస్తూ, యువత దృష్టిని తమ వైపు నిలుపుకోగల్గుతున్నారు. ఇందులో భాగంగానే ఫాషన్ పెరేడ్‌లు, మిస్ యూనివర్స్, మిస్ విశాఖ కిరీటాలు, డిస్కోథెక్స్, వారంతపు పార్టీలు, 'హట్', 'హబ్', 'పబ్'ల పేరుతో మత్తు పానీయాల వినియోగం పెరిగిపోతున్నది. ఇది ముదిరినేడు విశ్వవిద్యాలయాల, కాలేజ్ హాస్టల్స్‌లో నీలిచిత్రాల ప్రదర్శనల వరకు ఈ సామ్రాజ్యవాద విశృంఖుల సంస్కృతి ప్రాకిపోతున్నది. ఇది సంపన్న కుటుంబాలనేకాక దినదినం పెరుగుతున్న మధ్యతరగతిని కూడా కబళించి వేస్తున్నది. ఈ విలాసాల కోసం ఎలాగైనా సరే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడమే నేటి యువత లక్ష్యంగా మారిపోయింది.

అందుకే దేశంపట్ల, ప్రజలపట్ల, వారి సమస్యల పట్ల చిన్న చూపు చూసే ధోరణి విద్యార్థుల్లో పెరిగిపోతున్నది. ప్రపంచ పరిణామాల పట్ల నిర్లిప్తత. అమెరికా, దాని సామ్రాజ్యవాద యుద్ధ పథకాలను అర్థం చేసుకోకపోవడం, యుద్ధం వల్ల తమ విదేశీ ప్రయాణాలకు, తమ భవిష్యత్తుకు విఘాతం కలుగుతుందన్న ఆందోళనతో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను ఖండించకపోవడం, నిరసనను వ్యక్తం చేయకపోవడం నేటి యువతకు బలహీనతగా పరిణమించింది. ప్రపంచ వ్యాపితంగా లక్షలాది మంది నిరసన వ్యక్తం చేస్తున్న మన విశ్వవిద్యాలయాల్లో నిశ్శబ్దం రాజ్యమేలింది.

## ప్రపంచ శక్తుల్ని అణచివేయడం

ఆంధ్ర రాష్ట్రంలో రాడికల్ విద్యార్థులను వెంటాడి, వేటాడి ఎన్‌కౌంటర్స్ పేరుతో కాల్చిచంపిన చంద్రబాబు ప్రభుత్వం విద్యారంగంలో ప్రగతిశీల భావాలను ఏమాత్రం సహించే స్థితిలో లేదు. ప్రపంచబ్యాంకు అదుపాజ్ఞలలో పని చేసే చంద్రబాబు ప్రభుత్వం తమకు సేఫ్టీజోన్స్‌గా విద్యారంగాన్ని మలుచుకుంటున్నది. ''ఏ యిజమూ లేదు. ప్రపంచమంతా కమ్యూనిజం ఓడిపోయింది. వున్నదల్లా ఒకే యిజము. అదే టూరిజం'' అంటూ వామపక్ష భావాలను అవహేళన చేస్తూ సామ్రాజ్యవాద అనుకూల భావాన్ని ప్రచారం చేస్తున్నది. కేంద్రంలో అధికారం సాగిస్తున్న బి.జె.పి. విద్యార్థి సంస్థైన ఎ.బి.వి.పి. కేంద్రం రాష్ట్రాలలో తమకు అనుకూలంగా వున్న పరిస్థితిని వుపయోగించుకుని, రాడికల్, ప్రగతిశీల విద్యార్థులపై దాడులు చేస్తూ, వారి ఉనికే కానరాకుండా చేస్తూ, అభివృద్ధి నిరోధక భావజాలాన్ని విద్యార్థుల్లో ప్రచారం చేసుకుంటున్నది. ఇలా విప్లవకర భావజాలం అణచివేతకు గురవడంతో, దాని స్థానంలో అభివృద్ధి నిరోధక బూర్జువా, భూస్వామ్య భావజాలమే నేడు ప్రధానంగా విద్యారంగంలో రాజ్యమేలుతుంది.

## నిరుద్యోగ రక్కసి కోరల్లో చిక్కుకున్న యువతకు పలాయనం పరిష్కారం కాదు

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధికల్పనా కేంద్రాల్లో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య 40లక్షలు. ఇందులో 60శాతం విద్యార్థులే. ప్రతి సంవత్సరం సుమారు 3లక్షల 50వేల మంది పేర్లు నమోదు చేసుకుంటుండగా – కేవలం 10వేల మంది మాత్రమే ఆ కేంద్రాల ద్వారా వుద్యోగాలు పొందుతున్నారు. 1994-2000ల మధ్యకాలంలో చంద్రబాబు ప్రభుత్వం హైటెక్ పాలనలో ఉద్యోగాల వార్షిక పెరుగుదల రేటు కేవలం 0.35శాతం మాత్రమే. ఇది దేశంలోనే అతి తక్కువ. కేవలం వయో పరిమితి దాటి పోవడం, రెన్యువల్స్ సకాలంలో చేసుకోక దపోవడం వల్లనే సుమారు 4లక్షల మంది ఉద్యోగార్హతను కోల్పోయారు. ఉద్యోగాలకు రాష్ట్రంలో ఎంత పోటీ వుందంటే 1995-2000 మధ్యకాలంలో ఆర్.టి.సి.లో క్యాజువల్ కండక్టర్లుగా ఎంపికైనవారిలో 30శాతం మంది ఎం.ఫిల్, పి.జీ. వుత్తీర్ణులు వున్నారంటే రాష్ట్రం ఎంత అధ్వాన్న స్థితిలో వుందో అర్థమవుతుంది. దేశాభివృద్ధికి మూలరంగాలైన వ్యవసాయాన్ని, పరిశ్రమలను అతిఘోరంగా నిర్లక్ష్యం చేసి సర్వీసు రంగానికే పెద్దపీట వేయడంవల్ల రాష్ట్రం, దేశం వల్లకాడులా మారిపోయింది. చంద్రబాబు ప్రభుత్వం 'ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను శరవేగంగా మూసివేయడం వలన గత ఐదేళ్లలో 40వేల మంది వుద్యోగాలు కోల్పోగా, కాళీగా వున్న 2 లక్షల 50వేల వుద్యోగాలను భర్తీ చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 251 భారీ, మధ్యతరహా ప్లాంట్‌లు, 29,359 చిన్నతరహా యూనిట్లు ఖాయిలాపడి మూతపటం మూలంగా 2లక్షల 93వేల మంది ఉపాధి కోల్పోయారు. ఇలా లక్షలాదిగా వున్న వుద్యోగాలనే ఊడగొడుతున్న చంద్రబాబు ప్రభుత్వం విజన్ 2020లో 8కోట్ల వుద్యోగాలు కల్పిస్తామని గత ఐదేళ్లుగా చెప్తూనే వుంది. ఇక వ్యవసాయరంగం దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల ఆత్మహత్యల్లో, వడగాడ్పుల్లో, పిల్లల మరణాలలో, ఆకలి చావుల్లో ఆంధ్రదేశం అగ్రగణ్యంలో వుంది. ఇలా మరణించిన వారిలో నూటికి 90మందికి గ్రామీణ నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలవారే. ప్రభుత్వ అవకతవక విధానాల వలన సంవత్సరాల తరబడి కరువు, జీవన ప్రమాణాలు అతి క్రిందికి పడిపోవడం, కనీస ఆహారం లభ్యంకాక పోషకాహార లోపం, ఏమాత్రం నిలబడలేని వ్యవసాయం, వ్యవసాయ రుణాలు, గ్రామీణ నిరుద్యోగం – ఇలా అన్నపూర్ణగా పేరు గడించిన ఆంధ్రదేశ గ్రామసీమల్లో నేడు మృత్యువు కరాళ నృత్యం చేస్తున్నది. కొద్దిపాటి తేడాలతో దేశమంతటా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. భారత ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనమే ప్రశ్నార్థకంగా మారింది. పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామ్రాజ్యవాద అనుకూల విధానాల వలన, ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి దేశంలోకి వ్యవసాయ దిగుమతులు పెరిగిపోయాయి. గోధుమలు, వంటనూనెలు, ముడిపత్తి, పంచదార లాంటి స్వయం సమృద్ధమైన పంటలను కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. చివరకు కొబ్బరి పీచు, ఆవుపేడను కూడా దిగుమతి చేసుకుంటున్నారంటే ప్రభుత్వాల దివాళాకోరుతనం అర్థమవుతుంది. ఈ దిగుమతుల దాడి వలన సంప్రదాయసిద్ధమైన వస్తూత్పత్తి దేశం నుండి అంతర్ధాన మవుతున్నది.

భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయం, పరిశ్రమల పునరుజ్జీవనం కోసం దోపిడీ పాలకులపై పోరాడాల్సిన యువతకు పలాయనం పరిష్కారం కాదు. నిజానికి పలాయనం కూడా జీవన భద్రతను కలిగించడం లేదు. మంచి 'బూమ్' సమయంలో కూడా విదేశాలకు వెళ్లినవారి శాతం మొత్తం నిరుద్యోగ సైన్యంలో 0.15శాతం దాటటం యలేదు. ఈ కొద్దిపాటి అవకాశాల కోసం దేశ విద్యావిధానంపై, ఆలోచనా ధోరణిపై, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం కలిగిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలను తిరస్కరించాల్సి వుంది.

ఈ విదేశీ వలస 'బూమ్' కల కరిగిపోయి చాలా కాలమయింది. అయినా దోపిడీ పాలకులు మంచి రోజులు రాబోతున్నాయని కంప్యూటర్, ఐ.టి. రంగాలు తిరిగి పుంజుకుంటాయని నమ్మబలుకుతున్నారు.

## సామ్రాజ్యవాద దేశాల్లో సంక్షోభం; త్రిశంకు స్వర్గంలో ప్రవాస భారతీయులు

సామ్రాజ్యవాద దేశాలు తీవ్రమైన ఆర్థికమాంద్యం బారినపడటంతో 1990లలో భారతీయులకు అందివచ్చిన విదేశీ వుద్యోగావకాశాలు బాగా తగ్గిపోయాయి. అధికోత్పత్తి సంక్షోభం, పరిశ్రమల మూసివేత, వుద్యోగుల తొలగింపు, విదేశాల నుండి వస్తున్న వారిపై ఆంక్షల విధింపు ప్రారంభమైంది. అగ్రరాజ్యంగా విర్రవీగుతున్న అమెరికానే ఆర్థిక మాంద్యంలో కూరుకుపోవడంవలన నాలుగు లక్షల

వుద్యోగాలు గాల్లో కలిసిపోయాయి. ప్రముఖ సాఫ్ట్‌వేర్, ఐ.టి. సంస్థలు మూకుమ్మడిగా 'లే ఆఫ్'లు, 'పింక్‌స్లిప్'లు, 'ఫైలింగ్' (వుద్యోగులను తొలగించడం) కార్యక్రమాలను కొనసాగించాయి. భారతీయ అమెరికన్‌లకు ముఖ్య ప్రాంతమైన శాంటాకార ప్రాంతంలో గడిచిన రెండేళ్లలో 1,21,500 మంది వుద్యోగాలు కోల్పోయారని కాలిఫోర్నియా ఉపాధి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉద్యోగావకాశాలు కనుమరుగయ్యాయి. వున్న వుద్యోగాలకు 2 సంవత్సరాల నుండి 7 సంవత్సరాల అనుభవం అడగడంలో ఫైఫ్ కాండిడేట్స్‌కి అవకాశాలు తగ్గిపోయాయి. మొత్తంగా నిరుద్యోగం 7 శాతానికి పెరిగింది. నాస్‌డాక్ ఇండెక్స్ ఐదేళ్ల కనీస స్థాయికి పడిపోయి, ఎదురు లేదనుకున్న అమెరికన్ డాలర్ మార్కెట్‌లో అస్థిరపడి పోయింది. పైగా 389కోట్ల డాలర్ల నష్టాల్ని లాభాలుగా ప్రపంచానికి చూపి మోసం చేసిన వరల్డ్‌కామ్ దివాళా తీయడం, జాన్‌సన్ అండ్ జాన్‌సన్; ఎన్రాన్ వంటి పేరుమోసిన సంస్థలు ఆర్థిక కుంభకోణాల్లో మునిగి పోవడం, బిల్‌గేట్స్ లాంటి వారి ఆర్థిక నేరాలు ఒక్కటొక్కటి వెలుగులోకి వస్తుడటంతో అమెరికన్ మార్కెట్ భవిష్యత్తే అగమ్యగోచరంగా మారిపోయింది. తమ ఆర్థిక దుస్థితి నుండి బయట పడటానికి ఇరాక్‌పై దురాక్రమణ యుద్ధాన్ని సాగించి, చమురు బావులపై గుత్తాధిపత్యం వహించినప్పటికీ దాని పరిస్థితి ఏమంత మెరుగుపడలేదు. ఇరాక్‌లోని చమురు అమ్మకాల ద్వారా సమకూరుతున్న ఆదాయం ఇరాక్‌లోనే దాని నెలవారీ ఖర్చులకు(320కోట్ల డాలర్లు) కూడా సరిపోవడంలేదు. ఇక 'పునర్నిర్మాణం' ప్రచారమంతా యు.ఎన్ ద్వారా మరికొంత ధనాన్ని ఇరాక్‌కు తీసుకురావడం కోసమే. ఇటీవలే సద్దాం కుమారులను చంపి వుత్సవాలు జరుపుకున్న అమెరికా సామ్రాజ్యవాదులు – ''సద్దాం కుమారుల మరణం కారణంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగమించందుకు మార్గం ఏర్పడిందని'' అమెరికా ఆర్థికమంత్రి జాన్‌స్నో ప్రకటించాడంటే, దాని ఆర్థిక పరిస్థితి ఎంత దయనీయమైన దుస్థితిలోవుందో అర్థం చేసుకోవచ్చును. ఇక కంప్యూటర్ల తయారీలో ప్రపంచ ప్రసిద్ధిపొందిన ఐ.బి.ఎం. కార్పోరేషన్ తన ప్రధాన వ్యాపారమైన కంప్యూటర్ల తయారీని ప్రస్తుతానికి ప్రక్కనబెట్టి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వంటి సాంకేతిక అనుబంధ వస్తువులను రూపొందించడంలో నిమగ్నమైంది.

ఈ సంక్షోభాల కారణంగా అమెరికాలో వుద్యోగాలు కోల్పోతున్న అమెరికావారు ''విదేశాల నుండి వచ్చినవారు స్వల్ప వేతనాలకే పని చేస్తామని అంగీకరించడం వల్ల అమెరికన్లు వుద్యోగావకాశాలు కోల్పోతున్నారని'' – అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి ప్రారంభమైంది. వీసా పరిమితి దాటి నాలుగైదేళ్లుగా దేశంలో నివసిస్తున్న 10లక్షల మందిని దేశం విడిచిపెట్టాలనే డిమాండు నానాటికి పెరుగుతున్నది. కంపెనీ శాఖల మధ్య మార్పిడి జరిగే ఉద్యోగుల సంఖ్యను, అంటే ఎల్–1 వీసా వర్గాన్ని పరిమితం చేయాలని అమెరికన్ కాంగ్రెస్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. ఇప్పటికే హెచ్ వన్–బి వీసాని ఎత్తివేయాలని కోరుతూ కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం కోసం ఎదురుచూస్తున్నది. అమెరికాతోపాటు కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ లాంటి సామ్రాజ్యవాద దేశాల్లో కూడా వుద్యోగాల కోత ప్రారంభమైంది. ఈ మధ్యనే విదేశీ వుద్యోగ వలసలను ప్రోత్సహించిన జర్మనీ సైతం గ్రీన్‌కార్డులను నిలిపివేసింది. ఈ సామ్రాజ్యవాద దేశాల సంక్షోభం మూలంగా అక్కడ భారతీయుల వునికే ప్రశ్నార్థకమైంది. హెచ్ వన్–బి వీసాలున్న భారతీయ వుద్యోగులు రెండు, మూడు గంటల వ్యవధిలో వుద్యోగాలు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. హెచ్‌వన్–బి వీసాల రద్దుకు పది రోజుల ముందు తిరుగు ప్రయాణం కట్టడంగానీ, వేరే వుద్యోగంలో చేరడంకాని జరగాలి. కొందరు భారతీయులు సంపాదించిన మేరకు మూటగట్టుకుని ''భారత్‌లో లభించినంత స్వేచ్ఛ మరెక్కడా లభించదు. మన దేశాన్ని మనం బాగు చేసుకోకపోతే, మరెవరు చేస్తారు ?'' అంటూ భారత్‌కు తిరిగి వస్తుండగా, అలా రావడానికి ఇష్టపడని భారతీయులు అక్కడే ఏ పని చేయటానికైనా సిద్ధపడుతున్నారు. వృత్తి నిపుణుల్లో ఆరితేరి న్యూజిలాండ్ చేరిన భారతీయులు అక్కడ 'పళ్లతోటల్లో పళ్లు తెంపేవారిగా, గ్యాస్ స్టేషన్స్‌లో అటెండెంట్స్‌గా, క్లీనర్లుగా, టాక్సీ డ్రైవర్లుగా, మెక్‌డోనాల్డ్ ఔట్‌లెట్స్‌లో కూరగాయలు తరిగేవారుగా బ్రతుకులీడుస్తున్నారు. రూర్కెలా స్టీల్‌ప్లాంట్‌లూ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసినవారు అక్కడ దినసరి వేతనంపై సెక్యూరిటీగార్డ్‌గా పనులు చేస్తున్నారు. మెటలర్జీలో డాక్టరేట్ కలిగిన మరొకరు ఫర్నిచర్ షాపులో పని చేస్తున్నారు. ఇలా పాశ్చాత్య దేశాల్లో ఒకవైపు భారతీయులు మిలియనీర్స్‌గా, సంఘ ప్రముఖులుగా వెలుగొందుతూనే, మరొకవైపు వాషింగ్టన్, టెక్సాస్, న్యూయార్క్, లండన్, సిడ్నీలాంటి నగరాల్లో సూపర్ బజార్ల ముందు చిల్లర బేరగాళ్లలాగా, క్యాజువల్ లేబర్స్‌గా దర్శనమిస్తుంటారు. వెళ్లినవారి వర్గ పునాది, వారికి లభించిన అవకాశాలనుబట్టి భారతీయులు కూడా అక్కడ సంపన్నులుగా – మధ్యతరగతి, అల్పాదాయ వర్గాలుగా విభజింపబడే వున్నారు. అమెరికాలోని సుమారు 20లక్షల మంది భారతీయుల్లో 50వేల భారతీయ మిలియనీర్స్ వున్నారని ఇటీవలి సర్వే వెల్లడిస్తున్నది. వుద్యోగావకాశాలు సన్నగిల్లినా, కొందరు భారతీయులు తిరుగు ప్రయాణం కట్టినా – మరో 40లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డుల కోసం నిరీక్షిస్తునే వున్నారు.

## భారతీయులపై దాడులు

సెప్టెంబర్ 11న అమెరికాపై జరిగిన దాడుల అనంతరం ఆసియావాసులపై శ్వేత జాతీయుల దాడులు ఎక్కువైపోయాయి. సిక్కులు తలపాగా, గడ్డాలు తీసుకుని జీవించాల్సి వస్తుంది. ఆసియావాసి మొఖం కనపడితే అనుమానంతో కొట్టడం, భయపెట్టడం, చివరకు చంపడం కూడా చేస్తున్నారు. తమ వుద్యోగాలను 'అల్పవేతనాలకే' ఎగరేసుకుపోతున్న భారతీయులపై వారు ద్వేషాన్ని పెంచుకుంటున్నారు. అవమానపరుస్తున్నారు. 'ఇంగ్లండ్‌లో జాతి వివక్షతకు భారతీయ విద్యార్థులు గురవుతున్నారని' పార్లమెంట్‌లో (23/7) భారత ప్రభుత్వమే ఒప్పుకుంటున్నది. అలాగే ఐ.టి. నిపుణులపై 'చట్టపరమైన' దాడులు ప్రారంభమైనాయి. వివిధ దేశాల్లో గత 23నెలల కాలంలో 300మంది ఐ.టి. నిపుణులను వివిధ నేరాల క్రింద అరెస్టు చేయగా, భారత ప్రభుత్వం దౌత్యమార్గాల ద్వారా వారిని విడిపించుకునే ప్రయత్నాలు ప్రారంభించింది.

## తిరుగుముఖం పట్టిన సాఫ్ట్‌వేర్, ఐ.టి. 'విప్లవాలు'

అమెరికాకు సాఫ్ట్‌వేర్, ఐ.టి. నిపుణుల వెల్లువ తగ్గిపోవడంతో దాని ప్రభావం రాష్ట్రంలోనూ, దేశంలోనూ తీవ్రంగా పడుతున్నది. 'డాట్‌కామ్' బుడగ పేలిపోవడంతో ఐ.టి., ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ లాంటి సర్వీసురంగం దెబ్బతినడంతో కొత్తగా రంగంలోకి వచ్చిన టెలికామ్, భీమారంగం, బయోటెక్నాలజీ, వినోద పరిశ్రమపై పెట్టుకున్న ఆశలు కూడా అడియాసలవుతుండటంతో సాఫ్ట్‌వేర్, ఐ.టి. కోర్సుల్లో చేరే విద్యార్థుల పరిస్థితి డోలాయమానంగా మారింది. 'ఈ విద్యా సంవత్సరం (2003-04)లో ఐ.టి ఆధారిత కోర్సులన్నీ కుప్పకూలిపోయాయి. ఏటా 5వేలమంది యం.సి.ఎ, పోస్ట్‌గ్రాడ్యుయేట్స్‌ను తయారు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో గత 5యేళ్లుగా వారికి ఎలాంటి ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో ఆ కోర్సులకు దరఖాస్తులు సైతం తగ్గిపోయాయి. (7/7). ఇదే పరిస్థితి కంప్యూటర్, ఐ.టి. కోర్సులను తలకెత్తుకున్న అన్ని రాష్ట్రాల్లోనూ పడింది. ఈ కోర్సుల్లో చేరేందుకు ఎవరూ ఆసక్తి చూడపం లేదు. ఇంజనీరింగ్ కోర్సుల పరిస్థితి కూడా ఇదేమాదిరిలా సాగుతున్నది. ఇతర రాష్ట్రాలతో పోటీపడి మన రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా వెలసిన 225 ఇంజనీరింగ్ కళాశాలల్లో గత 2, 3 సంవత్సరాలుగా పూర్తిగా సీట్లే నిండడం లేదు. 'ఇంటర్‌లో 50శాతం మార్కులు తెచ్చుకున్నా ఇంజనీరింగ్ సీటు

ఖాయమని' విద్యా సంస్థలు చెబుతున్నప్పటికీ 10వేల సీసట్లు మిగిలి పోవచ్చుననే భావిస్తున్నారు. (22/7)'

## బి.పి.వో.లపై గంపెడంత ఆశలు

అమెరికాకు పూర్వవైభవం తిరిగి రావడానికి ఎంతో కాలం పట్టదనీ, అమెరికానే కాకుండా జర్మనీ, ఇంగ్లాండు, ఫ్రాన్స్ ఇటలీ, నార్వే, స్విట్జర్లాండ్, సింగపూర్, మలేషియా, ఆఫ్రికా దేశాలకు, గల్ఫ్‌కు ఐ.టి. సాఫ్ట్‌వేర్ నిపుణులకు మంచి అవకాశాలున్నాయనీ; దేశంలో మరిన్ని కాల్‌సెంటర్స్ ఏర్పడి బి.పి.వో. వ్యాపారం మరింత జోరు అందుకోబోతున్నదని ఇంజనీరింగ్, కంప్యూటర్ విద్యాసంస్థలు విద్యార్థులను ముగ్గులోకి లాగటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ బి.పి.వో (బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్) వ్యాపారం కూడా అమెరికాలోని బహుళజాతి సంస్థలు తమ ఖర్చును తగ్గించుకోవటానికి, తమ దేశంలో వస్తున్న వత్తిడి నుండి తప్పించుకోవటానికి, తమ కాల్‌సెంటర్స్‌ను అతి తక్కువ మొత్తానికే నిపుణులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లభించే భారత్‌లో ఏర్పరచుకుంటున్నాయి. దీనికి కూడా అమెరికాలోని భారతీయ సాంకేతిక నిపుణులను, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు లంకె కుదుర్చుకుని వారిని భారత్ రప్పించుకుని ఇక్కడ తాము ఏర్పాటు చేస్తున్న సంస్థల్లో పని చేయటానికి ఒప్పందాలు కుదర్చుకుంటున్నాయి. 'రిటర్నింగ్ ఇండియన్స్' అనే పేరుతో ఇండియాలో కూడా ఏజెన్సీలు ఏర్పడి అమెరికన్ భారతీయులను భారత్‌కు రప్పిస్తున్నాయి. ఇక్కడా భాషా, వ్యవహారాల్లో, నిపుణతలో అమెరికన్లలాగా వ్యవహరించగలిగే భారతీయులను రిక్రూట్ చేసుకుని, తగిన తర్ఫీదునిచ్చి, కన్సాలిడేట్ జీతం (వుద్యోగానికి ఏమాత్రం గ్యారెంటీ లేదు) యిస్తూ తమ పనులు అతి చౌకగా నిర్వహించుకుంటున్నారు. ఈ రకంగా కాల్‌సెంటర్స్ వ్యాపారం చేసే అంతర్జాతీయ సంస్థలు ఎన్నో మ దేశంలో అడుగిడుతున్నాయి. అయితే ఇది మూడునాళ్ల ముచ్చటే కాబోతున్నది. భారత్‌కన్నా మరింత చౌకగా లభించే దేశాలకు (ఉదా: చైనా) ఈ కాల్ సెంటర్స్ తరలిపోవడం జరగవచ్చు. అంటే కొద్దిగా లభించే ఈ వుద్యోగాలు కూడా ఏమాత్రం నిలకడలేనివే.

ఇక భారత్‌లో భారీ ఎత్తున లేఆఫ్‌లు చేస్తున్న టెక్నాలజీ కంపెనీలు తమ సిబ్బందికి 'ఉద్వాసన చెప్పడమెలా' అనే అంశంపై ప్రత్యేక శిక్షణా కోర్సులే నిర్వహిస్తుండగా, ఐ.టి.కి మంచి భవిష్యత్తు వుందని పాలకులు పాచిపళ్ల రాగం ఆలపిస్తునే వున్నారు.

## మరణశయ్యపై వున్న సామ్రాజ్యవాదానికి భారత పాలకవర్గాల కాయకల్ప చికిత్స; వుద్యోగాల ఎండమావి

ఇప్పటికే ప్రపంచబ్యాంకు. ఐ.ఎం.ఎఫ్ షరతులకు లోబడి రాష్ట్రంలో, దేశంలో వేల కోట్ల రూపాయలను వెచ్చించి బహుళజాతి సంస్థలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేయడంలో తలమునకలైన భారత పాలకవర్గాలు - ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాల కష్టాలు గట్టెక్కించటానికి, వారికి దేశీయ మార్కెట్‌ను కల్పించటానికి పడరానిపాట్లు పడుతున్నాయి. తాజాగా ఇంటర్‌నెట్, ఇంట్రానెట్ టెక్నాలజిని ఉపయోగించి విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలను అందించటానికి విద్యావాహిని పేరిట వాజ్‌పాయ్ ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. ఒక్కొక్క పాఠశాలలో 10లక్షల రూపాయలతో ఇంటర్‌నెట్ ఎక్సెస్‌ను కలిగిన ఐ.టి. లేబరేటరీలను ఏర్పాటు చేస్తారు. ఈ పథకానికి ఇంటెల్, మైక్రోసాఫ్ట్‌వంటి సంస్థలు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను; సూపర్ ఇన్ఫో సాఫ్ట్‌వంటి సంస్థలు కోర్సు కంటెంట్‌ను సమకూరుస్తున్నాయి. కనీస బోధనా సౌకర్యాలే కొరవడిన భారతదేశంలో ఇంట్రానెట్ టెక్నాలజీని వుపయోగించి బోధించే 'విద్యావాహిని' సామ్రాజ్యవాద సంస్థలకు వందల కోట్ల డాలర్ల లాభాలను పండించటానికి వుపయోగపడుతుందేతప్ప భారతీయ విద్యార్థులకు లభించేది శూన్యం మాత్రమే. ఇప్పటికే రాష్ట్రాల ఇలాంటి పథకాన్ని ప్రారంభించి, వందలకోట్ల రూపాయల విలువైన కంప్యూటర్ సామాగ్రిని జిల్లా కేంద్రాలలో బూజుపట్టిస్తున్నారు.

రాజును మించిన రాజభక్తి కలిగిన చంద్రబాబులాంటి సామ్రాజ్యవాద బంటు 75శాతం ప్రజలు నివసించే గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్‌నెట్ కనెక్టివిటీ లేకుండానే ఇ-గవర్నెన్స్ ఇ-పోక్యూర్‌మెంట్, ఇ-కాస్ట్ పేరిట వందలకోట్ల డాలర్ల మార్కెట్‌ను సామ్రాజ్యవాద సంస్థలకు కల్పిస్తున్నారు. అమెరికాలో కూడా లేని ఈ సంపూర్ణ ఇ-గవర్నెన్స్‌ను, స్మార్ట్ గవర్నమెంట్‌ను అందిస్తామని టిడిపి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ప్రభుత్వ రోజువారీ సాధారణ పరిపాలనను కూడా టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా సాగిస్తూ బిల్‌గేట్స్‌కు సంబంధించిన మైక్రోసాఫ్ట్ సంస్థలకువందలకోట్ల రూపాయల మార్కెట్‌నూ; ప్రజలకు హైటెక్ పరిపాలనా భ్రమలను చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తున్నది. ఇలాంటి హైటెక్ పరిపాలన వలన ఎన్నో ప్రాజెక్టులు వచ్చేస్తున్నాయని, ఐ.టి. వుద్యోగాలకు కొరత వుండదని చంద్రబాబు ప్రభుత్వం; త్వరలో అమెరికాకు మంచిరోజులు రాబోతున్నాయని, దేశంలో మరిన్ని కాల్‌సెంటర్స్ ఏర్పడి బి.పి.వో వ్యాపారం ఊపందుకోబోతుందని ఐ.టి. కోర్సుల విద్యా సంస్థలు చిలకజోస్యాలు చెబుతున్నాయి.

## మన దేశాన్ని మనమే బాగుపరుచుకోవాలి

విదేశీ వుద్యోగాల 'స్వప్నం' నుండి యువత బయటపడి భారత్‌లో గల అవకాశాలను పరిశీలించాలి.

ఆర్థిక సంస్కరణల్లో భాగంగా లక్షలాది వుద్యోగాలను భర్తీ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వున్న వుద్యోగులపై అదనపు భారాన్ని పడవేసి పాలనా వ్యవస్థనే అస్తవ్యస్తం చేస్తున్నాయి. సంవత్సరానికి 1౨% వుద్యోగాలను రద్దు చేయాలన్న ప్రపంచబ్యాంకు ఒప్పందాన్ని తిరస్కరించి - ప్రభుత్వ రంగంలో ఖాళీగావున్న వుద్యోగాలనుభర్తీ చేయవలసిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడి తేవాలి. మన రాష్ట్రంలోనే భర్తీకాని వుద్యోగాలు 2లక్షల 50వేలు వున్నాయి.

విద్యారంగంలో అనేక పోస్టులు ఖాళీ వున్నాయి. విద్యారంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పగించి వేస్తున్నారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకిస్తూ బోధనా, బోధనేతర సిబ్బందిని నియమించవలసిందిగా డిమాండు చేయాలి. అలాగే 1990 నుండి ఒక్క స్కూలునుకాని, కాలేజీగానీ, హాస్టల్‌గానీ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయలేదు. పట్టణాలలోని బస్తీల్లో, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ విద్యాసంస్థలను తగినన్ని ప్రారంభించాలని డిమాండు చేయాలి.

మూతపడుతున్న లక్షలాది చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను ప్రభుత్వం సబ్సిడీ కల్పించి వాటికి జవసత్వాలు సమకూర్చాలి. సామ్రాజ్యవాద సంస్థలకు మార్కెట్‌ను కల్పించకుండా దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించేలా ప్రభుత్వంపై వత్తిడి తేవాలి. ప్రభుత్వరంగ పరిశ్రమలను మూసివేయడాన్ని, ప్రైవేటీకరించటాన్ని నిరోధించాలి.

ఐ.టి., ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కాన్సల్టెన్సీ, భీమారంగాలు లాంటి సర్వీసు రంగంలో సామ్రాజ్యవాద సంస్థలు అడుగుపెట్టకుండా నిరోధించి, దేశీయ సంస్థలకు చోటు కల్పించాలి.

వుద్యోగులను, కార్మికులను అనుకున్నదే తడవుగా భర్తరఫ్, డిస్మిస్, వి.ఆర్.ఎస్ చేసే నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడి - వుద్యోగ హక్కును కాపాడుకోవాలి.

విద్యారంగంలో - సామ్రాజ్యవాద సంస్థలకు ఊడిగం చేసే కోర్సులు కాకుండా, దేశీయాభివృద్ధికి అవసరమైన కోర్సులు విద్యా సంస్థలు చేపట్టేలా డిమాండు చేయాలి.

*(కొరవ 29వ పేజీలో......)*

అమరవీరుల జీవిత చరిత్రలు

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మిలిటరీ కమీషన్ సభ్యుడు కా.సత్యం (రామ్మోహన్)కు అరుణారుణ జోహార్లు !

జనవరి 24న ఏ.పి. ఎస్.ఐ.బి. పోలీసులు చిక్కబళ్లాపూర్‌లో ప్రజలందరు చూస్తుండగానే బస్ దిగుతున్న కా.సత్యం మెడకు అకస్మాత్తుగా ముతాడుతో ఉచ్చు బిగించి 'టాటా సుమోలోకి లాక్కున్నారు. ప్రశ్నించబోయిన ప్రజలకు దొంగను తీసికెళ్తున్నాము, అడ్డురావద్దని బెదిరించారు. ఇదే సందర్భంలో అరెస్టు అయిన మరో కామ్రేడ్ శంకర్ (అనంతపురం జిల్లా కమిటీ సభ్యుడు)ను, సత్యంతో కలిపి తీసికెళ్లి తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపి మృతదేహాలను జనవరి 25న చంద్రబాబు హెరిటేజ్ ఫ్యాక్టరీ ముందు పడేశారు. కా. సత్యం, శంకర్‌లు ప్రజల సమక్షంలోనే అరెస్టు కావటం వలన సమాచారం తెలుసుకున్న కొంత మంది ప్రజాస్వామిక వాదులు, ప్రజలు వారిద్దరిని వెంటనే కోర్టుకు హాజరు పెట్టాలని పత్రికల ద్వారా డిమాండ్ చేసారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ చేస్తారేమో నని ఆందోళన పడ్డారు. వారి ఆందోళన నిజమైంది. ప్రపంచబ్యాంకు ఏజంట్, పరమ నియంత అయిన చంద్రబాబు చేతిలో ప్రజాస్వామ్యం మరోసారి హత్య చేయబడింది.



కా.సత్యం అనంతపురం జిల్లా, తనకల్లు మండలం ఉస్తిలిపల్లి గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించాడు. ప్రాథమిక విద్యను ఇంటివదే పూర్తి చేసుకుని, ఇంటర్ కదిరిలోనూ డిగ్రీ తిరుపతిలోనూ, ఎం.ఎ. అనంతపురం ఎస్.కె. యూనివర్శిటీలోనూ కొనసాగించాడు. ఎం.ఎ చదువుతున్న కాలంలోనే విప్లవ రాజకీయాలతో పరిచయమై రాడికల్ విద్యార్థి సంఘంలో చురుకైన కార్యకర్తగా పని చేసాడు. ఆనాడు కా.సత్యం విద్యార్థి రంగంలో వేసిన బీజాలే, రాష్ట్ర విప్లవ విద్యార్థి ఉద్యమంలో అనంతపురంకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. ఈ క్రమంలోనే 1985లో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా సిద్ధపడి పార్టీ పిలుపు మేరకురైతాంగ ఉద్యమ బాద్యతలు చేపట్టాడానికి గ్రామీణ ప్రాంతానికి వెళ్లాడు. జిల్లాలో ఉరవకొండ, రామగిరి వెంగళమ్మచెరువు తాడిప్రత్తి ప్రాంతాలలో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పని చేస్తూ అనేక సమస్యలపై రైతాంగాన్ని పెద్దఎత్తున కదిలించాడు. ముఖ్యంగా జిల్లాలో కరుడుకట్టిన సాయుధ ముఠా నాయకులుగా వున్న అనేకమందిభూస్వాముల ఎడలు వంచి,వారి కబంధ హస్తాలలో బంధీగా వున్న శివైజమా, చెరువు శిఖం, ప్రభుత్వ బంజరు, దేవునిమాన్యం, పట్టాభూములను ఆక్రమించటంలో ముందుండి ప్రజల్ని చురుగ్గా కదిలించాడు. క్రిందిస్థాయి కార్యకర్తగా ప్రజల్ని విప్లవోద్యమంలోకి సమీకరించటంద్వారా, వారితో ఆయన బంధం మరింతగా పెనవేసుకుపోయింది. అందుకే జిల్లాలో కా.సత్యం పేరు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు.

ఈ క్రమంలోనే కా.సత్యం 1987లో జిల్లాకమిటీలోకి వచ్చాడు. కమిటీలోకి వచ్చినది మొదలు జిల్లా ప్రత్యేక పరిస్థితులను అవగతం చేసుకుంటూ నాయక్వ బాధ్యతలకు న్యాయం చేకూరుస్తూ వచ్చాడు. అయితే 1991 నాటికి కెరియరిజంతో పార్టీలో సంక్షోభం సృష్టించిన కె.ఎస్, బండయ్య ముఠాలకు రాయలసీమ కేంద్రం అయ్యింది. అందులో కూడా అనంతపురం జిల్లా ప్రధాన కేంద్రం అయిందని చెప్పవచ్చు. కె.ఎస్, బ,డయ్య ముఠాకు జిల్లా నాయకత్వంలోని ఆర్.కె, సురేష్‌లు మద్దతుగా నిలచి జిల్లా ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని విప్లవ శ్రేణుల్ని పార్టీవైపు నిలబెట్టటంలో కా.సత్యం ప్రముఖమైన పాత్ర నిర్వహించాడు. 1992 నాటికి ఈ కెరియరిస్టు ముఠాను బహిష్కరించి పార్టీని సంఘటిత పరుచుకోవటంలో కా.సత్యం జిల్లాలో ముందుపీఠిన వున్నాడు. ఈ సంక్షోభం మూలానా కొంత ఎక్కువగా నష్టపోయింది కూడా అనంతపురం జిల్లానే. ఈ పరిస్థితిలో కా.సత్యం జిల్లా కార్యదర్శి బాధ్యతలు చేపట్టి మిగిలిన క్యాడర్‌తో సన్నిహితంగా వుంటూ వారిని విప్లవోద్యమంలో దృఢంగా నిలబెట్టాడు. అయితే పార్టీకి ద్రోహం చేసి బయటకు వెళ్లిన విచ్ఛిన్నకర ముఠా పార్టీపై భౌతిక దాడులకు పూనుకుంది. ముఖ్యంగా జిల్లాలో ప్రముఖ సాయుధ ముఠా నాయకుడైన రవితో చేతులు కలిపిన సురేష్ ఆర్.ఓ.సి. పేరుతో సాయుధ గ్యాంగ్‌ను ఏర్పర్చుకుని పార్టీపైకి దాడులకు దిగాడు. ఈ ముఠా కా. సత్యాన్ని హత్య చేయాలని తీవ్ర ప్రయత్నం చేసింది. కా.సత్యం దళంతో నసనకోట గుట్టల్లో వున్నప్పడు గుట్టలకు నిప్పపెట్టి చంపాలని ప్రయత్నించారు. కా.సత్యం ఈ కుటిల ప్రయత్నాన్ని తిప్పికొట్టి దళాన్ని సురక్షితంగా తప్పించాడు. ఈ సాయుధ గ్యాంగ్ చేస్తున్న దాడుల నుండి దళాన్ని రక్షించడమేకాక, అందులో దూకుడుగా ముందుకు వస్తున్న మంగళి మారన్నను హతమార్చి వాడి వద్ద వున్న ఎ.కె.ను స్వాధీనం చేసుకుని క్యాడర్‌లో ఆత్మవిశ్వాసం నింపాడు. ప్రజల్ని ఉత్సాహపరుస్తూ తిరిగి భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో పాల్గొనేలా చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసాసడు. 1995లో దక్షిణ కోస్తా రాయలసీమ రీజియన్ ఏర్పడటంతో కా.సత్యం రీజినల్ కమిటీ సభ్యుడైనాడు. అదిమొదలు జిల్లాలో పార్టీని మరింత సంఘటిత పరుస్తూ జిల్లాలో పార్టీపై జరుగుతున్న స్టేట్, బండయ్య, సురేష్ ముఠాల ముప్పేట దాడిని దృఢంగా ఎదుర్కొన్నాడు. గతంలో జిల్లా పార్టీలో ఒక ధోరణిగా కొనసాగి, అవశేషంగా మిగిలిన ముఠా ధోరణిని పోగొట్టడానికి దిద్దుబాటు క్యాంపెయిన్ నిర్వహించి పార్టీలో కార్మికవర్గ తత్వాన్ని పెంచడానికి తీవ్రంగా కృషి చేసాడు.

డిసెంబరు 2000లలో జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో కా.సత్యం రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నిక అయినాడు. రాష్ట్ర కమిటీ మొదటి సమావేశంలో రాష్ట్ర మిలిటరీ కమీషన్‌కు కా.సత్యాన్ని కేటాయించడం జరిగింది. రాష్ట్ర కాన్ఫరెన్స్ అనంతరం రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మొదటి టిసిఓసిని విజయవంతం చేయడంలో భాగంగా, చిత్తూరు జిల్లా యలమంద అవుట్‌పోస్ట్‌పై

రెయిడ్‌కు నాయకత్వం వహించాడు. ఈ రెయిడ్‌లో మన పి.జి.ఎ బలగాలు ఎ.కెతో సహా అనేక ఆటో, సెమి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి తర్వాత కా.సత్యం దక్షిణ తెలంగాణాలో ఏర్పడిన సబ్‌కమాండ్‌కు కమాండ్-ఇన్-ఛీఫ్‌గా బాధ్యత చేపట్టాడు. కా.సత్యం రాష్ట్ర మిలిటరీ బాధ్యతలు చేపట్టిన తరువాత, పి.జి.ఎ బలగాలకు మానసిక, శారీరక తర్ఫీదు నివ్వడంలోనూ, శత్రు సాయుధ బలగాలపై దాడులు నిర్వహించడంలోనూ, ప్రత్యక్షంగా నేతృత్వం వహిస్తూ కార్మికవర్గ సేనానిగా ప్రజా గెరిల్లాల హృదయాల్లో చెరగని ముద్ర వేసాడు. ఈ క్రమంలోనే డిసెంబరు 2003 రాష్ట్రకమిటీ సమావేశంలో ఉద్యమ అవసరాల రీత్యా కా.సత్యం రాయలసీమ ఉద్యమ బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించడమైనది. ఈ నిర్ణయం అమలు చేయడంలో భాగంగా బయటకు వెళ్లిన కా.సత్యం శతృచేత చిక్కి అమరుడైనాడు.

సున్నిత మనస్కుడు, నిరాడంబరుడు, గొప్ప కార్మికవర్గ సేనాని అయిన కా.సత్యం పీడిత ప్రజల హృదయాలలో సదా నిలిచే వుంటాడు. ఆయన ఆశయ సాధనకు వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం.

# విరామం ఎరుగని సాహస గెరిల్లా కా.గంగారాంకు పోరువందనాలు!

కా.గంగారాంను కామ్రేడ్స్ సత్యం, శివానందలతో పాటు 2003, జనవరి 24న కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో ఏ.పి. ఎస్ఐబి పోలీసులు ప్రజలందరి ముందే పట్టుకుని తీవ్ర చిత్రహింసలకు గురి చేసి, కాల్చి చంపి, జనవరి 25న బూటకపు ఎదురుకాల్పుల కథనల్లారు.

మహబూబ్‌నగర్ జిల్లా, మండలం వీపనగండ్ల. అదే గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. వయసు 33 సంవత్సరాలు. ప్రాథమిక విద్యను గ్రామంలోనే పూర్తి చేసాడు. 1990 ప్రారంభం నుండే వనపర్తి టౌనులో ఇంటర్ మీడియట్ చదువుతూనే కా.మోహన్‌రెడ్డి పార్టీ పరిచయాలలోకి వచ్చాడు. రాడికల్ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర నిర్వహిస్తూ, టౌనులో అనేక సమస్యలపై విద్యార్థులను సంఘటితపరిచాడు. 1990లో వచ్చిన వెసులుబాటులో గ్రామాలలో విప్లవ రాజకీయాలను ప్రచారం చేస్తూ, జిల్లాలో జరిగిన అనేక సభలకు ప్రజలను కదిలించాడు. ముఖ్యంగా వరంగల్ రైతుకూలీ సభలకు, వేలాది మంది ప్రజలను కదిలించటంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. వనపర్తిలో రిక్షా కార్మిక పోరాటంలో, గంజి అదూల కూలీ పెంపు పోరాటంలో, గుడిసెవాసుల పోరాటంలో తన పాత్ర కీలకమైనది. 1990లో ఎల్.కె.అద్వాని రథయాత్ర సందర్భంగా వనపర్తిలో మతోన్మాదులు మసీదులపై, దర్గాలపై దాడి చేసి కూల్చారు. మత సామరస్యం ప్రచారంలో భాగంగా మతోన్మాదులను ఎండగడుతూ, వారి నాయకుడైన మున్నూరు రవిపై దాడిలో కా.మోహన్‌రెడ్డి ముందు నిలిచాడు. ఇదే క్రమంలో పానగల్ ఏరియాలో సైతం మిలిటెంట్‌గా అనేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు.

1991లో రిక్రూట్ అయి గంగన్నగా, ధర్మన్నగా సర్లసాగర్ దళంలో సభ్యుడుగా చేరాడు. 1992లో తాటిపాముల పోలీసు అవుట్‌పోస్టుపై దాడి చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకోవటంలో తన పాత్ర కీలకంగా పోషించాడు. 1994 మే లో తలకొండపల్లి పోలీసు స్టేషన్‌పై దాడిలో ఆయుధాల సీజింగ్‌లో చొరవగా ముందుపీఠిన నిలిచాడు. 1992లో నెల్విడ్ గ్రామంలో దళం షెల్టర్‌లో వుండగా, సమాచారంతో పోలీసులు చుట్టుముట్టి దాడి ప్రారంభిస్తే చాకచక్యంగా, చొరవగా సమయస్ఫూర్తి ప్రదర్శించి కమాండర్‌తోపాటు సురక్షితంగా బయటపడ్డాడు. 1992 చివర అచ్చంపేట (అప్పర్‌ప్లాట్) ఏరియాలో శాక్ మెంబర్‌గా కూలి జీతాల పోరాటాలలో తునికాకు కూలి పెంపు పోరాటాలతో పాటు అనేక పోరాటాలకు కా.ధర్మన్న నాయకత్వం వహించాడు. తను ఒకసారి కల్సిన ప్రజలు ఎన్నటికి మర్చిపోని ముద్ర వేయకలిగే కలుపుగోలుతనం కా.ధర్మన్నది.

అనేకసార్లు కిరాయి సాయుధ మూకలతో జరిగిన ఎదురుదాడిలో సహచర కామ్రేడ్స్ అమరులైనా గుండె నిబ్బరంతో వారి త్యాగాల వారసత్వాన్ని పునికి పుచ్చుకుని 94లో సీమ విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలు దాటుతూ అనంతపురం జిల్లాకు వెళ్లాడు. అప్పటికే జిల్లాలో పార్టీని చీల్చి స్వంత కుంపటి పెట్టుకున్న బండయ్య, సురేష్ ముఠాల అరాచకాలతో అతలాకుతలం అవుతున్న సందర్భంలో వచ్చి అక్కడి పరిస్థితిని అర్థం చేసుకుని అవకాశవాదులకు రాజకీయ పోరాటంతోనేకాక భౌతిక దాడుల్లో పాల్గొని ఆర్‌ఓసిని తోక ముడిపించి, సురేష్‌ను, గ్రామాల్లో వారి అరాచక ముఠాలకు ముక్కుతాడు వేసి ఇంటిదారి పట్టించాడు. ఉరవకొండ, రామగిరి, తిమ్మమ్మ మర్రిమాను దళాల కమాండర్‌గా బాధ్యతలు తీసుకుని ప్రజల హృదయంలో చెరగని ముద్రవేసాడు. జిల్లాలో కరువు శాశ్వత కాపురం పెట్టడానికి భూస్వాముల దోపిడీ, ప్రభుత్వ విధానాలే కారణమని, దేవుని మాన్యం, భూస్వాముల పట్టాభూముల ఆక్రమణకు, కొత్త ప్రాంతమైనా ప్రజలను రాజకీయంగా అర్థం చేయించి ప్రభుత్వ వ్యతిరేక క్యాంపెయిన్‌లు, రాస్తారోకోలు యం.ఆర్.ఓ ఆఫీసుల ముందు ధర్నాలు నిర్వహించి పార్టీని ప్రజల్లో మమేకం చేసి పోరాటాలు నిర్వహించేవాడు. అంతేగాక తాత్కాలిక సహాయం కోసం భూస్వాముల వ్యాపారుల నుండి వేరు శెనగ కాయలు, ఎరువులు వసూలు చేసి సహకార సంఘాలను ఏర్పాటు చేసి పంపిణీ చేయించాడు. అలాగే గ్రామ ఉమ్మడి ఈతచెట్ల డబ్బు పెత్తందార్ల, ముఠా నాయకుల, భూస్వాముల కబంద హస్తాల నుండి విడిపించి గ్రామ ప్రజలకు చెందేటట్లు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయించాడు. మిలిటరీ వ్యూహకర్తగా అనేక దాడులకు నాయకత్వం వహించడమేగాక యలమంద రెయిడ్‌లో అసాల్ట్ గ్రూపులో శతృవును కవర్ ఫైరింగ్‌లో తరిమి కొట్టాడు. సామ్రాజ్యవాద విధానాలను అనుసరిస్తూ ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్న అధికార చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలను పరిపాలించే అర్హతలేదని అధికారాన్ని వదులుకోమని ప్రజల భాగస్వామ్యంతో వందలాది మందితో రాజీనామాలు చేయించి పార్టీ రాజకీయాలను జిల్లా అంతటా ప్రభావితం చేసాడు. 1997లో ముక్తాపురం నాగరాజు కుళ్లిన రాజకీయాలతో పార్టీని భ్రష్టుపట్టిస్తూంటే దానికి వ్యతిరేకంగా పోరాడి జిల్లా నాయకుడిగా వుండే అర్హతలేదని డిమోట్ చేయించడంలో ముందున్నాడు. 97లో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడి 2003లో అనంతపురం జిల్లాకమిటీ కార్యదర్శిగా ఎదిగి విప్లవోద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించాడు. గెరిల్లా యుద్ధంతో శతృవును గడగడ లాడించడంలో, కష్టపడటంలో, సూటిదనంలో క్యాడర్‌కు, నాయకత్వానికి నిరంతరం ఆదర్శవంతంగా కా.ధర్మన్న ఎల్లప్పుడు నిలిచేవాడు. క్యాడర్, ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకుడు. 15 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్న విరామం ఎరుగని సాహస గెరిల్లా కా.గంగారాం.

# ఆదర్శ గెరిల్లా కా.శంకర్ (శివానంద)కు విప్లవ జోహార్లు !

కా.శంకర్‌ను 2003, జనవరి 24న సత్యం, గంగారాంలతో పాటు పట్టుకుని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపి, జనవరి 25న 'ఎన్‌కౌంటర్' కట్టుకథ నల్లారు.

కనగానిపల్లి మండలం, కోనేటినాయుని పాళ్యం గ్రామంలో తల్లిదండ్రులకు నలుగురు కొడుకుల్లో చివరివాడు. తండ్రి చనిపోయినా తల్లి సుబ్బమ్మ పెంపకంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, డిగ్రీ అనంతపురంలో చేరి రాడికల్ విద్యార్థి సంఘానికి పరిచయమై అనేక విద్యార్థి పోరాటాల్లో భాగమై నాయకత్వం వహించాడు. తల్లి ఇంటి పట్టునే వుండమని ఎంత ఒత్తిడి చేసినా ప్రజల వైపే నిలబడ్డారు. ''ఇంటికి రాకపోతే చనిపోతానని చెప్పినప్పుడు వందలాది తల్లుల కన్నీళ్లు తుడవడానికి పోయాను నేను. వారందరూ నా తల్లులే'' అని నిక్కచ్చిగా చెప్పి ప్రజల పక్షం వహించాడు. '96లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసాడు. జిల్లా విద్యార్థి ఉద్యమ నాయకుడు కా.ప్రవీణ్ శత్రు చేతచిక్కి అమరుడైనా, ఆ లోటు విద్యార్థి ఉద్యమానికి రాకుండా బాధ్యతలు తీసుకుని పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌లో వార్డన్‌లు పందికొక్కుల్లా కాజేస్తుంటే విద్యార్థులను కదిలించి దారికిరాని వార్డన్‌లపై దాడులు చేసి బుద్ధి చెప్పి విద్యార్థులకు అండగా నిలబడ్డాడు. ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ ఎత్తివేసి పేద విద్యార్థులను విద్య నుండీ దూరం చేయాలనే కుట్రలను బహిర్గతం చేసి అనేక మంది విద్యార్థులను కదిలించి పోరాటాలు నిర్వహించి విజయం సాధించాడు. చదువుకున్న చదువులు తిండిపెట్టక నిరద్యోగాలుగా మిగిలి వున్న, వున్న వుద్యోగాలను ఊడబెరుకుతుంటే నిరుద్యోగులకు అండగా డియస్‌సిని వెంటనే అమలు చేయాలని పోరాటం చేయించాడు. అనంతపురం టౌన్‌లో లక్ష్మీనగర్‌లో మల్లెల మల్లిగాడు అనే రౌడీ మహిళలను వేధించడం, దొంగతనాలు చేయడం, వీధిలోని కుటుంబాలను ఇబ్బందులు పెట్టి అరాచకాలు సృష్టిస్తుంటే వాన్ని నిర్మూలించి ప్రజలకు వాడి పీడను విరగడ చేసాడు. ప్రపంచ బంధిపోటు క్లింటన్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినపుడు ''గోబ్యాక్ క్లింటన్'' ఉద్యమాన్ని చేపట్టాడు. విద్యార్థుల చదువులు బావిలో కప్పలా కాకూడదని ప్రజలకు సామాజికంగా వున్న సమస్యల పట్ల చైతన్యవంతులను చేయడానికి విద్యార్థుల సామాజిక బాధ్యతను పెంచడానికి ఎన్నికల బహిష్కరణ, కరువులపై క్యాంపెయిన్ చేయించాడు. జిల్లా రాడికల్‌విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా 2000లో రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించి, చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తుంటే దానికితగ్గ పని పద్ధతులను రూపొందించుకుని చాపక్రింద నీరులాగా ఉద్యమాన్ని పెంపొందించాడు. 2003లో జిల్లా ప్లీనంలో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడి పట్టణంలో శత్రు శిబిరంలో వుండి శత్రువు కన్నుగప్పి ఉద్యమాన్ని బలోపేతం చేసిన వేగుచుక్క, ఆదర్శ గెరిల్లా కా.శంకర్.

# కార్మిక వర్గతత్వాన్ని ప్రసరించిన హైదరాబాద్ నగర కార్మికోద్యమ కిరణం కా.వినోభా (శ్రీధర్)

2003, ఏప్రిల్, ... హైదరాబాదులోని అబ్దుల్లాపూర్ వద్ద ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు సిటీ కార్యదర్శి కా.మహేందర్‌తోపాటు కా.శ్రీధర్‌ను కూడా పట్టుకుని కాల్చి ంపారు. శత్రువు పెట్టిన చిత్రహింసలను చిరునవ్వుతో భరించి ప్రాణాలర్పించి చిరంజీవి అయ్యాడు కా.శ్రీధర్.

కా.శ్రీధర్ మహబూబ్‌నగర్ జిల్లా, అయినాపూర్ దగ్గరలోని రామాపురంలో ఒక నిరుపేద మంగళి కుటుంబంలో జన్మించాడు. శ్రీధర్‌కు గద్వాలలో కవర్ సంఘాల ద్వారా రాజకీయాలు పరిచయమైనాయి. ఆ తరువాత హైదరాబాద్‌లో కార్మికుడిగా జీవితం ప్రారంభించాడు. 1990లో కార్మికరంగం నుండి రిక్రూట్ అయిన వారిలో శ్రీధర్ ఒకడు. అట్లా అనేక సంవత్సరాలపాటు కార్మికోద్యమంలోనే పని చేస్తూ, కార్మికవర్గ తత్వాన్ని పునికిపుచ్చుకున్న అరుదైన కామ్రేడ్ శ్రీధర్. 1994 దాకా ప్రైవేటు పరిశ్రమలలోనూ, ఆ తరువాత ఆర్‌టిసిలో రైల్వే కార్మికులలో పని చేస్తూ కార్మికుల ఐక్యతకై కృషి చేసాడు. యువజన రంగంలోనూ పని చేసాడు. 1990లో నెలకొకరి చొప్పన సి.ఓ.లను కోల్పోతున్న సమయంలోగానీ, 1997లో నగర నాయకత్వం అత్యంత ఆప్తులు అమరులైన సమయంలోగానీ, ఎంతటి నిర్బంధంలోనూ శత్రువుకు భయపడక, ఎలాంటి డీవియేషన్స్‌కూ గురికాక ఉద్యమంలో కొనసాగిన ధీశాలి శ్రీధర్. ప్రజలు, పార్టీ పట్ల అంకితభావంతో, నిర్బంధంలో పని చేయడం ఎలా అనే ఆలోచనతో కార్మికులను అంటిపెట్టుకున్న ఆదర్శశీలి కా.శ్రీధర్. నీటిలో చేపలా వున్నాడు గనకే అనేకసార్లు వెంట్రుకవాసిలో శత్రువు నుండి తప్పించుకున్నాడు. చాలాసార్లు శత్రువు అతని పేరును ప్రకటించడం, ఇన్ఫార్మర్ ద్వారా పట్టుకోడానికి ప్రయత్నించడం జరిగినా కా.శ్రీధర్ నగరోద్యమ అభివృద్ధికై తపన పడేవాడుతప్ప తన గురించి ఆలోచించలేదు. ఎన్నడూ వ్యక్తిగత క్రమశిక్షణ, వేలెత్తిచూపలేని వ్యక్తిత్వం ఆయనది. పట్టణరంగంలో వున్నా, అవసరాలరీత్యా ఇతర రంగంలో వున్నా.... అందరిరతో కలిసిపోవడం, సమిష్టి పనులు పంచుకోవడం, అందిరతో పోటీపడటంలో ముందుండేవాడు. చివరి రెండు సంవత్సరాలలో తనలోని రాజకీయ వెనకబాటుతనాన్ని పోగొట్టు కోడానికి తీవ్రంగా కృషి చేసాడు. పట్టణోద్యమంలో మిలిటరీ ప్రాధాన్యతను ఆలస్యంగానే గుర్తించినప్పటికీ, అతి తక్కువ కాలంలోనే పట్టుదలగా కృషిచేసి శారీరక దారుఢ్యాన్ని పెంచుకున్నాడు. నిర్ణయాత్మకంగా వుండటంలోనూ, బాగా విషయాలను చర్చించడంలో అభివృద్ధి సాధిస్తూ ఏసిఎస్‌గా ఎదిగి వచ్చిన తరుణంలోనే అమరుడు కావడం బాధాకరం. నగరోద్యమానికి అనుభవంగల కామ్రేడ్స్ అవసరం ఎంతో వున్న నేటి స్థితిలో 14ఏండ్ల దీర్ఘానుభవం కల్గిన కార్మిక నాయకున్ని కోల్పోవడం నగరోద్యమానికీ, కార్మికోద్యమానికీ తీరని నష్టం. ఆ కామ్రేడ్‌లోని కార్మికవర్గ తత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉద్యమాభివృద్ధికి మరింతగా కృషి చేయడం ద్వారా ఆ లోటును పూరిద్దాం.

## యాక్షన్ టీం సభ్యుడు కామ్రేడ్ సురేశ్ అమర్ హై!

2003 అక్టోబరు 1న నరహంతకుడు చంద్రబాబును మన గెరిల్లాలు మట్టి కరిపించ ప్రయత్నించిన రోజున, పోలీసులు కా.సురేశ్‌ను తీవ్ర చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. యాక్షన్‌టీము సభ్యుడైన కా.సురేశ్‌ను ద్రోహి ఇచ్చిన సమాచారంతో మహబూబ్‌నగర్ ప్రక్కన భూల్‌పూర్‌లో సెప్టెంబరు 28న అరెస్టు చేసారు. కా. సురేశ్ వద్ద నున్న 9ఎంఎం పిస్టల్ మరియు తపంచ శతృ చేజిక్కించింది.

కా.సురేశ్ (పులి మల్లేష్)ది పెద్దఎత్తున భూపోరాటాలు జరిగిన కుందారం ప్రక్కనున్న కలకొండ గ్రామం, వెల్దండ మండలం. 23 సంవత్సరాల వయస్సున్న కా.సురేశ్ మధ్యతరగతి తెనుగు కుటుంబంలో జన్మించాడు. ఇంటర్ మీడియట్ వరకు చదివాడు. ప్రజాస్వామిక తెలంగాణా కోసం జరుగుతున్న ఉద్యమంతో ప్రభావితుడయి టిఎస్ఎఫ్ (తెలంగాణా విద్యార్థి సంఘం)లో చేరాడు. క్రమంగా విప్లవ రాజకీయాలను అర్థం చేసుకుని ఆర్ఎస్‌యులో చేరి కల్వకుర్తి ఏరియాలో విద్యార్థులను కదిలించడంలో చురుకైన పాత్ర పోషించాడు. తీవ్రమైన పోలీసు నిర్బంధం అమలవుతున్నా వెరవకుండా పార్టీ నిర్ణయం మేరకు 2000 మధ్యలో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. కల్వకుర్తి, అచ్చంపేటలలో దళ సభ్యుడుగా, టీచర్‌గా తనవంతు బాధ్యతలు క్రమశిక్షణతో నిర్వహించాడు. ఫ్రంట్‌గార్డ్ లీడర్‌గా పరిసరాలపై పట్టు సంపాదించడమేకాక ప్రజలతో విస్తృత సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. 2003 ప్రారంభంలో జరిగిన కరువు దాడులలో చురుకుగా పాల్గొనడమేకాక ఆ వెనువెంటనే జరిగిన పోలీసు గాలింపు చర్యలలో జరిగిన ఎన్‌కౌంటర్లలో దళం అంతా శతృవును నిలువరించి రిట్రీట్ కావడంలో ముందుపీఠిన నిలిచాడు. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా జరిగిన ధ్వంస కార్యక్రమాలకు కమాండర్‌గా టీమును సరిగా సమన్వయం చేసాడు. పోలీసు ఏజెంట్ దేవరకొండ శ్రీను అమ్రాబాద్ పోలీసుస్టేషన్ ముందు కన్పించగానే చొరవతో ఫైర్ చేసాడు - టీంలో రెండవ కామ్రేడ్ అందుబాటులోలేక పోయినా. వాడు గాయపడి తప్పకున్నాడు.

అతి చిన్న వయస్సులో పార్టీలోకి రిక్రూట్ అయిన తన స్వంత చెల్లెలు నిర్మల వచ్చిన కొద్ది నెలలకే అనారోగ్యంతో అమరురాలయింది. దోపిడీ వ్యవస్థను కూల్చివేయ జరుగుతున్న వర్గ యుద్ధంలో ఒక కామ్రేడ్ అమరులయిందనే భావించాడు. రక్తసంబంధంలో కూడా వర్గ సంబంధాన్నే చూసాడు. కమాండర్ ఎతం కృష్ణయ్య పార్టీపై దుష్ప్రచారం చేస్తూ సరెండర్ అయినప్పుడు, అతని తప్పడు అభిప్రాయాలను అర్థం చేసుకోలేక ఒకరిద్దరు సభ్యులు ఇంటికి వెళ్లారు. అతనితో సన్నిహితంగా వున్నప్పటికీ రాజకీయంగా అతని బలహీనతను, తప్పొప్పలను అర్థం చేసుకుని ఉద్యమంలోనే దృఢంగా నిలబడినాడు.

సరైన పద్ధతులు పాటిస్తూ శతృవుపై దాడిలో ముందుపీఠిన నిలుస్తున్న కా.సురేశ్‌ను ఏసిఎంగా ప్రమోట్ చేసి యాక్షన్ టీంలోకి తీసుకోవడం జరిగింది. నిరంతర కృషి, పట్టుదలతో రాజకీయంగా అభివృద్ధి అవుతున్న కా.సురేశ్ నాయకత్వ అవసరాలు తీర్చగలడనుకుంటున్న తరుణంలో అమరుడు కావడం వల్ల జిల్లా వుద్యమానికి తీరని నష్టం వాటిల్లింది. నాయకత్వంను సరైన పద్ధతిలో సూటిగా విమర్శించడంలోనూ, మిలిటరీ నైపుణ్యంలోను కా.సురేశ్‌ను ఆదర్శంగా తీసుకుంటూ వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం! శతృవును అంతిమంగా ఓడించే వరకు విప్లవ జాగరుకతను, చొరవను ప్రదర్శిద్దాం !

## కా.సాగర్ (నర్సింహా) అమర్ హై!

మహబూబ్ నగర్ జిల్లా, మాడ్గుల మండలం, నల్లచెరువు గ్రామంలో దళిత పేద కుటుంబంలో కామ్రేడ్ సాగర్ జన్మించాడు. వయసు 18 సం.లు వుంటుంది. నిరుపేదలైనందున తన కుటుంబమంతా కూలి, జీతాలపై ఆధారపడే జీవించారు. తను ఇద్దరి అన్నలతో పెరిగి పెద్దవాడైన తర్వాత కూడా జీతముండే కుటుంబ పోషణకు తోడ్పడేవాడు. నల్లచెరువు గ్రామం ఉద్యమ ప్రాంతానికి ఆనుకుని ఉన్నందున ఈ ప్రాంతంలో జరిగే పోరాటాల ప్రభావంలో కామ్రేడ్ నర్సింహ్మ పెరిగాడు. ఉద్యమ సంబంధాల్లో లేకపోయినా గ్రామంలో భూస్వాముల నెదిరించటం నేర్చుకున్నాడు. భూస్వాముల గ్రామపెత్తనంపై పంచాయితీలలో తాను కూడా మాట్లాడి ప్రజల పక్షం వహిస్తుండేవాడు. గ్రామంలో పీడిత వర్గాల ప్రజలలో కలుపుగోలుగా వుంటూ అందరిలో నర్సింహ్మ గుర్తింపు పొందినవాడు. 2002 సంవత్సరంలో పార్టీ సంబంధాలలోకి మొదటగా వచ్చిన కామ్రేడ్ నర్సింహ్మ ఎన్నో పరిచయాలు పార్టీకి చేసాడు. తాను ఒక్కడుగానే కాకుండా మరికొంతమంది చురుకైన యువకులను కూడగట్టాడు. వారికి సంఘ చైతన్యం కల్గించి సంఘం పెట్టాడు. సంఘానికి నాయకుడైనాడు. గ్రామంలో భూస్వాములకెదురు సంఘాన్ని నడిపించడంలో చురుకైన పాత్ర పోషించాడు. తనతోపాటు తన సంఘాన్నంత కూడా పూర్తికాలం కార్యకర్తలుగా రావడానికి సంసిద్ధులను చేసాడు. చివరకు పార్టీ పిలుపు రాగానే తనతోపాటు సంఘం కార్యవర్గం ముగ్గురిని తీసుకుని విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా చేరిపోయాడు. తన చెల్లెకు తన నాయకత్వంలోనే పెళ్లై చెల్లె అత్తవారింటికి తొలిరమ్మని కోరుతుండగా అదేరోజు పార్టీలోకి రావాలని పార్టీ పిలుపొచ్చింది. చెల్లెలా? పార్టా? తేల్చుకోవడంలో ఏ మాత్రం సంశయం లేకుండా పార్టీలోకి వచ్చాడు.

విప్లవోద్యమంలోకి అడుగుపెట్టిన తర్వాత తన శక్తియుక్తుల్ని దృష్టిలో వుంచుకుని తన ప్రత్యేకతలను దృష్టిలో వుంచుకుని జననాట్యమండలి దళంలో సభ్యునిగా నియమించటం జరిగింది. ఆ తీర్మానాన్ని సంతోషంగా స్వీకరించి ఎక్కడైనా పార్టీ ఒక్కటే కదా! అనే చైతన్యంతో అర్థం చేసుకున్నాడు. ఆ దళంలో చేరిన అతి తక్కువ సమయంలోనే మల్వార్ ఆదివాసి పెంటవద్దకు పార్టీ అపాయింట్‌మెంట్ వుండి వెళ్లగా గ్రేహౌండ్ కుక్కలు పట్టుకుని 3-9-03న రాత్రి తీవ్రంగా హింసించి కాల్చి చంపారు.

గ్రామంలో నుండి భూస్వాముల ప్రత్యక్ష పీడనను అనుభవించి ఉద్యమంలోకి వచ్చినసాగర్ పార్టీ రాజకీయాలను అర్థం చేసుకోవడంలో పట్టుదల ప్రదర్శించేవాడు. శతృ వర్గాలపట్ల వర్గ కసి రగిలించుకుని ప్రజాగెరిల్లా సైనిక జీవితంలో తాను ఒకడై నిలదొక్కుకున్నాడు. తనతోటి వారికి కూడా అంత నమ్మకాన్ని కల్గించి ప్రోత్సహించే నాయకత్వ లక్షణాలు కల్గిన కామ్రేడ్. మనసులో ఏ కల్మషం లేకుండా అందరితో కలుపుగోలుగా వుండేవాడు. ప్రజల కోసం నిరంతరం ఏదో చేయాలన్న తపన, చొరవ చురుకుదనం కలగలిసి ఉన్నవాడు కామ్రేడ్ సాగర్.

సాగర్ అమరత్వం జననాట్యమండలి దళానికి, పార్టీ రాజకీయాలను కళారూపంలోర ప్రజల వద్దకు తీసుకుపోవడంలో ఏర్పడిన పెద్ద లోటు. అమరుడులేని లోటు పూడ్చడానికి మనమంతా కృతకృత్యులమవుతు అతని ఆశయాలను ముందుకు తీసుకుపోదాం. పునాది వర్గాల నుండి వచ్చిన కా.సాగర్ వంటి వారిని విప్లవోద్యమంలో భాగం చేద్దాం.

## కా.జీవన్ ఎర్రాఎర్రా వందనాలు

ప్రకాశం జిల్లా, చింతలముడిపిలో జూన్, 2003లో జరిగిన ఎన్‌కౌంటర్ అమరుడైనా మిలిటెంట్ కా.జీవన్ అసలు పేరు ప్రసాదు. వూరు దోర్నాల మండలంలోని చిలకచెర్ల గ్రామం. నిరుపేద తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. పద్దెనిమిదేండ్ల వయస్సే అయినా తల్లిదండ్రుల బాధ్యత చూసేవారు లేరని పార్టీలోకి పూర్తికాలం రమ్మంటే ఆలోచించి చెపుతానన్నాడు. ఇంతలోనే అమరుడైనాడు. ఒకసారి పార్టీలోకి వస్తే వెనుదిరిగి చూడరాదనే ఆదర్శం అతనిది. క్యాంపుకు పనిమీద వచ్చి శతృవుతో హోరాహోరి పోరాడుతూ ప్రాణాలర్పించి ఆ ఆదర్శాన్ని నిలబెట్టాడు.

అయితే పూర్తికాలం రాకున్నా 2001 నుండి దాదాపుగా ఫుల్‌టైమర్‌గా పని చేస్తున్నాడు. పార్టీ పిలిచినప్పుడల్లా క్యాంపులకు వచ్చేవాడు. కోరినంత కాలం వుండేవాడు. అప్పచెప్పిన ప్రతి పనీ అంకితభావంతో చేసేవాడు. వినయమూ, నిజాయితీ, వర్గకసి గల నిండైన వ్యక్తిత్వం మనందరికీ ఆదర్శనీయం.

## కా.శీను అమర్ హై !

ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం, గుమ్మలపల్లె కా.శ్రీనుకు పురుడుపోసి పెంచింది. వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టిన కా.శ్రీను సంతానంలో చిన్నవాడు. చిన్నప్పటి నుండే విప్లవ రాజకీయాలకు ప్రభావితుడై పొద్దంతా పని చేసినా పూటకు గంజినీళ్లులేని ప్రజలకు కాంట్రాక్టర్స్ మోసాలు విప్పి, చెప్ప క్యాంపెయిన్స్ చేస్తూ టీమ్ లీడర్‌గా వుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు.

రైతుకూలీ సంఘ నాయకునిగా ఎదిగిన కా.శ్రీను వెదురుబొంగు, తునికాకు రేట్లు పెంచ గ్రామగ్రామం తిరిగి పోరాట కమిటీలు నిర్మించి కూలీలను ఐక్యపరిచాడు. ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్న ప్రభుత్వం నల్లమల అడవిని వైల్డ్‌లైఫ్ పేరుతో ఆదివాసీలను అడవి నుండి ఖాళీ చేయిస్తుండడంతో ప్రజలకు ప్రత్యామ్నాయం చూపమంటు ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రజలనుకదిలించడంలో చాలా చొరవగా ముందున్నాడు. ప్రతిరోజూ తాగుతూ మహిళలను వేధించే వాళ్లను హెచ్చరిస్తూ మహిళల ఐక్యతతో సారాను బందు పెట్టించడంలో చాలా కృషి చేసాడు.

ప్రజలతో మమేకమైన కా.శ్రీను 1999లో పూర్తికాలం కార్యకర్తగా రావడానికి సిద్ధపడినాడు. నల్లమల, పాలవంక, గుండ్లకమ్మ దళాలలో తన విప్లవ జీవితాన్ని కొనసాగించాడు. పార్టీలోకి వచ్చిన కొద్దికాలానికే, తాను ఇష్టపడ్డ మహిళ రాకపోవడంతో ఇంటికివెళ్లిన శ్రీను కొద్దిరోజులకే మనకోసం మనం బ్రతకడం గొప్పకాదు, నలుగురి కోసం జీవించడం వున్నతమైనదిగా భావించి, తిరిగి 2001 లో దళంలోకి వచ్చాడు. అప్పటికి ఒక కొడుకు.

ఆ తర్వాత ఎన్నడూ ఊగిసలాడలేదు. గిద్దలూరు మండలంలో రౌడీషీటర్‌గా చెలామణి అవుతూ, బడిపిల్లల ముందే అతి దారుణంగా వాళ్ల సార్‌ను నరికి చంపిన దొడ్డం పల్లె రామచంద్రారెడ్డిని ఖతం చేయడంలో కీలకపాత్ర పోషించాడు. గంటల తరబడి నడిచి వచ్చినా, విసుగు అనేది లేకుండా సెంట్రీ చేసేవాడు. ఉత్సాహంగా వుండేవాడు. తప్పలను కూడా అంతే సూటిగా విమర్శించేవాడు. దళంలో చర్చలు పెట్టి దళాన్ని ఉత్సాహపరచడంలో కా.శ్రీనుకు ప్రత్యేకత వుంది. తనకు ముఖపరిచయం లేకున్నా చాల చొరవతో ప్రజల్లోకి వెళ్లి పనులు చెయ్యడంలో గొప్ప నిపుణుడు. కా.శ్రీను అంతే చొరవతో యుద్ధంలో శతృవును నిలువరిస్తూ అమరుల వరుసలో చేరాడు. కా.శ్రీను అమరత్వాన్ని ఎత్తిపడ్తు మిలిటరీ నైపుణ్యతను పెంచుకుని శతృవును ఓడిద్దాం.

## కా.మైసయ్య (కృష్ణ)కు విప్లవ జోహార్లు !

కామ్రేడ్ మైసయ్య (ఆదివాసీ). మహబూబ్‌నగర్ జిల్లా నల్లమలలోని బట్టిచింతలపెంట వాస్తవ్యుడు. చిన్నతనములోనే తల్లిదండ్రీ అనారోగ్యంతో చనిపోయారు. చిన్ననాటి నుండి ఇతరుల వద్దనే పెరిగి పెద్దవాడై బ్యాలం నుండి పార్టీతో సంబంధాలు కొనసాగిస్తూ వచ్చాడు. కాలక్రమంలో ఎదిగిన మైసయ్య 14వ ఏటనే నల్లమలలోని పెంటలను కలిపి ఏర్పర్చిన ఏరియ రక్షక దళం సభ్యునిగా నియమితుడైనాడు. పార్టీ అప్పగించిన అనేక ప్రచార కార్యక్రమాలలో భాగం అయ్యాడు. పెంటలపైకి వచ్చే శతృవు మూకల సమాచారాన్ని దళానికి చేరవేయటం చేస్తుండేవాడు. సాధారణంగా ఆదివాసీలకున్న సంకుచిత మనస్థత్వం నుండి బయటపడి అన్ని పెంటలలో ఒకే విధంగా కార్యక్రమాల అమలుకు సిద్ధపడేవాడు. నల్లమల దళ ఏరియాలో మొట్ట మొదటగా ప్రజాగెరిల్లా సైనికుడిగా రిక్రూట్‌కు సిద్ధమైనవాడు కామ్రేడ్ మైసయ్య. పూర్తికాలం రావాలన్న ఆలోచనలో భాగంగానే దళాలకు రూట్‌గైడ్‌గా వస్తున్న క్రమంలో మల్లాపూర్ వద్ద సెప్టెంబర్ 3 రాత్రి 10 గంటలకు జరిగిన గ్రేహౌండ్స్ మూకల దాడిలో మైసయ్య అమరుడైనాడు. ఏరియా రక్షక దళంలో తాను చేసిన కృషి, పూర్తికాలం దళంలోకి రావాలన్న సంసిద్ధత కలిగిన మైసయ్య అమరుడు కావడం ఆదివాసీ ప్రజల ఉద్యమానికి ఆ మేరకు నష్టం జరిగినప్పటికీ ఆదివాసీల త్యాగపూరితమైన పోరాటానికి మైసయ్య ధారబోసిన రక్తం ఎంతో ఊతమిస్తుంది. చెంచు ఆదివాసీ విముక్తి వుద్యమంలో మైసయ్య కొనసాగించిన త్యాగపూరితమైన పోరాటం కొనసాగుతూనే వుంటుంది.

## శాంతం, సహనం ఆభరణాలుగా గల కా.శాంతి అమర్ హై!

కా.శాంత జూన్, 2003న ప్రకాశం జిల్లా, చింతలముడిపి అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శతృవుతో హోరాహోరి పోరాడుతూ అమరురాలైంది.

పేరును సార్థకం చేసుకున్నట్లు శాంతం, సహనం ఆభరణాలుగా కలిగిన శాంతి అసలు పేరు మాలతి. హైదరాబాదులోని కాటేదాన్ దగ్గర ఉడన్‌గడ్డలో పుట్టి పెరిగిన కా.మాలతి ఇంట్లో పెద్దకూతురు. పేద కుటుంబంలో పుట్టిన మాలతి చిన్నప్పటి నుండే కష్ట,సుఖాలలో తల్లిదండ్రులకు చేదోడువాడదోడుగా వుంటు కుటుంబ పోషణ కోసం ప్లాస్టిక్ పరిశ్రమలో కార్మికురాలిగా పని చేసేది.

వాళ్ల ఇంటి పక్కనే కార్మికరంగ ఆర్గనైజర్ కా.నరేష్ అద్దెకు వుండేవాడు. అతనితో పార్టీ రాజకీయాలు పరిచయం కావడంతో 1992లో పూర్తికాలం కార్యకర్తగా రావడానికి సిద్ధలైంది. వచ్చిన కొద్దిరోజులకు కా.నరేష్‌తో పెళ్లి జరిగింది. పెళ్లి జరిగిన రెండు నెలలకే కా.నరేష్ అమరుడయ్యాడు. వచ్చిరాగానే జరిగిన సంఘటనను కా.శాంతి చాలా నిబ్బరంగా ఎదుర్కొంది.

పార్టీ కోరిక మేరకు 1992 చివరలో ఎన్‌ఎఫ్‌డిలో అడుగుపెట్టిన కా.శాంతి టిపిడి దళంలో దళసభ్యురాలుగా దళ జీవితం మొదలు పెట్టింది. కా.శాంతి 10 సంవత్సరాల విప్లవ

జీవితాన్ని, ప్రజలకు అంకితం చేస్తూ ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు వెతికింది. తరతరాల నుండి వెట్టిచాకిరీ చేస్తూ బ్రతుకులీడుస్తున్న చాకలివారిని కూడగట్టి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించి వెట్టిచాకిరి నుండి వారిని విముక్తిల్ని చెయ్యడంలో పాల్గొన్నది. గ్రామపెత్తందార్ల కింద వున్న దేవుని మాన్యం, శివాయిజామ భూమలు పేదలకే దక్కాలన్న పార్టీ నినాదాన్ని అమలు పరచడంలో భాగంగా భూ పోరాటాలు నిర్మిస్తూ ప్రజలకు పోరాటతత్వాన్ని పెంచడంలో కృషి చేసింది.

గ్రామ పెత్తందారుగా చెలామణి అవుతూ ప్రజా పోరాటాలకు అడ్డువచ్చిన సంగిరెడ్డిని దేహశుద్ధి చేయడంలోనూ, ఇన్ఫార్మర్స్‌ను శిక్షించడంలోనూ, చురుగ్గా పాల్గొంది. అంతేకాదు శత్రువు చొరవను దెబ్బతీయడంలో భాగంగా శ్రీశైలం, సున్నిపెంట రెయిడ్స్ లో పాల్గొని మిలటరీపరంగా అనుభవాన్ని సంపాదించుకుంది.

2000 సంవత్సరంలో ఏ.సిలోకి తీసుకోగా ప్రత్యేక మహిళాటీమ్ కమాండర్‌గా వుంటూ మహిళా సంఘాల నిర్మాణాల కోసం కృషి చేసింది. స్వీయాత్మక శక్తుల కొరతవల్ల టీమ్‌ను రద్దు చేయడంతో టిపిడి ఏ.సి.లోనే వుండి 1+1 గా పోతూ మహిళా రంగాన్ని చూసేది. మహిళలపై గుప్పిస్తున్న బూటకపు సంస్కరణ లను ఎండగడ్తూ పాదుపు సంఘాల మహిళలను ఆలోచింప చేయ డంలో చాలా కృషి చేసింది. మహిళా సంఘాలను నిర్మించింది.

కా.శాంతి తన సుదీర్ఘ విప్లవ జీవితంలో ఎదురైన కష్ట, నష్టాలను; ఒడిదుడుకులను నిబ్బరంగా ఎదుర్కొంటూ విప్లవ ఆదర్శాల కోసం అత్యంత ఓపికగా కృషిచేసింది. ''ప్రజల కోసం తలవంచి ఎద్దులా పని చేయాలి'' అన్న మావో సూక్తిని తను మనసారా అంగీకరించి అమలు చేసింది. చివరి క్షణంలో కూడా జ్వరంతో వున్న కా.శాంతి శత్రువుపైకి దూసుకునిపోయింది. నాయకత్వాన్ని రక్షిస్తూ యుద్ధంలో విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగిస్తు అమరత్వం పొందింది.

కా.శాంతికి నివాళి అర్పించడమంటే, విప్లవంలో వచ్చే ఒడిదుడుకులలో మరింత నిబ్బరతను ప్రదర్శిస్తూ శత్రువును ఓడించడమే.

## 'వేంపెంట'లో విరిసిన ఎర్రమందారం కా.శారద అమర్ హై

ప్రకాశం జిల్లాలో 2003 జూన్ నెలలో జరిగిన గుట్టలచేను ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం వెంటనే ఏర్పాటు చేసిన వెగలగుంత ఆంబుష్‌లో పాల్గొనడానికి ముందుకొచ్చిన వారిలో ప్రొటెక్షన్ సభ్యురాలు శారద శత్రువు జరిపిన కౌంటర్ ఆంబుష్‌లో వాడి చేతికి చిక్కి తీవ్ర చిత్రహింసలకు గురయ్యి, హత్య గావించబడింది. ఆకాశంలో అరుణతారై నిలిచింది.


కా.శారద

కా.శారద అసలు పేరు కృప. ఆమె వూరు కర్నూలు జిల్లా, పాములాడు మండలంలోని వేంపెంట గ్రామం. శారద తల్లి ఆగ్రామ విప్లవ మహిళా సంఘంలో ముఖ్య భూమిక పోషించేది. తల్లి రాజకీయాలను ఏమి తెలియని వయసులో కొంత వ్యతిరేకించేది కృప.

శారదకు చిన్నతనంలో పెళ్లి చేసారు. ఆమె భర్త అనుమానించడంతోపాటు, కొట్టేవాడు. ఆ బాధలను సహించలేని స్థితిలో వేంపెంట మారణహోమం చూసి కదిలిపోయిన ఆమెకు విప్లవోద్యమం పరిష్కారం చూపింది. పీడిత ప్రజలపై బుడ్డావంటి భూస్వాముల చర్యలతో కదిలిపోయిన కృప 2001 మొదట్లో పార్టీలోకి పూర్తికాలం వచ్చేసింది. కొద్దికాలం భవనాశి దళంలో సభ్యురాలిగా కొనసాగింది. ఆ తరువాత పార్టీ కోరిక మేరకు ప్రొటెక్షన్ దళంలోకి ఆనందంగా అడుగిడింది.

కా.శారదది కష్టపడి పనిచేసే తత్వం. ఎన్ని పనులు చేసినా 'అలసిపోయిన, రెస్ట్ తీసుకోవాలి' అనుకునేది కాదు. ఏ విషయంలోనయినా ఆసక్తి, నేర్చుకోవాలనే తపన, పట్టుదల అన్నీ ఆమె సొంతం. చదువు రాకపోవడం అన్నిటికీ అడ్డంకి అని గుర్తించి ఖాళీ దొరికితే పెన్నూ పేపరు పట్టుకుని నేర్చుకునేది. చదువు కూడా త్వరగానే నేర్చుకున్నది. చదువు కొంత రాగానే పాటల పుస్తకాన్ని వదలకపోయేది. తన కోకిల కంఠంతో అందరినీ ఉల్లాసపరిచేది. ఎప్పుడూ నవ్వుతూ వుండడం ఆమె నైజం. ఎంత సీరియస్ అనారోగ్యం వున్నా కనిపించనీయకుండా 'కష్టపడి పనిచేసే వారే కమ్యూనిస్టు' అంటూ పనులకు ముందుకురికేది. తన వ్యక్తిత్వం ద్వారా కామ్రేడ్స్ గుండెల్లో చెదరని ముద్ర వేసిన కామ్రేడ్ శారదలోని సుగుణాలు మన అందరికీ ఆదర్శం.

## విప్లవ వీరనారి కామ్రేడ్ పద్మ (అలివేలు) అమర్ హై !

పార్టీ నిర్ణయంలో భాగంగా కర్నూల్ జిల్లా నందికొట్కూరు మండలం పాతకోట గ్రామంలో అనారోగ్యం చూయించుకుంటూ షెల్టర్‌లో వున్న కా.పద్మను ద్రోహి ద్వారా సమాచారం అందుకున్న శత్రువు పాతకోటలో కామ్రేడ్ పద్మను అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, పద్మకు రహస్యాలు తెలువవని శత్రువుకు తెలిసినా వాడి క్రూరత్వానికి నిదర్శనంగా కాల్చిచంపి, 2003 అక్టోబరు 30న శవాన్ని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామశివారులోని పందిరిగుట్ట వద్ద పడవేసి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లాడు. ఈ కథను ప్రజలు నమ్మడానికి శవానికి యూనిఫారం తొడిగి తన ప్రక్కన తపంచవేసి పిరికితనాన్ని చాటుకున్నాడు.

కామ్రేడ్ అలివేలు మహబూబ్‌నగర్ జిల్లా, వెల్దండ మండలం, రాచూరు గ్రామంలో కురుమ మధ్యతరగతి కుటుంబంలో జన్మించింది. 23 సంవత్సరాల వయసు వుంటుంది. తల్లితండ్రులకు ఆరుగురి సంతానంలో 5వది. ఫ్యూడల్ సాంప్రదాయాల ప్రకారం కా.పద్మను అజిలాపూర్ గ్రామానికి యిచ్చి వివాహం జరిపించారు. అప్పటికే అజిలాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో ఆమె సహచరుడు వర్గ సంఘంలో పని చేస్తున్నాడు. ఆ పోరాటల ప్రభావం కా.పద్మపై పడింది. తన వివాహం జరిగిన 2వ యేటనే సహచరుడు పూర్తికాలం కార్యకర్తగా (దళసభ్యునిగా) ఉద్యమంలోకి అడుగుపెట్టాడు. పద్మ ఇంటి వద్దనే రెండున్నర సంవత్సరాలు వుండి గ్రామ ప్రజలతోపాటు తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొన్నది. అనేకసార్లుతన సహచరునితోపాటు పూర్తికాలం ఉద్యమంలో పని చేయటమే ఉత్తమమనుకున్నది. 1999 జూన్‌లో పూర్తికాలం వస్తానని పార్టీ ముందు ప్రపోజల్ పెట్టింది. కా.పద్మను పార్టీ కూడా తీసుకోవాలని నిర్ణయించి అదే

ప్రాంతంలోని దళంలో సభ్యురాలిగా నియమించింది. దళసభ్యురాలిగా తన కృషిని దళంలో మొదలు పెట్టింది. మహిళగా శారీరక ధర్మాల వలన కొన్ని అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటు కూడా దళసభ్యురాలిగా విప్లవోద్యమంలో కఠోరమైన జీవితాన్ని అనుభవించింది. '౨౨ జూన్ నుండి ౨౦౦౩ అక్టోబర్ చివరి వరకు కల్వకుర్తి, నల్లమల దళాలలో సభ్యురాలిగా కొనసాగుతూ వచ్చింది. అనారోగ్య సమస్య తీవ్రంగా వేధిస్తున్నా, రాజకీయ వెనుకబాటుతనం ఒకింత కొనసాగినా రహస్యోద్యమం బాట విడువకుండా కొనసాగింది. చివరకు దళ జీవితం కష్టమనుకున్న సందర్భంలో తనకు రహస్యంగా ఒక షెల్టర్‌లో వుంచాలని పార్టీ నిర్ణయించితే అందుకు అంగీకరించి వుండటానికి సిద్ధపడింది. దళాలలో ఎన్ని సమస్యలు ఎదురైనా విప్లవంలోనే తన జీవితాన్ని కొనసాగించాలనే పట్టుదల వీడకుండా కొనసాగింది.

జీవిత భాగస్వామితో ఎదురైన సమస్యలను పార్టీ పద్ధతుల్లో పరిష్కరించుకునేది. శత్రువు ఎన్ని లొంగుబాటు ఎత్తులు వేసినా వాడి ఎత్తులను చిత్తు చేస్తూ విప్లవోద్యమంలో నిలిచింది.

కా.పద్మ విప్లవ జీవితం ప్రజాయుద్ధంలో మిళితమైంది. నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలు సంపూర్తిగా అర్థం చేసుకోకపోయినా పీపుల్స్‌వార్ పార్టీ అంటేనే ప్రజల కోసం పని చేస్తుందన్ననిజాన్ని గ్రహించి ఆ మార్గంలో నడిచింది. ఆమాత్రమైన ప్రజల కోసం సేవచేయాలన్న తన దృక్పథాన్ని వీడకుండా చివరి శ్వాస వరకు విప్లవ వుద్యమంలోనే సైనికురాలిగా కొనసాగింది. ప్రజాసేవకు అంకితమైన కా.పద్మను ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా హత్య గావించబడింది.

కా.పద్మ అమరత్వాన్ని ఎత్తిపడుతూ తన రక్త తర్పణతో సమాజానికి వెలుతురును అందించిన పద్మ బాటలో మరింత మంది విప్లవంలోకి సమీకరిద్దామని శపథం చేద్దాం.

## చిన్న వయసులోనే చిరంజీవిగా ఎదిగిన కా. ఉమ (హెమీమా)

జూన్, ౨౦౦౩లో ప్రకాశం జిల్లా, అర్థవీడులో జరిగిన చింతలముడిపి ఎన్‌కౌంటర్‌లో నలుగురు కామ్రేడ్స్ అమరులైనారు. వారిలో సెంట్రీలో వుండి దళాన్ని అలర్ట్ చేసి శత్రు తూటాలకు బలైంది.

కా.ఉమ పుట్టింది ప్రకాశం జిల్లా, చినగంజాంలో తల్లిదండ్రులు నిరుపేదలే అయినా కష్టపడి ౮వ తరగతి వరకు చదివించారు. పార్టీలో వున్న తన మేనమామను చూడటానికి ౨౦౦౨లో అనుకోకుండా దళానికి వచ్చిన ఉమ దళంలోనే వుండిపోయింది. ఆమె పుట్టి పెరిగిన వాతావరణం, తాను ఎదుర్కొంటున్న సమస్యల వల్ల 'స్త్రీకి స్వేచ్ఛ లభించే చోటంటూ వుంటే అది విప్లవ పార్టీలోనే' అనే విషయాన్ని గ్రహించి ఉద్యమంలో కొనసాగాలని నిర్ణయించుకుంది. ౧౮ఏండ్లు నిండకపోయినా విషయాలను గ్రహించటంలో వయసుకు మించిన తెలివితేటలు ఆమె సొత్తు. ఎంత బలహీనంగా వున్నా చురుగ్గా వుండేది. పట్టుదలగా ఎక్సర్‌సైజులు చేసేది. ఏక సంతాగ్రాహి కావడంతో త్వరలోనే అనేక విషయాలు నేర్చుకుంది. చిన్న వయస్సు కనుక కొంతకాలం చదువుకుంటూ పట్టణరంగంలో పని చేస్తే బాగుంటుం దని పార్టీ చెప్పినా, తాను గెరిల్లా జీవితాన్నే ఎంచుకుంది. వచ్చిన కొద్ది రోజులేక ఆమె వున్న దళంపై కాల్పులు జరిగినా ఏ మాత్రం తొణకలేదు. పైగా ప్రజల సహకారం చూసి మరింత ఉత్తేజం పొందింది. ఎంతో మంచి ఉద్యమ భవిష్యత్తున్న కా.హెమీమా పార్టీలో కొచ్చిన ౭ నెలల్లోనే అమరురాలు కావడం అత్యంత బాధాకరం.

---

*(౨౨వ పేజీ తరువాయి....... మేధోవలస)*

దేశీయ వ్యవసాయాన్ని, పరిశ్రమలను దెబ్బతీసే దిగుమతులను

అడ్డుకోవాలి. దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించడం ద్వారా, అనేక చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమలకు తగిన మార్కెట్‌ను కల్పించాలి. విదేశీ సంస్థల పెత్తనాన్ని తిరస్కరించి, సబ్బుల తయారీ నుండి బట్టల వరకు నిత్యావసర వస్తువులకై దేశీయ మార్కెట్‌పై ఆధారపడాలి. దేశీయ చిన్న వుత్పత్తిదారులకు, రైతులకు తగిన మార్కెట్ ఏర్పడి - వారి కొనుగోలు శక్తి పెరిగి - పరిశ్రమలు, వ్యవసాయం స్వయంసమృద్ధమై గ్రామీణ, పట్టణ నిరుద్యోగానికి పరిష్కారం లభించగలదు.

ఇలా ఇవన్నీ ప్రజల సంఘటితశక్తిపై ఆధారపడి సాధించుకో గలిగినవే. వీటిపై పాలకులను నిలదీయాలి. ప్రజల దైనందిక సమస్యల్ని గాలికి వదిలేసి, 'రామజన్మభూమి' నినాదంతో హిందుమతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా గుజరాత్ తరహా పాలనను దేశ వ్యాపితంగా సాగించాలని బిజెపి ఉవ్విళ్లూరుతుండగా; 'జన్మభూమి', 'స్వర్ణాంధ్రప్రదేశ్', 'విజన్ ౨౦౨౦' లాంటి బూటకపు నినాదాలతో కోటివరాలను అందిస్తామనే మోసపూరిత విధానాలతో తిరిగి గద్దె నెక్కటానికి చంద్రబాబు ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది. వీరి మాయాజాలం నుండి యువత బయటపడి, వీరికి చరమగీతం పాడాలి. దున్నేవారికే భూమి ప్రాతిపదికన సాగే వ్యవసాయ విప్లవ కార్యక్రమంలో పాలుపంచుకున్నప్పుడు మాత్రమే నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోగలం. ❑

*(౧౨వ పేజీ తరువాయి ......)*

నడవదు. ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి కొంత ప్రయత్నం చేస్తూనే మనవైపు నుండి వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. మందులు కొని, అన్ని పెంటలకు ఇచ్చారు. ఇందుకుగాను ౨వేల రూ.ల వరకు ఖర్చు అయింది. ఇంకా బడి, సాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, తీవ్ర నిర్బంధం వలన మన ప్రయత్నాలు అమలులోకి రాలేదు. ఈ విప్లవ సంస్కరణలను కూడా యుద్ధం చేస్తూనే నిర్వహించుకోవాల్సి వుంటుందన్న సత్యాన్ని ప్రజలు తమ స్వీయ అనుభవంలో నుండి నేర్చుకుంటున్నారు

*(శత్రు నిర్బంధంరీత్యా విప్లవ సంస్కరణలు అమలు జరిగిన గ్రామాల పేర్లను మార్చి రాసాము)* ❑

---

*(బ్యాక్‌కవర్ తరువాయి ......)*

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మేము ప్రజల విస్తృత ప్రయోజనాలు ఆశించి బేషరతుగా కాల్పుల విరమణ పాటించి సంయమనం పాటించినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం చర్చలకు విఘాతం కల్గించి రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసింది. తిరిగి అటువంటి చరిత్ర పునరావృతం కాకూడదని కోరుతున్నాం. ముఖ్యంగా పోలీసులు రాజకీయ నాయకుల అవతారం ఎత్తకుండా కంట్రోల్‌లో వుంచుకోవాలని కోరుతున్నాం. ఇందుకు భిన్నంగా పోలీసుల కుటిల పన్నాగంతో దాడులకు పాల్పడితే మా ప్రతిఘటన కూడా అంత తీవ్రంగానే వుంటుందని తెలియచేస్తున్నాం. టి.డి.పి.కి బుద్ధి చెప్పినట్లుగానే ప్రజలు కాంగ్రెస్‌కు కూడ బుద్ధి చెబుతారని తెలియచేస్తున్నాం.

# ప్రభుత్వ నిర్బంధాన్ని దిక్కరిస్తూ సమస్యల పరిష్కారానికి పోరాట బాట పడుతున్న విప్లవ ప్రజానీకం

చంద్రబాబు ప్రభుత్వం, లోఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ వార్ ఫేర్‌లో భాగంగా ఒక వైపున గెరిల్లా బలగాలపై నిరంతరాయంగా దాడులు జరుపుతూ మరోవైపు ప్రజల్ని విప్లవోద్యమం నుండి దూరం చేయడానికి తీవ్ర నిర్బంధం అమలు జరపటంతోబాటువిపరీతమైన సంక్షేమ పథకాలు గుప్పిస్తున్నది. చంద్రబాబు అనుసరిస్తున్న ఈ బెత్తం-తాయిలం పద్ధతి ప్రజల్ని ఏ మాత్రం విప్లవోద్యమం నుండి దూరం చేయలేక పోతున్నది. ప్రపంచబ్యాంకు షరతులతో చంద్రబాబు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలు, కార్మికులను, రైతులను, విద్యార్థులను, మేధావులను అన్ని సెక్షన్ల ప్రజల్ని సమస్యల సుడిగుండంలోకి నెడుతున్నాయి. రాష్ట్రం కరువు బారినపడింది. ఈ సమస్యల తీవ్రతతో కొంతమంది రైతాంగం, చేనేత కార్మికులు తీవ్ర నైరాశ్యానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కొన్ని ప్రాంతాలలో రైతాంగం యాదృచ్ఛికంగానైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగపడుతున్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన డాక్టర్ల సమ్మె ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన రాజకీయ సమ్మెగా పేర్కొనవచ్చు. రోజు రోజుకు ప్రజలలో పెరుగుతున్న ఈ అసంతృప్తి బ్రద్దలయ్యే ప్రమాదం పెరుగుతుండటంతో చంద్రబాబు ప్రభుత్వం పోరాటాలను మొగ్గలోనే తుంచివేసే విధంగా తీవ్ర అణచివేతను అమలు జరుపుతున్నది. ముఖ్యంగా ఉద్యమ ప్రాంతంలో ఈ అణచివేత ప్రజలు భరింపశక్యంగాని రీతిలో అమలవుతున్నది. మరోవైపు ప్రజల్ని ఏదోమేరకు సంతృప్తి పరచడానికి సంక్షేమ పథకాలను గుప్పిస్తున్నది. చంద్రబాబు అనుసరిస్తున్న ఈ ద్విముఖ వ్యూహం ప్రజలలో పెరుగుతున్న పోరాట చైతన్యాన్ని ఏమాత్రం నీరుగార్చలేకపోతున్నది. ఇంతటి నిర్బంధంలో సైతం ప్రజలు గెరిల్లా దళాల అండదండలతో తమ సమస్యలను పరిష్కరించుకుంటూ, విప్లవ విజయానికి తమ వంతు కృషి చేస్తున్నారు. గత కొంతకాలంగా వివిధ జిల్లాలలో స్థానిక గెరిల్లా దళాల అండదండలతో రైతాంగం కదిలి అనేక సమస్యలు పరిష్కరించుకున్నారు.

## నల్లగొండ జిల్లాలో పత్తిగిట్టుబాటు ధర పెంచుకున్న రైతాంగం

భారత ప్రభుత్వం డబ్ల్యుటివో తో చేసుకున్న ఒప్పందంతో రైతు పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డచందమైంది. భారత మార్కెట్‌పై బహుళజాతి సంస్థల పట్టుబిగియటంతో రైతుకు గిట్టుబాటు ధర గ్యారంటీ లేకుండా పోయింది. ప్రభుత్వం రైతు సంక్షేమ బాధ్యత నుండి పూర్తిగా పక్కకు తప్పకుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే నల్గొండ జిల్లా రైతు పత్తిగిట్టుబాటు ధర సమస్య ముందుకు వచ్చింది. ఈ సమస్యకు తోడు గ్రామీణ ప్రాంతంలో రైతుపై వడ్డీవ్యాపారుల, నకిలీ పురుగుమందు వ్యాపారుల దోపిడి అత్యంత దారుణంగా మారింది.

ముఖ్యంగా క్రిష్ణపట్టి ఏరియాలో వడ్డీ వ్యాపారులు, పత్తి పండించే రైతుకు వందకు ఐదు రూపాయల మిత్తి...కి పెట్టుబడులు పెడుతున్నారు. చక్రవడ్డీ కూడ అమలవుతున్నది. ముందుగా పెట్టుబడి పెట్టాలంటే పండిన పంటను, తాము చెప్పిన రేట్లకు తమకే అమ్మాలనే షరతు కూడా అమలవుతున్నది. ఇక పురుగు మందుల వ్యాపారులు చేసే మోసం అంతా ఇంతా కాదు. దాదాపుగా ప్రతిషాపులోనూ నకిలీ పురుగుమందులు, విత్తనాలు విక్రయించబడుతున్నాయి. ఇన్ని రకాల దోపిడికి గురి అవుతున్న రైతులు చివరకి తమ కష్టం దక్కకపోగా, అప్పలు తీరే మార్గం కనబడక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితిలో స్థానిక గెరిల్లా దళం చిత్రియాల, కంబాలపల్లి గ్రామాలలో బహిరంగ సభలు పెట్టి రైతాంగాన్ని కదిలించింది. దళం నాయకత్వంలో సంఘటితపడిన రైతాంగం తమ సమస్యల పరిష్కారానికి పురోగమించారు. చిత్రియాల, కంబాలపల్లి గ్రామాలలో సంఘటితంగా కదిలిన రైతాంగం, షావుగార్లను పట్టుకొచ్చి దేహశుద్ధి చేసి క్రింది డిమాండ్స్ సాధించుకున్నారు.

1. ఇక నుండి గ్రామంలో ఎవరూ నకిలీ పరుగుమందులు అమ్మకూడదనీ, ఒరిజనల్ మందులకు పట్టణం (దేవరకొండ)లో రేటుకనన్నా 15రూ లు మాత్రమే అదనంగా తీసుకోవాలని డిమాండ్ పెట్టి ఆమోదింప జేసారు. ఈ లెక్క ప్రకారం గతంలో ఎక్కువ తీసుకున్న పైసలు రైతులకు వాపసు చేయాలని తీర్మానించారు.

2. ఇక నుండి గ్రామంలో ఎవరూ చక్రవడ్డీ కట్టుకోకూడదనీ, సాధారణ వడ్డీ కూడా కేవలం 2రూ.లు మాత్రమే తీసుకోవాలని నిర్ణయించారు.

3. గిట్టుబాటు ధరలు : మార్కెట్ ధరను దృష్టిలో వుంచుకుని నవంబర్‌కు ముందు అమ్మిన పత్తికి 1200రూ.ల నుండి 2200 రూ.లకు డిసెంబర్‌లో అమ్మిన పత్తికి 2,350రూ.లకు పెంచుకున్నారు.

4. మోసపూరితంగా క్వింటాలుకు 7 కేజీలు అదనంగా జోక్కున్న పత్తి రేటును వాపసు చేయాలని నిర్ణయించారు.

5. చిత్తిర్యాల గ్రామం గుట్టపై వుండటం వలన కిరాయి రేటు లారీకి 300రూ.లు అదనంగా అవుతుంటే, రైతుల నుండి షావుకార్లు లారీకి 7,000రు.లు వసూలు చేసారు. ఇట్లా అదనంగా తీసుకున్న పైసలను తిరిగి రాబట్టారు.

ఈ రెండు గ్రామాలలో చేసిన పోరాట ప్రభావం చుట్టుప్రక్కల గల పద్దమాల, వెంకటిగానితండా, బుడ్డోనితండా, దాసతండార్లపల్లి, నల్లసెలమూల తదితర గ్రామాలపై పడి అక్కడ కూడా పై డిమాండ్స్ అమలైనాయి. అయితే మార్కెట్ ధర కూడా రైతుకు గిట్టుబాటు కావడం లేదు. దాన్ని చక్కదిద్దుకోవాలంటే రాష్ట్ర వ్యాపితంగా రైతాంగాన్ని సంఘటితపరిచి సామ్రాజ్యవాద ఏజంట్ అయిన చంద్రబాబు విధానాలకు వ్యతిరేకంగా పోరాడవలసి వుంటుంది. ఈ దిశగానే రైతాంగాన్ని చైతన్యవంతం చేయటం జరుగుతున్నది.

## నల్లమల ఫారెస్టు డివిజన్‌లో ఫారెస్టు అధికారుల అవినీతిని బట్టబయలు పెట్టి కూలిరేట్లు పెంచుకున ఆదివాసీలు

ఫారెస్టు అధికారులు అడవిలో మొక్కలు నాటే కార్యక్రమం పేరుతో లక్షలాది రూపాయలను తమ బొక్కసాల్లో నింపుకొంటున్నారు. ఈ మొక్కలు (నీలిమంద, ఉసిరి, వేప) వలన ఆదివాసీలకు వెంటనే ఒనగూడే ప్రయోజనం ఏమీలేకపోగా, వారి వ్యవసాయ భూముల్లో కూడా ఈ మొక్కలు పెంచాలని ఫారెస్టువాళ్లు ప్రతిపాదిస్తున్నారు. ఈ మొక్కలు నాటే

కార్యక్రమానికి, ఆదివాసీలకు అతి తక్కువ కూలీ ఇస్తూ వారిని విపరీతంగా దోపిడీ చేస్తున్నారు. ఈ పరిస్థితిలో స్థానిక దళం నాయకత్వంలో ఆదివాసీలంతా సంఘటితపడి, కూలిరేట్లపెంపుదల కోసం 9మందితో కమిటి పెట్టుకున్నారు. అప్పటికే వారం రోజుల నుండి పని చేస్తున్న 50మంది కూలీలు కమిటీ నాయకత్వంలో గుంతకు 5రూ.ల నుండి 7 రూ.లకు, మొక్కలు నాటితే 50 రూ.ల నుండి 100 రూలకు కూలి పెంచుకున్నారు. మొక్కలు నాటటం కోసం శాంక్షన్ అయిన 1,50,000 రూ.లలో 50వేలు ఖర్చు అయిపోవటంతో, మిగిలిన డబ్బులతో మొక్కలు నాటవద్దని, మిగిలిన డబ్బుతో తాము కోరుకున్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనీ, ఆ పనులు కూడా తామే చేస్తామనీ, జంగవారిపల్లె, గంజివారిపల్లె, తిరునాయనిచెరువు, దద్దనాల ప్రజలు డిమాండ్ చేసి సాధించుకున్నారు.

అంతకు ముందు పనికి ఆహార పథకం క్రింద కుంట తవ్వితే 13క్వింటాళ్ల బియ్యం శాంక్షన్ అయ్యాయి. ఈ పనికి 20మంది కూలీలు 8 రూజులు పని చేస్తే 1రోజు పని చేసినట్లు మస్టర్‌వేసి రోజుకు ఒక కేజీ బియ్యం ఇచ్చి మిగిలిన బియ్యాన్ని ఫారెస్టు అధికారులు కాజేయాలని చూసారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆదివాసీలు ఫారెస్టరును నిలదీసి, రోజుకు 10 కేజీల చొప్పన తమకు రావలసిన బియ్యాన్ని సాధించుకున్నారు.

## గుంటూరు జిల్లాలో భూముల స్వాధీన కార్యక్రమం

3వ టిసిఓసి తరువాత రాష్ట్ర వ్యాపితంగా భూ ఆక్రమణ పోరాటాలు చేపట్టాలని రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలోని కొన్ని గ్రామాలలో భూ ఆక్రమణ కార్యక్రమాలు జరిగాయి.

*వెంకటాయపాలెం దేవుని మాన్యం స్వాధీనం*

ఈ గ్రామంలో గతంలో పెత్తందార్ల స్వాధీనంలో వున్న దేవుని మాన్యం భూముల్ని పేద ప్రజలకు కౌలుకు ఇచ్చే విధంగా పోరాడి సాధించుకున్నారు. అయితే గత మూడు సంవత్సరాల నుండి కౌలు కూడకట్టటం లేదు. మొత్తం ఉద్యమాభివృద్ధిలో వచ్చిన మార్పును దృష్టిలో వుంచుకుని దున్నేవారికే భూమి ప్రాతిపదికన భూమిని పంపిణీ చేయాలని నిర్ణయించుకుని, గ్రామంలో భూ పంపిణీ కమిటీని ఏర్పాటు చేసారు. ఇందులో ఇద్దరు మహిళలు కూడా వున్నారు. పూర్తిగా భూమిలేని వ్యవసాయ కూలీల ప్రాతిపదికన 30 మందికి 23 ఎకరాలు పంచారు. గ్రామ పూజారికి వేరే జీవనోపాధిలేక పోవటం వలన 2 ఎకరాలు ఇచ్చారు.

*పులిచింతల*

గతంలో ఇక్కడ భూస్వాములకు వ్యతిరేకంగా భూ ఆక్రమణ పోరాటాలు జరిగాయి. పీడిత రైతాంగం భూస్వాముల భూముల్ని ఆక్రమించుకున్నారు. ఇంకా అనేకపోరాటాలు జరిగిన చరిత్ర ఈ గ్రామానికి వుంది. అయితే ఇదే గ్రామంలో కొంతమంది ఆబ్సెంటీ లాండ్‌లార్డ్స్‌కు భూమి వున్నది. వాళ్లు ఇతర ప్రాంతాలలో సెటిల్ అయి, పెద్ద పెద్ద ఉద్యోగాలు, వడ్డీ వ్యాపారాలు చేస్తూ మంచి హోదా కల్గిన జీవితాన్ని గడుపుతున్నారు. వీరు అప్పడప్పడు వచ్చి కౌలు వసూలు చేసుకుపోతుంటారు. గతంలో వీరికి ఎక్కువ మొత్తంలోనే భూమి వున్నప్పటికీ క్రమంగా అమ్ముకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం జగన్నాధానికి 14 ఎకరాలు, వెంకయ్యకు 5 ఎకరాలు పూర్ణమ్మకు 2.5 ఎకరాలు మిగిలాయి. ఇందులో 14.5 ఎరకాలు మాత్రమే సాగుకు ఉపయోగపడేది. ఈ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రజలందరూ సమావేశమై 9 మందితో కమిటి పెట్టుకున్నారు. భూమిలేని రైతు కూలీలకు ఈ భూమిని పంచారు.

*గొల్లపేట అడవి భూమి స్వాధీనం*

సుమారు 5 సంవత్సరాల క్రితం గ్రామంలోని ప్రజలంతా పార్టీ నాయకత్వంలో కదిలి 100 ఎకరాల అడవిని నరికి సాగు చేయడానికి ప్రయత్నించారు. ప్రభుత్వ నిర్బంధంతో ఆ ప్రయత్నం కొనసాగలేదు. మళ్లా ఈ సారి ప్రజలందర్ని సమీకరించి 9మందితో భూ పోరాట కమిటీని ఏర్పాటు చేసి అడవిని నరికే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో దిగిన రైతుకూలీలంతా పని చేయకపోతే రోజు గడవని వారుకావటంతో, అడవి కొట్టే కాలానికి, పార్టీ సహాయంతో కరువు బియ్యాన్ని సమకూర్చుకున్నారు.

*జండాపెంటలో ఆదివాసీలచే భూ ఆక్రమణ*

జండాపెంట గూడెంలోని చెంచు ఆదివాసీల భూములను, మరసపెంట, కొత్తపుల్లారెడ్డి గూడెంలలోని లంబాడీ పెత్తందార్లు అన్యాయంగా ఆక్రమించుకున్నారు. చెంచు ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని, లంబాడీ పెత్తందారులు కొద్ది మొత్తాలలో అప్పలు, ధాన్యం ఇచ్చి వాటికి బదులుగా భూములు ఆక్రమించుకున్నారు. ఇందుకు మంచి ఉదాహరణగా ఒక మహిళకు 50రూ.ల విలువ చేసే చీర, 10కెజీల వరిగలు (ధాన్యం) ఇచ్చి 3 ఎకరాల భూమిని ఆక్రమించారు. ప్రస్తుతం స్థానిక దళం ప్రోత్సాహంతో 25 కుటుంబాల చెంచులు గతంలో తమకు చెందిన 60 ఎకరాల భూమిని తిరిగి ఆక్రమించుకున్నారు.

★ వెల్దుర్తి మండలంలోని దోవపల్లి గ్రామంలో ప్రజలు 20 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి ప్రజలకు కనీసం దున్నుకోగల ఆర్థిక స్థోమత కూడా లేకపోవటంతో, దున్నుకోవడానికి, విత్తనాలకు పార్టీ నుండి సహకారం లభించటంతో ప్రతి కుటుంబం 2 నుండి 3ఎకరాలలో సజ్జ, జొన్న వేసుకున్నారు.

## అనంతపురం జిల్లా

తూముచర్ల గ్రామంలో భూ ఆక్రమణ పోరాటం

రాష్ట్ర వ్యాపితంగా భూ ఆక్రమణ పోరాటాలు చేపట్టాలని రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తూముచర్ల భూస్వాముల ఆక్రమణలో వున్న 60 ఎకరాల దేవుని మాన్యం కొరకు ప్రజల్ని కదిలించారు. వందలాది మంది ప్రజలు కదిలి భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామంలో ప్రచారం చేసి తరువాత భూమి మీదకు వెళ్లారు. ఈ క్రమంలో అడ్డువచ్చిన భూస్వామ్య గూండాలకు దేహశుద్ధి చేసి 60 ఎకరాల దేవుని మాన్యంతోపాటు కొంత పట్టా భూమిని కూడా ఆక్రమించుకున్నారు.

*కరెంట్ కోతకు వ్యతిరేకంగా కదిలిన రైతాంగం*

రామగిరి ఏరియాలో కరెంటుకోతతో పాటు, కరెంటు బిల్లులు కట్టటం లేదని రైతాంగంపై విద్యుతు అధికారులు దాడులు చేసి స్టార్టర్లు, గుంజుకు పోవటం విపరీతమైంది. ఈ పరిస్థితిలో కరెంటు కోతను నివారించాలనీ, విద్యుత్ అధికారుల దౌర్జన్యం ఆపి వేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది రైతాంగం కదిలి 10 గ్రామాలలో ర్యాలీ తీసారు. ప్రజల కదలికను చూసి, విద్యుత్ అధికారులు కక్షసాధింపుగా ఒక గ్రామానికి పూర్తిగా విద్యుత్ నిలిపివేసారు. దాంతో మరింతగా కోపోద్రిక్తులైన రైతాంగం వందల మంది కదిలి ఎంఎల్ఏ ఇంటి ముందు ధర్నా చేసి జరిగిందానికి ఎంఎల్ఏచేత క్షమాపణ చెప్పించారు. తిరిగి ఆ గ్రామానికి కరెంట్ సాధించారు. అట్లాగే తమ డిమాండ్స్‌ను ఎంఎల్ఏ పట్టించుకుంటా నని హామీ ఇవ్వటంతో రైతాంగం వెనుదిరిగారు. ❑

పత్రికా ప్రకటన

# రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ అమలు జరపాలి

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రాజశేఖరరెడ్డి కొద్ది గంటలలోనే ఆదిలాబాద్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను ప్రస్తావిస్తూ అది 'పోలీసుల విధి' అని ప్రకటించి తన రెండునాల్కల ధోరణిని వ్యక్తపరిచాడు. తన ఎన్నికల ప్రచారంలో ''చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై జుడిషియల్ విచారణ జరిపిస్తానని'' వాగ్దానం చేసిన రాజశేఖరెడ్డి అధికారంలోకి రాగానే పోలీసు చర్యలకు వకాల్తా పుచ్చుకుని గతంలోని ముఖ్యమంత్రులకు ఏమాత్రం తీసిపోనని నిరూపించుకున్నాడు. ఇటువంటి వైఖరి రాష్ట్రంలో పోలీసు రాజ్యం కొనసాగింపుకు దోహదపడుతుందనీ, ఈ వైఖరిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, సంస్థలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాలని కోరుతున్నాము.

ఇదే సందర్భంగా ఒకవైపున ఆదిలాబాద్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను 'పోలీసుల విధి నిర్వహణ'లో భాగంగా జరిగిందని పేర్కొంటూనే, మరో వైపు 'ఎన్‌కౌంటర్‌ను ఆపమని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు పంపుతానని, నక్సలైట్లు కూడా సంయమనం పాటించాలని' విజప్తి చేసాడు. వెంటనే డి.జి.పి ద్వారా పోలీసు యంత్రాంగానికి గాలింపు చర్యలు ఆపమని ఆదేశాలు పంపామని ప్రకటించాడు. ఈ ప్రకటనలలో ఆదేశాలలో ప్రచార ఆర్భాటాలు తప్ప ఏమాత్రం వాస్తవం లేదని తెలియచేస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికే పోలీసు బలగాల నిఘా గాలింపులు కొనసాగుతూనే వున్నాయి. అందుకనే ఇటువంటి అస్పష్టమైన ప్రకటనలు నమ్మి మేము మూల్యం చెల్లించడానికి ఏమాత్రం సిద్ధంగా లేమని తెలియచేస్తున్నాం. పోలీసులు తమ విధి నిర్వహణ కొనసాగిస్తారు కనుక అసలు 'విధి నిర్వహణ' అంటే ఎటువంటి విధులు నిర్వహిస్తారో స్పష్టంగా తెలియ చేయాలని కోరుతున్నాం. ఇటువంటి అస్పష్టమైన ప్రకటనల ముసుగులో చంద్రబాబు ప్రభుత్వం తన ఫాసిస్టు హింసాకాండను కొనసాగించింది. ఇక ఎంత మాత్రం మా పార్టీగానీ, విప్లవ ప్రజానీకంగానీ ఇటువంటి అరాకొరా ప్రకటనలను విశ్వసించరనీ, ప్రభుత్వం తన స్పష్టమైన విధానాన్ని ప్రకటించి ఆచరణలో చూపాలనీ డిమాండు చేస్తున్నాము. చంద్రబాబు ప్రజావ్యతిరేక విధానాలను ప్రచార అంశంగా తీసుకుని ఎన్నికలలో విజయం సాధించిన టిఆర్ఎస్, వామపక్షాలు ''ఏరుదాటిందాక ఓడమల్లన్న, ఏరు దాటింతరువాత బోడి మల్లన్న'' అన్న చందంగా కాకుండా రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు ప్రజలకిచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

## కాంగ్రెస్ పై మా అంచనాలు చారిత్రక వాస్తవాలు

గత 9 సంవత్సరాలుగా రాష్ట్రంలో అత్యంత క్రూరంగా ప్రజావ్యతిరేక విధానాలు అమలు జరిపిన చంద్రబాబుకు ఈ ఎన్నికలలో రాష్ట్ర ప్రజానీకం తగిన బుద్ధి చెప్పారు. ముఖ్యంగా చంద్రబాబు అనుసరించిన ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాలకు, హిందూమతోన్మాద అనుకూల వైఖరికి, రాజ్యం హింసకు వ్యతిరేకంగా ప్రజలలో పెరిగిన నిరసన వెల్లువ చంద్రబాబును పదవీచ్యుతుడ్ని చేసింది. ఏ విధానాలైతే ప్రజల నిరసనకు, కోపాగ్నికి కారణాలైనాయో, ఆ విధానాలకు ఆద్యులు, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ పార్టీ అనేది దాచేస్తే దాగని సత్యం. రాజీవ్‌గాంధీ హయాంలోనే సామ్రాజ్యవాద అనుకూల నూతన ఆర్థిక విధానాలకు బీజాలుపడ్డాయి. పూజల నిర్వహణ పేరుతో అయోధ్యలో రామాలయం ద్వారాలు తెరిపించి దేశంలో మత ఘర్షణలకు తిరిగి ఆజ్యం పోసింది రాజీవ్‌గాంధీ హయాంలోనే. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రధానిగా వచ్చిన పి.వి. నరసింహారావు ఈ విధానాలకు మరింత బలం చేకూర్చాడు. ।౯౧। లో షరతులతో కూడిన ప్రపంచ బ్యాంకు అప్పును తెచ్చి దేశాన్ని మరింతగా పరాధీనం గావించాడు. సంఘపరివార్ దుష్టసేనలు బాబ్రీమసీదును ధ్వంసం చేస్తుంటే మౌనం మాటున తన హిందూమత అనుకూల వైఖరిని ప్రదర్శించాడు. ఇక జాతుల పోరాటాలపైనా, ప్రజాస్వామిక ఉద్యమాలపైనా నెహ్రూ మొదలుకుని పి.వి. నరసింహారావువరకు అత్యంత క్రూరంగా రాజ్యహింసను ప్రయోగించినవారే. ఇది గడచిన చరిత్ర కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారం చెలాయిస్తున్న రాష్ట్రాలలో వర్తమాన చరిత్ర కూడా. ఈ చరిత్ర ప్రజలకు తెలియందేమీ కాదు. ప్రజలు అంత త్వరగా మరిచిపోయే చరిత్ర కూడా కాదు. అయినా ప్రజలు గత్యంతరం లేని పరిస్థితిలోనే అధికారంలో వున్న పాలక పార్టీలను దించి మరో దుష్ట చరిత్ర కల్గిన పార్టీని అధికారంలోకి తీసుకు వస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించకుండా గతంలో తాము ప్రజలకు చేసిన మేలు వల్లనే తమను ప్రజలు గెలిపించారని సంబరపడటం ఆత్మవంచన అవుతుందనీ కాంగ్రెస్ పార్టీకి తెలియచేస్తున్నాం. ఈ దుష్ట చరిత్ర నేపథ్యంలోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి నుండి మరింత నిర్దిష్ట హామీలను కోరుతున్నాం.

రాష్ట్రంలో సానుకల వాతావరణం ఏర్పడి చర్చలకు అనుకూలమైన పరిస్థితి ఏర్పడాలంటే ప్రభుత్వం బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించాలి. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఏర్పడటానికి ప్రభుత్వమే ప్రధాన బాధ్యత వహించాలి. కాల్పుల విరమణను ప్రభుత్వం నిజాయితీగా అమలు జరపాలి. అంటే పోలీసుల కూంబింగ్‌లు, ఎన్‌కౌంటర్లు వుండరాదు. ఎస్.ఐ.బి పోలీసులు గ్రామాలలలో ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేసుకోవడానికి ప్రయత్నించరాదు. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం ఏర్పర్చడం ద్వారా ప్రజాస్వామిక వాదుల, మేధావుల, వివిధ సెక్షన్ల ప్రజల ఆకాంక్షలు వ్యక్తపరుచుకునే అవకాశం కల్పించాలి. వారిపై దాడులు ఆపాలి. ఎన్నికల వాగ్దానం ప్రకారం బూటకపు ఎన్‌నకౌంటర్లపై జుడిషియల్ విచారణకు తగిన ఏర్పాట్లు చేయాలి. మా పార్టీపై, ప్రజాసంఘాలపై నిషేధం ఎత్తేసి చర్చల ప్రక్రియను సులభతరం చేయాలి.

ప్రభుత్వం ఎప్పుడైతే కాల్పుల విరమణ ప్రకటించి, పైన చెప్పిన విషయాలను చిత్తశుద్ధితో అమలుకు సిద్ధపడితే, మావైపు నుండి సాయుధ చర్చలు ఆగిపోతాయని హామీ ఇస్తున్నాం. కాల్పుల విరమణను ప్రకటిస్తాం. ప్రజల విస్తృత ప్రయోజనాలకు కట్టుబడి వున్న మేము ప్రజల సమస్యలు చర్చించడానికి, అందుకు సానుకూల వాతావరణం ఏర్పర్చడానికి సిద్ధంగా వున్నామని తెలియచేస్తున్నాం.

**(తరువాయి 27వ పేజీలో......)**